కిషన్‌చందర్ రచనలు-1
రూ॥ 200/-
పేజీలు: 220




ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


ఏడాదికి రెండుసార్లు టెన్త్ పరీక్షలు

దాడులు సక్సెస్ కాబట్టే తలొగ్గిన ఇరాన్

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సైనిక వ్యయం


లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 206 | గురువారం | 26 -06-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## పంచాయతీ ఎన్నికలు

# 3 నెలల్లో జరపాలి



- రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఎన్నికల సంఘానికి హైకోర్టు ఉత్తర్వులు
- ఎన్నికల నిర్వహణకు సెప్టెంబర్ 30 తుది గడువుగా విధింపు
- 30 రోజుల్లో వార్డుల విభజన, రిజర్వేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వానికి ఆదేశం
- ఆ తర్వాత 60 రోజుల్లో ఎన్నికలు నిర్వహించి ఫలితాలు వెల్లడించాలి

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ సర్పంచులు, వార్డు మెంబర్ల పదవులకు మూడు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేస్తూ తీర్పు చెప్పింది. ఎన్నికలు నిర్వహించేందుకు సెప్టెంబర్ 30 తుది గడువుగా విధించింది. తమ తీర్పు వెలువడిన తర్వాత 30 రోజుల్లో వార్డుల విభజన, రిజర్వేషన్ల వర్గీకరణ పూర్తి చేయాలని రాష్ట్రానికి ఆదేశించింది. ఆ తర్వాత వాటి వివరాలు అందుకున్న రాష్ట్ర ఎన్నికల సంఘం 60 రోజుల్లోగా ఆ పదవులకు ఎన్నికలు నిర్వహించి ఫలితాలను వెల్లడించాలంది. ఈ మొత్తం ప్రక్రియ సెప్టెంబర్ 30 నాటికి లేదా అంతకంటే ముందుగా పూర్తి చేయాలని చెప్పింది. ఎన్నికలను కొనసాగించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం సమ్మతిని తెలియజేయాలంది. రాష్ట్రం సమ్మతి చెప్పగానే రాష్ట్ర ఎన్నికల సంఘం రెండు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్లు, భద్రత వంటివి రాష్ట్రం ఎన్నికల సంఘానికి కల్పించాలంది. గత పంచాయతీ పాలక వర్గాల కాల పరిమితి ముగిసి 14 నెలలు దాటిందని, ఈ జాప్యం అంశంలోకి తాము వెళ్లడం లేదని స్పష్టం చేసింది. రాజ్యాంగ అధికరణాల ప్రకారం, సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం2018 ప్రకారం గ్రామ పంచాయతీలకు పాలక వర్గాల గడువు ముగిసినందున ఎన్నికలు నిర్వహించాలని తీర్పు వెలువరిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవీదేవి బుధవారం తీర్పు


తరువాయి 2లో


## మధ్యాహ్న భోజనం తయారీకి సోలార్ కిచెన్లు

ఐఎఎస్ అధికారులు వారానికి రెండు పాఠశాలలను సందర్శించాలి

- తక్షణం ఏర్పాటుపై దృష్టిసారించాలి
- విద్యా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలి
- ప్రభుత్వ స్కూళ్లల్లో అవసరం మేరకు నూతన గదులు నిర్మించాలి
- విద్యా శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి
- తెలంగాణ రైజింగ్ – 2047 ఎజెండా రూపకల్పనపై టోనీ బ్లేయర్ ప్రశంస



ప్రజాపక్షం/హైదరాబాద్


తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు వారంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని సూచించారు. విద్యాశాఖపై హైకమాండ్ కంట్రోల్‌లో సిఎం రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో 48 వేల మంది చేరారని అధికారులు సిఎంకు వివరించారు. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన గదులు నిర్మించాలని సిఎం ఆదేశించారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అవసరమైన వసతులను పాఠశాలల్లో కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం తయారీకి సంబంధించి గ్యాస్, కట్టెల పొయ్యిల బాధల నుంచి మధ్యాహ్న భోజనం తయారు చేసే


తరువాయి 2లో


# రోదసీలోకి శుభాంశు

41 ఏళ్ల తర్వాత చరిత్ర సృష్టించిన భారత వ్యోమగామి

- ఆక్సియం- 4 మిషన్‌లో భాగంగా నింగిలోకి దూసుకెళ్లిన ఫాల్కన్ – 9 రాకెట్
- నేటి సాయంత్రం ఐఎస్ఎస్‌తో అనుసంధానం
- జై భారత్...శుక్లా తొలి సందేశం







న్యూఢిల్లీ : భారత వ్యోమగామి శుభాంశు శుక్లా చరిత్ర సృష్టించారు. అనేకసార్లు వాయిదా పడిన స్పేస్ ఎక్స్ ఫాల్కన్–9 రాకెట్ ప్రయోగం ఎట్టకేలకు బుధవారం మధ్యాహ్నం విజయవంతమైంది. దీంతో శుక్లాతోపాటు మరో మూడుదేశాలకు చెందిన వ్యోమగాములు ఆక్సియం–4 సహాయంతో డ్రాగన్ అంతరిక్ష నౌకలో కూర్చుని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐ ఎస్ఎస్) దిశగా రోదసీలో ప్రయాణం ప్రారంభించారు. 28 గంటల ప్రయాణం తర్వాత నిర్ణీత ప్రకారం ఆక్సియం–4 మిషన్ గురువారం సాయంత్రం 4.30 గంటలకు ఐఎస్ ఎస్‌తో అనుసంధానం అవుతుందని నాసా ప్రాథమికంగా అంచనా వేసింది. లాంఛనాలన్నీ పూర్తయ్యాక మొదట ఆక్సియం–4 మిషన్ కమాండర్ నాసా వ్యోమగామి పెగ్గీ విట్సన్ ఐఎస్ఎస్‌లోకి ప్రవేశిస్తారు. ఆ తర్వాత పైలట్‌గా వ్యవహరిస్తున్న శుభాంషు శుక్లా వెళతారు. స్లావోస్జ్ ఉజ్నన్స్కీ విస్నియస్కీ (పోలెండ్), టోబోర్ కపు (హంగేరీ)లు ఆయనను అనుసరిస్తారు. నలుగురు వ్యోమగాములూ 14 రోజులపాటు ఐఎస్ఎస్‌లో గడిపి రోదసీలో భవిష్యత్ మానవ మనుగడకు సంబంధించిన పలు


తరువాయి 2లో


### యావత్ జాతికీ గర్వకారణం : రాష్ట్రపతి

రోదసీప్రయాణం ప్రారంభించిన శుక్లాకు భారత రాష్ట్రపతి ద్రౌపదీముర్ము శుభాకాంక్షలు తెలియజేశారు. నక్షత్రాల్లోకి ప్రయాణం చేస్తున్న శుభాంషు శుక్లా యావత్ భారతీయులందరికీ గర్వకారణమని ప్రకటనలో పేర్కొన్నారు.

### 140 కోట్లమంది భారతీయుల ఆశలను మోసుకెళ్ళిన శుక్లా : మోదీ

140 కోట్లమంది భారతీయుల ఆశలను, కలలను, కోరికలను శుంభాశు శుక్లా రోదసీలోకి మోసుకెళ్ళా రని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఆక్సియం- 4 మిషన్ ఆరంభ ప్రయోగం విజయవంతం కావడంపట్ల ఆయన హర్షం ప్రకటించారు. ''అంతరిక్ష యాత్ర విజయంతంగా ప్రారంభం కావడం ఎంతో హర్షణీయం. అమెరికా, పోలెండ్, హంగేరీ వ్యోమగాములు కూడా వెళుతున్నారు, వారికి అభినందనలు'' అని ఎక్స్ వేదికగా మోదీ పోస్టింగ్ పెట్టారు.

## వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఎమర్జెన్సీపై డ్రామాలు



- స్వాతంత్రోద్యమంలో, రాజ్యాంగం రూపకల్పనలో ఎలాంటి పాత్రలేనివారు రాజ్యాంగం గురించి మాట్లాడుతున్నారా?
- దేశంలో భావప్రకటన స్వేచ్ఛ, ఉద్యమ స్వేచ్ఛ లేదు
- బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై ఖర్గే మండిపాటు

న్యూఢిల్లీ : దేశంలో అప్రకటిత అత్యవసర పరిస్థితి నెలకొందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. బిజెపి తన పాలనా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి సంవిధాన్ హత్య దివాస్ 'డ్రామా' నిర్వహిస్తోందన్నారు. అత్యవసర పరిస్థితి 50వ వార్షికోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలపై ఖర్గే తీవ్రంగా మండిపడ్డారు. సహనం లేని, సోదరభావం, స్వేచ్ఛ వృద్ధి చెందడానికి అనుమతించని ప్రభుత్వానికి ఇతరులకు ఉపన్యాసాలు ఇచ్చే హక్కు లేదని అన్నారు. కాంగ్రెస్ ఇందిరా భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ బిజెపి–ఆర్ఎస్ఎస్‌ను తీవ్రంగా విమర్శించారు. 'దేశ స్వాతంత్ర్యంలో, రాజ్యాంగాన్ని రూపొందించడంలో ఎలాంటి పాత్ర పోషించని వారు అత్యవసర పరిస్థితిని విధించిన 50 సంవత్సరాల తర్వాత కూడా బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని తిరస్కరించారన్నారు. అదే వ్యక్తులు ఇప్పుడు రాజ్యాంగాన్ని కాపాడటం గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. మోదీపై ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. మోదీ, ఆయన పాలన కారణంగా రాజ్యాంగం ప్రమాదంలో ఉందని ఖర్గే అన్నారు. మోదీ ప్రభుత్వం హయాంలో భావ ప్రకటనా స్వేచ్ఛ, ఉద్యమ స్వేచ్ఛ లేదని


తరువాయి 2లో


## దేశ చరిత్రలో ఎమర్జెన్సీ చీకటి అధ్యాయం



- ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రధాని మోదీ విమర్శనాస్త్రాలు
- రాజ్యాంగ స్ఫూర్తిని ఉల్లంఘించిన విధానాన్ని.. ఏ భారతీయుడూ ఎన్నటికీ మర్చిపోడని వ్యాఖ్య
- 'ఎమర్జెన్సీ డైరీలు- ఒక నాయకుడిని తయారుచేసిన సంవత్సరాలు' అనే పుస్తకంలో మోదీని హైలెట్‌చేసిన 'బ్లూక్రాఫ్ట్'

న్యూఢిల్లీ : దేశంలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) కాలంలో రాజ్యాంగ స్ఫూర్తిని ఉల్లంఘించిన విధానాన్ని ఏ భారతీయుడూ, ఎన్నటికీ మర్చిపోలేడని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆనాటి కాంగ్రెస్ పాలనపై విరుచుకుపడ్డారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తి అయింది. బుధవారం 'ఎమర్జెన్సీ డైరీలు ఒక నాయకుడిని తయారుచేసిన సంవత్సరాలు' పేరిట బ్లూక్రాఫ్ట్ పబ్లిషర్స్ ప్రచురించిన ఒక పుస్తకం విడుదలైంది. ఈ సందర్భంగా నాటి రోజులను గుర్తుకు తెచ్చుకున్న ప్రధాని మోదీ మాట్లాడుతూ తన ప్రభుత్వం రాజ్యాంగ సూత్రాలను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని నొక్కిచెప్పారు. భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలోని చీకటి అధ్యాయాలలో 'ఎమర్జెన్సీ' ఒకటి అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఎమర్జెన్సీ విధించి 50సంవత్సరాలు అయిన సందర్భంగా ఎమర్జెన్సీపై తన 'ఎక్స్' ఖాతాలో వరుస పోస్టుల్లో విమర్శనాస్త్రాలు సంధించారు. రాజ్యాంగంలో పొందుపరచబడిన విలువలను అన్నింటినీ పక్కకు నెట్టారని, ప్రాథమిక హక్కులను నిలిపివేశారని, పత్రికా స్వేచ్ఛను కాలరాశారని, అధికసంఖ్యలో అనేకమంది రాజకీయనాయకులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు, సాధారణ పౌరులను జైళ్లలో నిర్బంధించారని


తరువాయి 2లో


## తీర్పుకు అనుగుణంగా పంచాయతీ ఎన్నికలు



- బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ కట్టుబడి ఉంది
- ఎన్నికల లోపే కోటా అమలుపై చర్చించి నిర్ణయం తీసుకుంటాం
- పదేళ్ల బిఆర్ఎస్, ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం
- టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

పదేళ్ల బిఆర్ఎస్ పరిపాలన, ఏడాదిన్నర కాంగ్రెస్ పరిపాలనపై చర్చకు సిద్ధమని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. న్యాయస్థానం తీర్పుకు అనుగుణంగానే రాష్ట్రంలో స్థానికల ఎన్నికల నిర్వహణ జరుగుతుందని స్పష్టం చేశారు. బిసి రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ల


తరువాయి 2లో


## బనకచర్లపై 30న పవర్ పాయింట్




- బనకచర్లను చట్టపరంగా అడ్డుకుంటాం
- రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా చూడడమే కర్తవ్యం
- రాష్ట్ర నీటిపారుదల శాఖకు ఇద్దరు సైనికాధికారులు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి–బనకచర్లను చట్టపరంగా అడ్డుకుంటామని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖమంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రైతాంగం ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా చూడడమే తమ ముందున్న కర్తవ్యమని ఆయన తేల్చి చెప్పారు. ఈ ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణా ప్రాంత ప్రయోజనాలు ఏ విధంగా దెబ్బ తింటాయో, నష్టం ఎలా వాటిల్లుతుందనే అంశంలో బలమైన వాదనలు వినిపించి ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలువరిస్తామన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పుట్టుకొచ్చిన గోదావరిబంకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తే


తరువాయి 2లో

## నాటో రక్షణ వ్యయం 5 శాతానికి పెంపు

- హేగ్ సదస్సులో సభ్యదేశాల నిర్ణయం
- కొత్త నాటోను చూస్తాం : రక్షణకు ట్రంప్ పూర్తి భరోసా

హేగ్ : జిడిపిలో రక్షణ వ్యయాన్ని 5 శాతం మేరకు భారీగా పెంచాలని నెదర్లాండ్స్ ప్రముఖ నగరం ది హేగ్‌లో బుధవారం ప్రారంభమైన నాటో సదస్సులో సభ్యదేశాలు నిర్ణయించాయి. నాటోలో సమూల మార్పులు చేయడంకోసమే ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న సవాళ్ళు, తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలన్న తపన, రష్యా భయం కారణంగా ఆచరణలో దాదాపు అతి కష్టసాధ్యమైన లక్ష్యాన్ని నాటో సభ్యదేశాలు తలకెత్తుకున్నాయి. రక్షణరంగంలో ఆధునిక యుద్ధ యంత్రాలను సమకూర్చుకోవడంలో వెనకబడ్డామని ముఖ్యంగా యూరప్ దేశాలు చాలా గట్టిగా నమ్ముతున్నాయి. ఇక రక్షణ వ్యయాన్ని పెంచుతూ ఒక ఒప్పందంపై సంతకాలు చేయడమే మిగిలింది. రాబోయే పదేళ్ళలో ఈ లక్ష్యాన్ని సభ్యదేశాలు పూర్తిచేస్తాయి. ఈ వ్యయంలో 3.5 శాతం రక్షణ సామాగ్రికి, 1.5 శాతం భద్రతా అవసరాలకు ఖర్చు పెడతారు. సభ్యదేశాలన్నీ ఈ నిర్ణయానికి పూర్తి మద్దతు తెలియజేశాయి. ఐతే స్పెయిన్ మాత్రం రాబోయే పదేళ్ళలో తాను ఆ స్థాయిలో రక్షణ వ్యయాన్ని కేటాయించలేనని స్పష్టం చేసింది. చాలా దేశాలకు ఈ రక్షణవ్యయ పెంపు అదనపు భారమే. కొత్తగా అదనపు నిధులు ఎక్కడి నుండి ఈ దేశాలు తీసుకొస్తాయన్న విషయంపై తదుపరి సదస్సు అనంతరం సమీక్షలు, విశ్లేషణలు కొనసాగుతాయి. రెండురోజులు జరిగే ఈ సదస్సులో 32 యూరప్ దేశాలతోపాటు


తరువాయి 12లో


## 'కిడ్నీ రాకెట్' కలకలం...

- కోదాడ పోలీసులకు చిక్కిన అంతరాష్ట్ర కిడ్నీ రాకెట్ ముఠా...
- కిడ్నీలు మార్పిడి చేయిస్తామంటూ రూ.లక్షల్లో టోకరా పెట్టిన వైనం
- నిందితుల్లో విజయవాడ, శ్రీకాకుళం, గుంటూరు వాసులు




ప్రజాపక్షం/కోదాడ

సినిమాలను మైమరింపించే మోసాలు వెలుగులోకి రావడంతో జనం భయాందోళన గురవుతున్నారు. తాజాగా కోదాడ పట్టణంలో కిడ్నీ రాకెట్ ముఠా కలకలం రేపుతుంది. పోలీసులకు చిక్కిన కిడ్నీ రాకెట్ ముఠా నిందితుల వివరాలను కోదాడ డిఎస్‌పి శ్రీధర్‌రెడ్డి బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళంకు చెందిన మొత్తం పదిమంది నిందితులు ముఠాగా ఏర్పడి విజయవాడలోని కిడ్నీ డయాలసిస్ సెంటర్ల చుట్టూ తిరుగుతూ కిడ్నీ వ్యాధి బాధితులను


తరువాయి 12లో


## భూ సమస్యలపై జోక్యం చేసుకోండి

- ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించిన భూములపై కేంద్ర ప్రభుత్వానికి మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి
- నష్టపరిహారం చెల్లించకుండా ప్రైవేట్‌కు బదలాయిస్తే రాష్ట్రానికి నష్టం వస్తుందని వెల్లడి
- ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలని కేంద్రమంత్రి కుమారస్వామికి వినతి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు కేటాయించిన భూముల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ఐటి, పరిశ్రమల,వాణిజ్య శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు కోరారు. ఈ మేరకు న్యూఢిల్లీలో బుధవారం భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని కలసి ఈ విషయమై విపులంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు గతంలో కేటాయించిన


తరువాయి 12లో

# ప్రపంచం
WORLD NEWS

## న్యూయార్క్ మేయర్ పదవికి డెమోక్రాట్స్ అభ్యర్థిగా భారత సంతతి నేత



**న్యూయార్క్ :** న్యూయార్ మేయర్ పదవికి త్వరలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష డెమొక్రటిక్‌పార్టీ తరపున అభ్యర్థిగా భారత సంతతికి చెందిన జోహ్రాన్ మమ్‌దానీ అంతర్గత ఎన్నికల్లో విజయం సాధించారు. నవంబరు 4వ తేదీన మేయర్ పదవికి జరిగే ఎన్నికల్లో ఆయన గనుక గెలిస్తే, న్యూయార్క్‌కు మొదటి ముస్లిం మేయర్ అవుతారు. న్యూయార్క్ మేయర్‌గా భారత సంతతికి చెందిన మొదటి నాయకుడు అవుతారు. మమదానీ తల్లి ఒడిశా రూర్కెలాలకు చెందిన మీరా నాయర్. ఆమె భారత్‌–అమెరికా చిత్రదర్శకురాలుగా, నిర్మాతగా మీరా బాయ్ ఫిలిమ్స్ కంపెనీ వ్యవస్థాపకురాలుగా ప్రసిద్ధురాలు. ఆమె రెండు వివాహాలు చేసుకున్నారు. ఆమె రెండో భర్త మహ్మద్ మమదానీ ఉగాండా విద్యావేత్త, రాజకీయ వ్యాఖ్యాత, రచయిత.

## ఇరాన్ పాలనపై ఇజ్రాయెల్ టెర్రరిస్టు ముద్ర

**టెల్‌అవీవ్ :** ఇరాన్ సెంట్రల్ బ్యాంకుపై టెర్రరిస్టు ముద్రవేస్తూ ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఐ. కట్జ్ బుధవారంనాడు ఒక ఉత్తర్వుపై సంతకం చేశారు. ఇరాన్‌లో పలు సంస్థలను కూడా ఉగ్రవాద సంస్థలుగా ఆ ఉత్తర్వులో ఆయన ప్రకటించారు. ఇరాన్ సాయుధబలగాలతో సంబంధాలున్న ఒక కంపెనీనీ, మరో రెండు బ్యాంకులను ఉగ్రవాదసంస్థలుగా పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ఇంటిలిజన్స్ సర్వీసెస్ సమాచారం మేరకు ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇరాన్ పాలకులు ఉగ్రవాదులకు పెట్టుబడులు సమకూర్చే ప్రధాన కేంద్రంగా ఉన్నారని, మధ్యప్రాచ్యం అంతటా ఉగ్రవాదులకు మద్దతు ఇస్తూ, వారికి నిధులు సమకూరుస్తోందని కట్జ్ ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. మధ్యప్రాచ్యంలో ఉగ్రవాదాన్ని పెంచిపోషించే వ్యవస్థకు ఇజ్రాయెల్ ప్రధాన కేంద్రంగా ఉందని పేర్కొన్నారు. ఇరాన్ సెంట్రల్ బ్యాంక్‌తోపాటు షహర్ బ్యాంక్, మెల్లట్ బ్యాంక్, ఇరాన్ సాయుధ దళాల జనరల్ స్టాఫ్ యాజమాన్యంలోని సెఫెహర్ ఎనర్జీ జహాన్ అనే కంపెనీని కూడా ఈ ఉగ్రవాద జాబితాలో చేర్చారు.

**ఇరాన్‌లో తిరిగి సాధారణ జనజీవనం**

కాల్పుల విరమణ జరిగిందని ఇరాన్ ప్రజలు జీర్ణించుకోవడానికి కొంత సమయం పట్టింది. కాల్పుల విరమణ ప్రకటన జరిగిన మరునాడు బుధవారంనాడు ఇరాన్‌లో తిరిగి సాధారణ జన జీవనం మెల్లిమెల్లిగా ప్రారంభమైంది. టెహ్రాన్ నుండి వెళ్ళిపోయిన ప్రజలు తిరిగి రావడం ప్రారంభించారు. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందని ప్రకటించిన ట్రంప్ ఈ ఒప్పందం సజావుగా అమలు జరుగుతోందని బుధవారం నాడు కూడా మరో ప్రకటన చేశారు. టెహ్రాన్ వెలుపల ఇతర గ్రామీణ ప్రాంతాలలో వీధుల్లో రద్దీ బాగా పెరిగింది.

## చీకటి అధ్యాయం
**(మొదటి పేజీ తరువాయి)**

ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఎమర్జెన్సీ పీరియడ్‌లో 'అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రజాస్వామ్యాన్ని నిర్బంధంలో ఉంచింది' అని ప్రధానమంత్రి చెప్పారు. గత సంవత్సరం మోదీ ప్రభుత్వం ఎమర్జెన్సీ వార్షికోత్సవాన్ని 'సంవిధాన్ హత్య దివస్'గా ప్రకటించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగానికి విస్తృతమైన మార్పులు చేసి 42వ రాజ్యాంగ సవరణ తీసుకువచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుతంత్ర పాలనకు ఎమర్జెనీ ఒక ఉదాహరణగా నిలిచిందని, దానిని జనతా ప్రభుత్వం తిప్పికొట్టిందన్నారు. ముఖ్యంగా పేదలు సహా అణగారిన వర్గాలు, పీడిత తాడిత అట్టడుగువర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని వారి గౌరవాన్ని అవమాన పర్చిందని ప్రధానమంత్రి మోదీ వివరించారు. మన విజన్ 'వికసిత్ భారత్'ను సాకారం చేసుకునేందుకు అందరం కలిసికట్టుగా పనిచేద్దాం. పేదలు, అట్టడుగువర్గాల ప్రజల కలల సాకారం పురోగతిని ఉన్నత శిఖరాలకు తీసుకెళదాం' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో చెక్కు చెదరని ఆత్మవిశ్వాసంతో పోరాడుతూ ముందు వరసలో నిలిచిన ప్రతీ వ్యక్తికీ సెల్యూట్ చేస్తున్నాను అని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

**ఎమర్జెనీ వ్యతిరేక ఉద్యమం నాకు ఒక అభ్యాస అనుభవం : ప్రధాని మోదీ**

ఎమర్జెన్సీ కాలంలో తన పాత్రను వివరించే ఒక పుస్తకం బుధవారం విడుదలైంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ 'ఆ కాలం తనకు ఒక అభ్యాస అనుభవం' అని వివరించారు. ప్రజాస్వామ్య చట్రాన్ని కాపాడుకోవాల్సిన ప్రాముఖ్యతను మోదీ ఈ సందర్భంగా విపులీకరించారు. 'ఎమర్జెన్సీ డైరీలు ఒక నాయకుడిని తయారుచేసిన సంవత్సరాలు'పేరుతో ప్రచురితమైన ఈ పుస్తకం ప్రజాస్వామ్య ఆదర్శాల కోసం మోదీ చేసిన పోరాటాన్ని హైలెట్ చేసింది. 'బ్లూ క్రాఫ్ట్' అనే పబ్లిషింగ్ సంస్థ ఈ పుస్తకాన్ని ప్రచురించింది.ఎమర్జెన్సీ సంవత్సరాల కాలంలో తన ప్రయాణ ముఖ్య ఘట్టాలను ఈ పుస్తకం క్రమానుగత శ్రేణిలో వివరించిందని, ఆసమయంలో తన జ్ఞాపకాలను ఎన్నింటినో తన ముందుకు తిరిగి తీసుకొచ్చిందని ప్రధానమంత్రి మోదీ గుర్తు చేశారు. ఎమర్జెన్సీ చీకటిరోజులను గుర్తుకు చేసుకున్న వారందరూ, లేదా ఆ కాలంలో బాధపడ్డ వారందరూ తమ అనుభవాలను సోషల్ మీడియాలో పంచుకోవాలని ఆయన తన 'ఎక్స్' పోస్టింగ్ ద్వారా కోరారు.

# దాడులు సక్సెస్ కాబట్టే తలొగ్గిన ఇరాన్

## అణు ప్రణాళికను దశాబ్దాలు వెనక్కి నెట్టేశాం : ట్రంప్



**హేగ్:** ఇరాన్‌పై అమెరికా చేసిన దాడులు విజయవంతమైనందువల్లనే కాల్పుల విరమణకు ఆ దేశం అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ప్రశాంతంగా అమలు జరుగుతోందని నాటో సదస్సుకు వెళ్ళిన ట్రంప్ నెదర్లాండ్స్‌లో చెప్పారు. అణుస్థావరాలపై శక్తిమంతమైన బాంబు దాడులద్వారా ఇరాన్ అణుకార్యక్రమాన్ని తిరిగి దశాబ్దాలకాలం వెనక్కి నెట్టేశామని చెప్పారు. దాడులు అసంపూర్ణంగా ఉన్నాయని పెంటగాన్ లోని గూఢచారి సంస్థ నివేదిక చెప్పినప్పటికీ ట్రంప్ పైవిధంగా ప్రకటించుకున్నారు.

యుద్ధమొదలైన 10వ రోజున మూడు ప్రధాన అణుస్థావరాలపై అమెరికా దాడులకు ముందుగా శుద్ధిచేసిన యురేనియంను, ఇతర పదార్థాలు, పరికాలను సురక్షిత ప్రాంతాలకు ఇరాన్ తరలించిందని తాను భావించడంలేదని ట్రంప్ స్పష్టం చేశారు. ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ అణుకేంద్రాలపై తాము చేసిన దాడులు విజయవంతం కాకపోయి ఉంటే ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణకు ఇరాన్ అంగీకరించి ఉండేదికాదన్నారు. ''అదొక విధ్వంసకరమైన దాడి, ఆ దాడి, అలా చేయబట్టే ఇరాన్ ఇప్పుడు స్థిరపడింది'' అన్నారు. ''మేం ఇప్పుడు ఎలాంటి ఆందోళనా చెందాల్సిన అవసరం లేదు, వారు తిరిగి అణు కార్యక్రమాన్ని సిద్ధం చేసుకోవాలంటే సంవత్సరాలు సంవత్సరాలు గడవాలి, ఇప్పటికిమాత్రం యావత్ అణువ్యవస్థ కుప్పకూలిపోయింది'' అన్నారు. అణు కార్యక్రమాన్ని పునర్నిర్మిస్తే తిరిగి దాడులు చేసే విషయాన్ని ఆయన తోసిపుచ్చలేదు. హేగ్‌లో ట్రంప్ మాట్లాడుతూ, ఇరాన్ అణుస్థావరాలపై దాడులు చేసిన తర్వాత పరిస్థితిని తమ ఇంటిలిజెన్స్ వర్గాలు ఇంకా సమీక్షిస్తున్నాయని, ఆ నివేదిక ఇంకా పూర్తి కాలేదని చెప్పారు. కాగా యుద్ధ విరమణ చేసిన రెండు దేశాలూ తీవ్ర అసంతృప్తితోనే ఉన్నాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ట్రంప్ ప్రకటించిన వెంటనే రెండు దేశాలూ యుద్ధాన్ని విరమించలేదు. రెండు దేశాలూ పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఇరాన్ దాడుల్లో నలుగురు మరణించినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఐతే యుద్ధంలో తాము విజయం సాధించామని రెండు దేశాలూ ప్రకటించుకున్నాయి. తమ లక్ష్యాలను చేరుకున్నామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నేతన్యాహూ చెప్పారు.

**పేలవమైన దాడులు : ఇరాన్‌పై ట్రంప్ అవహేళన**

మూడు అణు కేంద్రాలపై అమెరికా చేసిన దాడులకు ప్రతీకారంగా మధ్యప్రాచ్యంలో ఉన్న తమ స్థావరాలపై ఇరాన్ సోమవారంనాడు చాలా పేలవమైన దాడులు చేసిందని డోనాల్డ్ ట్రంప్ అవహేళన చేశారు. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను గమ్యం చేరకుండా దారిమధ్యలోని ధ్వంసం చేశామన్నారు. ఈ మేరకు తన సొంత సోషల్ మీడియా ట్రూత్ సోషల్‌లో ఆయన పోస్టింగ్ పెట్టారు. ఐతే ఈ సందర్భంగా ఇరాన్‌కు కృతజ్ఞతలు కూడా తెలియజేశారు. ఖతార్ రాజధాని దోహాలో ఉన్న అల్ ఉదైద్ వైమానిక స్థావరంపై దాడి చేస్తామని ఖతార్ ప్రభుత్వానికి ముందుగానే సమాచారం చెప్పినందుకు థ్యాంక్స్ అని చెప్పారు. ఇరాన్ 14 క్షిపణులను ప్రయోగించిందనీ, వీటిల్లో 13 క్షిపణులను దారిమధ్యలోనే ధ్వంసం చేశామని చెప్పారు. ''నా ఉద్దేశం ప్రకారం బహుశా ఇరాన్ ఈ ప్రాంతంలో శాంతి సుస్థిరతల దిశగా ముందుకు వెళుతుందని భావిస్తున్నా, ఇజ్రాయెల్‌ను కూడా అదేబాటలో నడిపించేందుకు నేను ఎంతో ఉత్సాహంతో ఉన్నాను'' అని పేర్కొన్నారు. అదేవిధంగా ఇరాన్‌పై దాడులను ప్రశంసించిన తన చిరకాల ప్రత్యర్థి జెబ్ బుష్‌కు కూడా సోషల్ మీడియా వేదిక నుండి ట్రంప్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరాన్‌పై దాడి అమెరికా శక్తిసామర్థ్యాలను రుజువుచేసిందని ఫ్లోరిడా మాజీ గవర్నర్ జెబ్ బుష్ ప్రశంసించారు.

## అణుక్షేత్రాలపై దాడుల ప్రభావం పరిమితమే పెంటగాన్ ఇంటిలిజెన్స్ నివేదిక!

పెంటగాన్‌లోని రక్షణశాఖ గూఢచారి సంస్థ తాజా నివేదిక ప్రకారం చూస్తే, ఇరాన్ అణుస్థావరాలను ధ్వంసం చేశామని చేస్తున్న ప్రచారంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. అమెరికా బి2 బాంబర్లు చేసిన దాడుల ప్రభావం పరిమితమేనని, దాడులు అసంపూర్ణంగా ఉన్నాయని నివేదిక తెలిపింది. ఇరాన్ భవిష్యత్ అణుకార్యక్రమం యథాతథంగా జరుగుతుందన్న భావనలు వ్యక్తం అవుతున్నాయి. అదే సమయంలో ఇరాన్ కూడా తమ అణు కార్యక్రమం ఆగకుండా కొనసాగుతుందని జూన్ 22వ తేదీ తర్వాత కూడా ప్రకటనలు చేసింది. శాంతియుత ప్రయోజనాలకోసం తమకున్న చట్టబద్ధమైన హక్కును ఇరాన్ నిలబెట్టుకుంటుందని, దానిని కాపాడుకుంటుందని ఇరాన్ మంత్రివర్గ ప్రతినిధులు పలు ప్రకటనల్లో తెలియజేశారు. దీనికితోడు గూఢచారి సంస్థ కొత్త నివేదిక కూడా అమెరికా దాడులు ఇరాన్ అణుకార్యక్రమాన్ని పూర్తిగా ధ్వంసం చేయలేదని చెబుతున్నది.

ఇప్పటివరకూ జరిగిన ధ్వంసం నుండి ఇరాన్ తేరుకుని కొద్ది నెలలలోనే తిరిగి అణు కార్యక్రమాన్ని పునరుద్ధరించే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. ఐతే వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవి ట్ మాట్లాడు తూ, ఈ నివేదిక పూర్తిగా తప్పు అని తోసిపుచ్చారు.

అణుబాంబులు తయారు చేయడానికి ఉపయోగపడే యురేనియం–235ను సెంట్రీఫ్యూజ్ యంత్రం ద్వారా తయారు చేస్తారు. ఈ యురేనియంను అనేకసార్లు శుద్ధి చేయడంద్వారా యు–235 గ్యాస్ సెంట్రీఫ్యూజ్ యంత్రం నుండి వెలువడుతుం ది. దీనిని బాంబుల తయారీకి దాచుకుంటారు. యురేనియం–238ను అనేకసార్లు శుద్ధిచేసే ప్రక్రియలో యు–235 న్యూక్లియర్ ఐసోటోప్ లభిస్తుంది. ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో పలుచోట్ల ఈ సెంట్రీఫ్యూజ్ యంత్రాలున్న కేంద్రాలపై దాడులు చేసింది. ఐతే ఇరాన్ వద్ద ప్రస్తుతం వందలకేజీలు శుద్ధిచేసిన యురేనియం ఉంది.

**గూఢచారి నివేదిక లీకేజీ రాజద్రోహం దర్యాప్తు చేయాలి:విట్‌కాఫ్**

పెంటగాన్ రక్షణశాఖకు లభించిన అమెరికా గూఢచారి సంస్థ నివేదిక బయటకు పొక్కడం, తప్పుడు ప్రచారం చేయడం రాజద్రోహమేనని మధ్యప్రాచ్యంలో ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్ కాఫ్ అన్నారు. తాము చేసిన దాడులపై విశ్లేషణకోసం ఈ గూఢచారి నివేదిక రూపొందిందన్నారు. ''నివేదిక బయటకు పొక్కడం రాజద్రోహం, దారుణం, దీనిపై దర్యాప్తు జరగాలి, అందుకు బాధ్యులైనవారిని జవాబుదారీ చెయ్యాలి''అని ఫాక్స్‌న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. తాను అన్ని కోణాల నుండీ ఈ నివేదికలను చదివాననీ, ఇరాన్‌లోని మూడు కీలకమైన అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయని సమర్థించారు.

''మేం ఫోర్డో అణుకేంద్రంపై 12 బంకరు బస్టరు బాంబులను ప్రయోగించాం, అవి అణుకేంద్ర రక్షణ వలయాన్ని ఛేధించుకుని వెళ్ళాయి, ఈ నివేదిక తప్పుడు నివేదిక అన్ని చెప్పడం అవాస్తవం అన్నారు. జూన్ 22వ తేదీన అమెరికా స్టీల్త్ బాంబర్లు అకాశంలోంచి పర్వతాలమధ్య 12 కి.మీ దిగువన లోయలో ఉన్న అణుకేంద్రంపైకి 2,400 కేజీల బరువుగల బంకర్ బస్టర్ పేలుడు పదార్థాలను జారవిడిచాయి.

## పంచాయతీ ఎన్నికలు
**(మొదటి పేజీ తరువాయి)**

అమలుపై పార్టీ చర్చించి నిర్ణయం తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లు అమలు చేసి తీరాలని కాంగ్రెస్ పార్టీ తపన పడుతుంటే, బిసి రిజర్వేషన్ల విషయంలో బిజెపి నేతలు నోరు మెదపడంలేదని పేర్కొన్నారు. రానున్న స్థానిక ఎన్నికలకు, జుబ్లీహిల్స్ ఉప ఎన్నికకు పార్టీని సన్నద్ధం చేసే విధంగా పలు కీలక నిర్ణయాలుతో వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికలపై అనుసరించాల్సిన వ్యూహాలాపై చర్చించామని వెల్లడించారు. తెలంగాణలో ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీదే విజయమని, స్థానిక ఎన్నికల్లో, జుబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తిరుగుండదన్నారు. కేంద్రం ప్రభుత్వం రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నిధులను, పథకాలను మంజూరు చేయకుండా వివక్ష చూపిస్తోందని, బనకచర్లతో రాష్ట్రానికి అన్యాయం జరిగితే చూస్తూ ఊరకోమన్నారు. పోతిరెడ్డి ప్రాజెక్టు కట్టుకోమని జీఓలు ఇచ్చింది బిఆర్‌ఎస్ కాదా, కృష్ణాజలాల విషయంలో హరీశ్‌రావు సంతకం ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలు సంతృప్తిగా ఉన్నారన్నా రు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభు త్వం పనిచేస్తోందని, రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసి రికార్డు సృష్టించడమే కాకుండా కాంగ్రెస్ రైతు పక్షపాతి ప్రభుత్వమని మరోసారి నిరూపించుకున్నామన్నారు. అభూత కల్పనతో బిఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా నడుపుతున్నారని, వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బిజెపి రాజ్యసభ సభ్యులు కృష్ణయ్య కవితకు మద్దతుగా మాట్లాడడం విచారకరమని, క్యాబినెట్‌లో 5 గురు దళితులకు చోటు కల్పించామని, మహిళల అభివృద్ధి గురించి కవిత మాట్లాడటం సిగ్గుచేటన్నారు. మూడు ముక్కలాటతో బిఆర్‌ఎస్ పార్టీ పని ముగిసిందన్నారు. బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కవిత చెప్పినట్టు బిఆర్‌ఎస్‌లో దెయ్యాలుంటే కాంగ్రెస్‌లో దేవతలున్నారన్నారు.

**తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సరే శిక్ష**

కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలు, ఫోన్ ట్యాపింగ్, పలు పథకాల్లో జరిగిన కుంభకోణాలను వెలుగుతీసి ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎంతటి వారు ఉన్నా సరే శిక్ష తప్పదన్నారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో వెలగబెట్టింది ఏంటి అంటే... రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి ఫోన్ ట్యాపింగ్ చేయడమేనని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్‌తో సినీ తారల కుటుంబంలో చిచ్చు పెట్టారని, తుదకు సొంత పార్టీ ఎంఎల్‌ఎల ఫోన్లను ట్యాపింగ్ చేశారని, దేశ చరిత్రలో ఫోన్ ట్యాపింగ్ హేయమైన చర్య అన్నారు.

## నెలల్లో జరపాలి
**(మొదటి పేజీ తరువాయి)**

చెప్పారు. నల్లగొండ జిల్లా మల్లెపల్లి తాజా మాజీ సర్పంచ్ పార్వతి, కుర్మపల్లి తాజా మాజీ సర్పంచ్ శ్రీనివాస్, జనగాం జిల్లా కాంచనపల్లి తాజా మాజీ సర్పంచ్ విజయ, నిర్మల్ జిల్లా తల్వేడ తాజా మాజీ సర్పంచ్ అనిల్‌కుమార్, కరీంనగర్ జిల్లా చంగర్ల తాజా మాజీ సర్పంచ్ వేణుగోపాల్, నిజయతీగూడెం తాజా మాజీ సర్పంచ్ మురళీధర్ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటి తరపు న్యాయవాదులు చేసిన వాదనలను హైకోర్టు ఆమోదించింది. గ్రామ పంచాయతీల పదవీకాలం 2024, జనవరి 31తో ముగిసింది. రాజ్యాంగం ప్రకారం పదవీకాలం ముగిసేలోపే ఎన్నికలు నిర్వహించాలంది ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోవాలి. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు రాష్ట్రం చేయాలి. ఎన్నికలు 14 నెలల కంటే ఎక్కువ సమయమే దాటింది. ఈ ఆలస్యం సమర్థనీయమా కాదో అనే అంశంలోకి వెళ్లడం లేదు. వార్డుల విభజన, సర్పంచుల పదవులు, వాటికి రిజర్వేషన్ల వర్గీకరణ చేసేందుకు 20 రోజుల గడువు కావాలని రాష్ట్రం కోరింది. తాము 30 రోజులు గడువు ఇస్తున్నాం. ఈ మేరకు రాష్ట్రం చేసి రాష్ట్ర ఎన్నికల సంఘానికి వాటి వివరాలు నివేదించాలి. ఆ తర్వాత రాష్ట్ర ఎన్నికల సంఘం రెండు నెలల్లోగా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు పూర్తి చేయాలి. ఎన్నికల నిర్వహణపై ఐదు దశల ప్రక్రియను పూర్తి చేసేందుకు కనీసం 20 రోజులు అవసరమని రాష్ట్రం కోరింది. దీనిని పరిగణనలోకి తీసుకుంటున్నాం. తామిచ్చే తీర్పు ప్రతి అందినప్పటి నుంచి 30 రోజుల గడువు రాష్ట్రానికి ఇస్తున్నాం. ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్రం కూడా సమ్మతి చెప్పాలి. ఆ తర్వాత రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించాలి. ఎన్నికల తేదీలపై కూడా రాష్ట్రం సమ్మతి చెప్పాలి. మొత్తంగా ఈ ప్రక్రియ అంతా సెప్టెంబర్ 30వ తేదీనాటికి లేదా అంతకంటే ముందుగా పూర్తి చేయాలి.. అని తీర్పు చెప్పింది.

**విచారణ సమయంలో హైకోర్టు ప్రశ్న**

స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు గత విచారణ సమయంలో ప్రశ్నించింది. గత ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఎందుకు అమలు చేయలేదని అడిగింది. గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన విచారణ సమయంలో ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహిస్తామని ఇచ్చిన హామీ ఎందుకు అమలు చేయలేదని ఆరా తీసింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లను ఖరారు చేసి ఎన్నికలకు సమాయత్తం అయ్యేందుకు సమారు నెల రోజుల గడువు అవసరమని రాష్ట్రం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ మహ్మద్ ఇమ్రాన్ ఖాన్ చెప్పారు. ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, అయితే, సమగ్ర ప్రక్రియ పూర్తి చేసేందుకు కొంత వ్యవధి అవసమన్నారు. వార్డు విభజన, రిజర్వేషన్ల వర్గీకరణకు కనీసం 20 రోజుల గడువు కావాలని కోరారు దీనిపై రాష్ట్ర ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది విద్యాసాగర్ స్పందిస్తూ, ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు లభించిన తర్వాత స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు రెండు మాసాల సమయం తమకు అవసరమన్నారు. ప్రభుత్వం నుంచి చట్టప్రకారం అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తే, రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి ఏర్పాట్లు చేసేందుకు రెండు నెలల సమయం అవసరమని, ఆ తర్వాత ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉందన్నారు.

## ఎమర్జెన్సీపై డ్రామాలు (మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ చీఫ్ ఆరోపించారు. సంవిధాన్ బచావో గురించి మాట్లాడుతున్న వారు (బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్) 50 సంవత్సరాల నాటి అత్యవసర పరిస్థితిని ఇప్పుడు లేవనెత్తుతున్నారని, ప్రజలు దానిని ఎప్పుడో మరచిపోయినా, ఇప్పుడు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ లేవనెత్తుతున్నాయని మండిపడ్డారు. బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగాన్ని తిరస్కరించాయని, మనుస్మృతిలోని అంశాలు వంటివి మన సంస్కృతి అంశాలు దానిలో లేవని ఖర్గే అన్నారు. వారు (బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్) ఇవన్నీ చేశారని, కానీ ఇప్పుడు వారు అకస్మాత్తుగా జ్ఞానోదయం పొందారన్నారు. కాంగ్రెస్ సంవిధాన్ బచావో యాత్రతో బిజెపి విరుచుకుపడింది. 50 సంవత్సరాల క్రితం అత్యవసర పరిస్థితిని లేవనెత్తుతోంది. ప్రభుత్వం అత్యవసర వార్షికోత్సవాన్ని సంవిధాన్ హత్య దినోత్సవంగా లేదా రాజ్యాంగ హత్య దినంగా జరుపుకుంటుందని కాంగ్రెస్ మండిపడుతోంది. 'ప్రస్తుత పాలకులు పాలించడంలో విఫలమయ్యారు. వారి వైఫల్యం వల్ల పెరిగిన ద్రవ్యోల్బణంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిరుద్యోగం, అవినీతి, ఆర్థిక వైఫల్యానికి ప్రభుత్వం వద్ద సమాధానం లేదు. వారి అబద్ధాలు, వైఫల్యాన్ని దాచడానికి నాటకాన్ని ప్రదర్శించారు' అని ఖర్గే అన్నారు. ఆర్థిక అసమానతలు చాలా పెరిగాయని, వాటిని పూడ్చలేమన్నారు. బిజెపి ప్రభుత్వం అప్రకటిత అత్యవసర పరిస్థితిని తీసుకొచ్చిందని దుయ్యబట్టారు. మణిపూర్‌లో పరిస్థితిని ఎదుర్కోవడంపై కూడా ఖర్గే ప్రభుత్వాన్ని విమర్శించారు.

**శశిథరూర్‌పై ఖర్గే పరోక్ష విమర్శలు :**ప్రధాని నరేంద్ర మోదీపై తిరువనంతపురం ఎంపి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శశిథరూర్ ప్రశంసలు కురిపించడంపై ఆ పార్టీలో తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో మల్లికార్జున్ ఖర్గే స్పందించారు. శశిథరూర్‌పై ఆయన పరోక్షంగా విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి ముందు దేశం ముఖ్యమని.. ఆ తర్వాతే మిగిలినవన్నీ అని స్పష్టం చేశారు. కానీ కొంత మందికి మాత్రం ముందు ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యమని.. ఆ తర్వాతే దేశమని ఖర్గే వ్యం గ్యంగా అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ శశిథరూర్‌పై చర్యలు ఏమైనా తీసుకుంటారా? అని ప్రశ్నకు ఏమీ లేదని ఆయన సూచన ప్రాయంగా తెలిపారు. అయితే తనకు ఇంగ్లీష్ భాషపై అంతగా పట్టులేదన్నారు. ఈ నేపథ్యంలో ఇంగ్లీష్ భాషపై బాగా పట్టున్న శశిథరూర్‌ను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి)లో సభ్యుడిగా తీసుకున్నట్లు వివరించారు.

## రోదసీలోకి శుభాంశు
**(మొదటి పేజీ తరువాయి)**

ప్రయోగాలు, అధ్యయనాలు చేస్తారు. 41 సంవత్సరాల తర్వాత మళ్ళీ రోదసీయాత్ర చేసిన భారత వ్యోమగామిగా శుక్లా చరిత్ర సృష్టించడంతో ఆయన స్వస్థలం లక్నోలో ఆయన తల్లిదండ్రులు, కుటుంబీకులు, స్నేహితుల సంబరాలు అంబరాన్ని అంటా యి. అమెరికా ఫ్లోరిడాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుండి బుధవారం మధ్యాహ్నం 12.01 గంటలకు ఫాల్కన్–9 వాహకనౌక నిప్పులు చిమ్ముకుంటూ ఆకాశంలోకి లేచింది. దీంతో భారత్ సహా అక్కడ హాజరైన వివిధ దేశాల ముఖ్యులు, అతిథులు కరతాళ ధ్వనులు చేస్తూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. నాసా, స్పేస్ ఎక్స్, ఇస్రోలు సంయుక్తంగా ఈ ఆక్సియం–4 మిషన్‌ను చేపట్టాయి. ఫాల్కన్ ప్రయాణం ప్రారంభించిన 10 నిమిషాలలోనే అంచెలంచెలుగా విడిపోయి 200 కి.మీ ఎత్తుకు ప్రయాణించిన డ్రాగన్ అంతరిక్ష నౌక భూకక్ష్య ప్రాంతానికి చేరి పరిభ్రమణం ప్రారంభించింది. అనేకసార్లు ప్రయాణం వాయి దా పడగా బుధవారంనాడు వాతావరణ పరిస్థితు లు 90 శాతం మేరకు అనుకూలంగా ఉండటంతో నాసా ఈ యాత్ర కౌంట్‌డౌన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిం ది. యాక్సియం–4 రోదసీ యాత్రలో వ్యోమగాముల భద్రత అత్యంత కీలకమైన విషయం కావడంతో ఈనెలాఖరువరకూ ప్రయాణానికి తగిన సమయం ఉందని, జూన్ 30వ తేదీ లోపు ఆకాశం లో సానుకూలమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడతాయని నాసా ముందుగానే ప్రకటించింది. స్పేస్ ఎక్స్‌లో అన్ని వ్యవస్థలూ సక్రమంగా పనిచేస్తున్నాయని స్పేస్ ఎక్స్ సర్టిఫై చేసిన తర్వాత వ్యోమగాముల ప్రయాణం ఖరారైంది.

**శుభాంశు శుక్లా సందేశం**

200 కి.మీ ఎత్తులో భూమిచుట్టూ ఉన్న కక్ష్యలోకి డ్రాగన్ అంతరిక్ష నౌక ప్రవేశించగానే ''జై భారత్, జై హింద్'' అంటూ శుక్లా తన తొలి సందేశం పంపారు. ''ఇదెంతో గొప్ప ప్రయాణం'' ((కమాల్ కీ రైడ్ థీ) అని పేర్కొన్నారు.

''నా ప్రియమైన భారత ప్రజలారా! నమస్కారం! మనం 41 సంవత్సరాల తర్వాత తిరిగి రోదసీలోకి చేరుకున్నాం, ఇదొక గొప్ప ప్రయాణం'' అని శుక్లా తన సందేశంలో చెప్పారు.

''మేం సెకనుకు 7.5 కిలోమీటర్ల వేగంతో భూమి చుట్టూ పరిభ్రమిస్తున్నాం, నా భుజాల చుట్టూ మూడు రంగుల భారతీయ జెండాను కప్పుకుని కూర్చున్నాను, తద్వారా నేను మీ అందరితో కలిసే ఉన్నానని మీకు చెబుతున్నాను'' అని హిందీ భాషలో శుక్లా సందేశం పంపారు.

''అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి ఇది కేవలం నా ప్రయాణం మాత్రమేకాదు, భారతీయుల తొలి మానవసహిత రోదసీ ప్రయాణం కూడా. మీలో ప్రతిఒక్కరూ ఈ ప్రయాణంలో నాతో భాగస్వాములుగా ఉండాలని కోరుకుంటున్నా. భారతీయ మానవ సహిత అంతరిక్ష కార్యక్రమాన్ని మనందరం కలిసి చేద్దాం'' అని శుక్లా పేర్కొన్నారు. అదేవిధంగా స్పేస్ ఎక్స్ కూడా అంతరిక్షనౌకలో ఉన్న వ్యోమగాములకు ఒక సందేశం పంపింది. వేచి ఉన్న వారికి దేవుడి ఆశీస్సులు లభిస్తాయని పేర్కొంది.

**14 రోజులు.. 60 ప్రయోగాలు**

984 ఏప్రిల్ 3వ తేదీన సోయూజ్ టి–11 రష్యా నౌక ద్వారా రాకేశ్ శర్మ అంతరిక్షంలోకి వెళ్ళి ఏడు రోజుల 21 గంటల 40 నిమిషాలు అక్కడే గడిపి కొన్ని ప్రయాగాల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత ఇప్పుడు శుభాంషు శుక్లా ఏకంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వెళుతున్న మొదటి భారతీయుడుగా చరిత్ర సృష్టించడమే కాదు, 14 రోజుల పాటు అక్కడే ఉండి పలు వైజ్ఞానిక ప్రయోగాలలో పాల్గొంటారు. 31 దేశాలకు చెందిన 60 ప్రయోగాలను ఈ నలుగురు వ్యోమగాములూ చేస్తారు. ప్రత్యేకించి వీటిల్లో వివిధ భారత్ సంస్థలకు చెందిన ఏడు ప్రయోగాలు ఉన్నాయి. భారత సంప్రదాయ ఆహార పంటలపై ప్రయోగాలు చేస్తారు. పోలెండ్, హంగేరీ వ్యోమగాములు కూడా ఇదేవిధమైన ప్రయోగాలు చేస్తారు. ఆరు పంటలకు సంబంధించిన ప్రయోగాలు, రోదసీలో నీటి ఏనుగు మనుగడకు సంబంధించిన ప్రయోగాలు చేస్తారు.

## 30న పవర్‌పాయింట్
**(మొదటి పేజీ తరువాయి)**

తెలంగాణ ప్రయోజనాలకు జరిగే నష్టంపై ఈ నెల 30వ తేదీన ప్రజాభవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. హైదరాబాద్ ఎర్రమంజిల్ కాలనీలోని నీటిపారుదల శాఖా కేంద్ర కార్యాలయంలో నీటిపారుదల శాఖా ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్‌కుమార్ సుదీర్ఘంగా సమీక్షించారు. నీటిపారుదల శాఖా ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇఎన్‌సి మహమ్మద్ అంజత్ హుస్సేన్, ఇఎన్‌సి ఓయం డిప్యూటీ ఇఎన్‌సి శ్రీనివాస్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. టన్నెల్ నిర్మాణాలలో అపారమైన అనుభవం కలిగిన సుప్రసిద్ధ సైనికాధికారులు ఇద్దరిని నీటిపారుదల శాఖలోకి తీసుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. భారత సైన్యంలో ఇంజినీర్ ఇన్‌చీఫ్‌గా పనిచేసిన జనరల్ హార్పల్ సింగ్‌ను తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖకు సలహా దారుడిగా ఉండమని అహ్వానించామని, అంతర్జాతీయ స్థాయి లో పేరు గడించిన టన్నెల్ టెక్నాలజీ నిపుణులు కర్నల్ పరిక్షిత్ మెహ్రా ఈ జులైలో రాష్ట్ర నీటిపారుదల శాఖలో చేరనున్నారని మంత్రి వెల్లడించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజిలపై ఎన్‌డిఎస్ఎ ఇచ్చిన నివేదికలపై సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ధరణ పనుల కోసం ఎన్‌డిఎస్ఎ డిజైన్ కన్సల్‌టెంట్‌గా వ్యవహరిస్తుందన్నారు. ఎన్‌డిఎస్ఎ ఇచ్చిన ఆదేశాలను సత్వరమే అమలులోకి తీసుకురావాలని ఆయన అధికారులను ఆదేశించారు. పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుగా ప్రతివారం సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు తనకు నివేదికను సమర్పించాలని, కేంద్ర జలసంఘం సూచనలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలన్నారు. డిండి ప్రాజెక్ట్‌పై ఆయన మాట్లాడుతూ భూసేకరణ విషయమై సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించాలన్నారు. శ్రీశైలం ఎడమ కాలువ (ఎస్‌ఎల్‌బిసి) పునరుద్ధరణ పనుల కోసం అంతర్జాతీయ స్థాయి ఏజెన్సీలతో చర్చించి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నామన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పునరుద్ధరణ పనులు చేపట్టే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చామని పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ఖర్చుకు వెనకాడకుండా ముందుకు పోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అదే సమయంలో నీటిపారుదల శాఖలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని, బదిలీల తంతును వెంటనే పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ప్రధాన ప్రాజెక్టులలో పూడిక తీత పనులపై మంత్రి స్పందిస్తూ అనేక జలాశయాలు పూడికతో పూడిపోయి ఉన్నందున 20 నుండి 25 శాతం మేర నీటిసామర్థ్యం తగ్గిన నేపధ్యంలో కేంద్ర ప్రభుత్వం జారీచేసిన జాతీయ మార్గదర్శకాలకు అనుగుణంగా మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నాగార్జునసాగర్ పూడిక తీత పనులను సత్వరం ప్రారంభించాలన్నారు. ఈ విషయంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. దేవాదుల ప్రాజె క్టు మూడో దశ పనుల పురోగతితో పాటు సీతారామ ప్రాజెక్టుకు ప్రస్తుతం కేటాయించిన నిధుల పరిమితులకు లోబడి అదనపు ప్యాకేజీలను రూపొందించే అంశలపై అధికారులు దృష్టి సారించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## సోలార్ కిచెన్లు
**(మొదటి పేజీ తరువాయి)**

మహిళలకు విముక్తి కల్పించాలని, సోలార్ వంట శాలలను ఏర్పాటుపై తక్షణమే దృష్టి సారించాలన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులవుతున్న విద్యార్థుల సంఖ్యకు, ఇంటర్మీడియట్‌లో నమో దు అవుతున్న విద్యార్థుల సంఖ్యకు మధ్య వ్యత్యాసం ఎక్కువ ఉండడంపై సిఎం అధికారులను ప్రశ్నించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా కచ్చితంగా ఇంటర్మీడియట్‌లో చేరేలా చూడాలని సిఎం సూచించారు. ఇంటర్మీడియట్ అనంతరం జీవనోపాధికి అవసరమైన స్కిల్ కోర్సులలో శిక్షణ పొందవచ్చని, తద్వారా వారి జీవితానికి ఢోకా ఉండదని సిఎం అభిప్రాయపడ్డారు.

**రాష్ట్ర ప్రభుత్వంపై టోనీ బ్లేయర్ ప్రశంస**

'తెలంగాణ రైజింగ్2047' విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించిన తెలంగాణ ప్రభుత్వాన్ని ఇంగ్లాండ్ మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్ ప్రశంసించారు. ఈ మేరకు టోనీ బ్లెయిర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఒక లేఖ రాశారు. ఇటీవల ఢిల్లీలో టోనీ బ్లెయిర్‌తో సిఎం రేవంత్ రెడ్డి సమావేశమైనప్పుడు 'తెలంగాణ రైజింగ్ విజన్2047'లో నిర్దేశించుకున్న 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ, పెట్టబడుల సాధన, రైతులు, మహిళా, యువ సాధికారిత, మౌలిక వసతుల కల్పన, ఐటి, ఇతర రంగాల అభివృద్ధి లక్ష్యాలను, చేరుకునే మార్గాలను వివరించారు. తెలంగాణ రైజిం గ్ విజన్ రూపకల్పన, అమలుకు సంబంధించి టోనీ బ్లెయిర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ ఛేంజ్ (టిబిఐజిసి), తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు లెటర్ ఆఫ్ ఇంటెంట్ మార్చుకున్నది. తెలంగాణ రైజింగ్ విజన్2047లోని స్పష్టత నిర్దేశించుకున్న లక్ష్యాలు ఎంతో ఆకట్టుకున్నాయని టోనీ బ్లెయిర్ తన లేఖలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్2047లో నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు ఇండియాలోని టిబిఐజిసి ప్రతినిధి తెలంగాణ ప్రభుత్వానికి సహకరిస్తారని టోనీ బ్లెయిర్ తెలియజేశారు. ఈ క్రమంలో సిఎంఒకు ఏవైనా సందేహాలు ఉంటే ఎటువంటి సంకోచాలు లేకుండా తమ టిబిఐజిసి భారత ప్రతినిధిని సంప్రదించాలని సిఎం రేవంత్ రెడ్డికి టోనీబ్లెయిర్ సూచించారు. విజన్ 2047 డాక్యుమెంట్ ఆవిష్కరణకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు సిఎంకి టోనీబ్లెయిర్ తెలిపారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## బట్టలదండెమే యమపాశమై..

* తండ్రిని కాపాడేందుకు వెళ్లిన కొడుకు...కొడుకును కాపాడేందుకు తల్లి
* కుటుంబాన్ని బలితీసుకున్న విద్యుత్‌షాక్



**ప్రజాపక్షం/ఇల్లెందు:** మండల పరిధిలోని మర్రిగూడెం గ్రామపంచాయతీ ఎల్లాపురంలో బట్టలు ఆరేసే తీగ యమపాశమై తండ్రి, కొడుకు మృతి చెందిన దుర్ఘటన నెలకొంది. వివరాల్లోకి వెళ్లగా.. ఎల్లాపురం గ్రామానికి చెందిన తండ్రి ఏనుగు నర్సయ్య(55)బట్టలదండెం పట్టుకోవడంతో విద్యుద్ఘాతానికి గురయ్యాడు. తండ్రిని చూసి న కొడుకు ప్రవీణ్(30) తండ్రిని కాపాడేందుకు వెళ్లగా విద్యుద్ఘాతానికి గురై ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందా రు. ఇది చూసిన తల్లి ఎర్రమ్మ కేకలు వేసు కుంటూ కాపాడేందుకు వెళ్లి విద్యుద్ఘాతానికి గురైంది. తండ్రి, కొడుకులు మృతి చెందగా.. తల్లి ఎర్రమ్మ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కొమరారం పోలీసులు కేసు నమోదుచేసి ధర్యాప్తు చేస్తున్నారు.

## కుటీర పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహం

### 'బిసి చేతి వృత్తి కళాకారుల ఉత్పత్తుల' ప్రారంభంలో ఉపముఖ్యమంత్రి భట్టి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించి, ఆదాయాన్ని సృష్టించే కుటీర పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పై బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'బిసి చేతి వృత్తి కళాకారుల ఉత్పత్తుల' ప్రదర్శన, అమ్మకానికి సంబంధించిన స్టాల్స్‌ను మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరితో కలిసి భట్టి విక్రమార్క మల్లు బుధవారం ప్రారంభించారు.



ఈ ప్రదర్శనలో కుమ్మరులు తయారు చేసిన మట్టి పాత్రలతో పాటు మేదరి వారు తయారు చేసిన వెదురు వస్తువులు, పూసల వారి సామగ్రి , పోచంపల్లి, గద్వాల, నారాయణపేట మొదలైన చేనేత ఉత్పత్తులు గౌడ అన్నలతో ఏర్పాటుచేసిన నీరా ఉత్పత్తులు, వారు తయారు చేసిన వస్తువులను డిప్యూటీ సిఎం ఆసాంతం పరిశీలించి, వాటికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా చేపల వంటకాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరితో కలిసి డిప్యూటీ సిఎం ఆరగించారు. అనంతరం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ చేతివృత్తులు, కళాకారుల ఉత్పత్తులు సమాజానికి పెద్ద ఎత్తున ఉపయోగపడతాయన్నారు. చేతి వృత్తుల ఉత్పత్తులను ప్రోత్సహించి ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎగ్జిబిషన్ ఈ నెల 29వ తేదీ వరకు కొనసాగుతుందని, ఈ ప్రదర్శనలో హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాల నుంచి కుటీర పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తుల ప్రదర్శన జరుగుతుందని వివరించారు. ఈ ప్రదర్శనను తిలకించి, తమకు నచ్చిన వస్తువులు, పర్యావరణహితమైన ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఉత్పత్తులు కొనుగోలుచేసి, చేతి వృత్తుల వారికి చేయూతనివ్వాలని రాష్ట్ర ప్రజలకు భట్టి విక్రమార్క సూచించారు.



## ఈ ఏడాదిలోనే జనగణనతో పాటు బిసి కులగణన

### సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి ఉద్యమాలకు మోదీ ప్రభుత్వం తలొగ్గి జనగణనతో పాటు కుల గణనకు అంగీకరించిందని, కాలయాపన చేయకుండా ప్రస్తుత ఏడాదిలోనే జనగణనతో పాటు బిసి కులగణనను చేపట్టాలని సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన 42 శాతం బిసిల రిజర్వేషన్ల బిల్లుకు కేంద్రం వెంటనే ఆమోదించాలన్నారు. హైదరాబాద్, మగ్దుంభవన్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాలులో బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు అధ్యక్షతన బుధవారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నెల్లికంటి సత్యం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తూ దేశంలో 1931లో బ్రిటీష్ కాలంలో కుల జనగనణ చేశారని, ఆ తర్వాత దేశానికి స్వాతంత్ర్య వచ్చినప్పటినుంచి ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా బిసిల కులగణన చేపట్టలేదన్నారు. ఈ దేశంలోని అన్ని రంగాలను ఉత్పత్తి కులాలైన బిసిలు తమ భుజస్కందాలపై మోస్తున్నారని, అగ్రవర్ణ ఆధిపత్య రాజకీయ పార్టీలు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలోని బిసిలను నాలుగవ శ్రేణి పౌరులుగా గుర్తిస్తున్నారని చెప్పారు. దేశంలోని పశువులు పక్షులు, జంతువులను లెక్కలు తీస్తున్న ప్రభుత్వాలు, బిసిల లెక్కలు మాత్రం తీయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూటికి 60 శాతంఉన్న బిసిలు చెల్లిస్తున్న పన్నుల పైనే భారతదేశం నడుస్తున్నదని, అలాంటి బిసిలకు విద్య,ఉద్యోగ అవకాశాలలో కేవలం 27 శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలవ్వడం దారుణమని నెల్లికంటి సత్యం తెలిపారు. అగ్రవర్ణాలలో ఉన్న పేదల పేరుతో 10 శాతం ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ప్రవేశపెట్టడం ద్వారా మోదీ ప్రభుత్వం కేవలం అగ్రవర్ణాల పక్షపాతి అని స్పష్టమైందన్నారు. తాము ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని, కానీ ఎవ్వరు ఎంత శాతం ఉన్నారో లెక్కలు తీసి, ఎవరి వాటాను వారికి చట్టబద్ధంగా ఇవ్వాలని నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. బిసి కులగణను 2028 సం.వరకు సాగదీసి రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో లబ్ది పొందేందుకు మోదీ ప్రభుత్వం, బిజెపి కుట్ర చేస్తోందని విమర్శించారు. గ్రామ పంచాయతీలకు రావాల్సిన పెండింగ్ నిధులను, వెంటనే మంజూరు చేయాలని, కామారెడ్డి బిసిడిక్లరేషన్ సమగ్రంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్‌ను సమగ్రంగా అమలు చేయాలని బిసిల తరపున తాను శాసనమండలి సమావేశం లో ప్రస్తావిస్తానని తెలిపారు. రానున్న రోజుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపైన బిసి హక్కుల కోసం బలమైన ఉద్యమాన్ని నిర్మించేందుకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని నెల్లికంటి సత్యం తెలిపారు. బిసి హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి ధూళిపాళ్ల ధనుంజయ నాయుడు మాట్లాడుతూ జులై 14న అన్ని జిల్లాల కలెక్టర్ల ద్వారా ప్రధాన మంత్రికి కులగణనకు సంబంధించి దరఖాస్తులు సమర్పించాలన్నారు. బిసి హక్కుల సాధన సమితిని మరింత విస్తరించాలని, జూలై చివరి వరకు జిల్లా మహాసభలను,ఆగస్టు మొదటి వారంలో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ నేదునూరి రాజమోళి,ఆఫీసు బేరర్లు బొడ్డు పెల్లి కృష్ణ, చింతకింది కుమారస్వామి, బి.బాలయ్య, బత్తిని సదానందం,ప్రమీల,పల్నాటి యాదయ్య, రమేష్, బాపురాజు, తదితరులు పాల్గొన్నారు.

## భారతీయులపై అమెరికా దుర్మార్గ చర్యలు ఆపాలి : ఎఐవైఎఫ్



**ప్రజాపక్షం/హైదారబాద్:** భారతదేశ ప్రయోజనాలను, ప్రతిష్టను అమెరికాకు తాకట్టు పెడుతున్న ప్రధాని నరేంద్రమోదీ విధానాలపై ఉద్యమించాలని, భారతీయులపై అమెరికా దుర్మార్గ చర్యలను ఆపాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జూలై 2న చలో అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఈ ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను హైదరాబాద్‌లోని మగ్ధూం భవన్‌లోని రాజ్‌బహదూర్‌హాల్‌లో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ నరేంద్రమోదీ విధానాలు దేశానికి ప్రమాద కరమన్నారు.దేశాన్ని తిరోగమన దిశలో తీసుకెళ్లే విధానాలను అనుసరిస్తూ అమెరికాఅధ్యక్షుడు ట్రంప్‌కు మోదీ వత్తాసు పలుకుతూ దేశ సార్వభౌమత్వాన్ని,ప్రతిష్టను నష్టపరిచే చర్యలను దేశ పౌరులు తిప్పికొట్టాలని కోరారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల భారత్‌పాక్ యుద్ధాన్ని తానే ఆపానని చెప్పడం చూస్తే, మన దేశ ప్రతిష్టను మోడీ తాకట్టు పెట్టాడనడానికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయ ప్రయోజనాలను కాపాడతామని గొప్పలు చెప్పుకునే కేంద్ర ప్రభుత్వం, వాస్తవానికి, ఇటువంటి కఠినమైన బహిష్కరణ చర్యల నేపథ్యంలో తన సొంత ప్రజలకు కనీస గౌరవాన్ని అందించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్యప్రసాద్, శ్రీమాన్, రాష్ట్ర సమితి సభ్యులు మాజీద్ అలీ ఖాన్ పాల్గొన్నారు.

## 'బూర్గంపాడు' నివేదిక కోరాం : మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల పరిధిలోని ఇరవెండి ఫారెస్ట్ బీట్లో లోని కొసగుంపు వలస ఆదివాసీ గ్రామంలో ఇటీవల చోటు చేసుకున్న ఘటనపై తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఫారెస్ట్ భూమికి కందకాలు తవ్వేందుకు వెళ్లిన జేసీబీని కొసగుంపుకు చెందిన వలస ఆదివాసీ మహిళలు అడ్డుకున్న నేపథ్యంలో చోటు చేసుకున్న ఘర్షణ విషయంలో మంత్రి సురేఖ, జిల్లా అటవీ అధికారులను, జిల్లా ఉన్నతాధికారులను నివేదిక కోరుతానని చెప్పారు. ఈ మేరకు మంత్రి సురేఖ మీడియాకి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కందకాలు తవ్వకుండా జెసిబికి అడ్డుగా మహిళలు బైఠాయించగా, ఫారెస్ట్ అధికారులు మహిళలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వలస ఆదివాసీ మహిళలకు, ఫారెస్ట్ అధికారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నదని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. కాగా, ఇదే విషయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ అనసూయ సీతక్క కూడా మంత్రి సురేఖతో ప్రత్యేకంగా ఫోన్‌లో మాట్లాడారు.

### రోడ్డు ప్రమాద బాధితులకు శుభవార్త...

## నగదు రహిత చికిత్స పథకం-2025

### పథకం తీసుకువచ్చిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ధన్యవాదాలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రోడ్డు ప్రమాద బాధితులకు క్యాష్ లెస్ ట్రీట్మెంట్ పథకం పై ప్రతి పోలీస్ స్టేషన్‌లో అవగాహన కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. సచివాలయంలో రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స పథకం అమలు పై బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ సన్నాహక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రవాణా శాఖ,పోలీస్ ,హెల్త్ అండ్ మెడికల్ , ఇన్సూరెన్సన్ , ఎన్ఐసి ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స పథకం తీసుకొచ్చిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ధన్యవాదాలు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగి ఎవరు చనిపోకుండా ఉండడానికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీనిపై కింద స్థాయి పోలీస్ అధికారులకు ఇతర విభాగాల అధికారులకు సామాన్య ప్రజలకు అవగాహన కల్పించాలని సూచిం చారు. ఈ పథకంలో రోడ్డు ప్రమాదాల బాధితులకు, వారి బీమా స్థితితో సంబంధం లేకుండా, ప్రమాదం జరిగిన మొదటి 7 రోజుల్లోపు, ఒక్కో బాధితుడికి 1.5 లక్షల ఆర్థిక పరిమితి వరకు తక్షణ, నగదు రహిత వైద్య చికిత్స అందించడం ఈ పథకం లక్ష్యం అని పొన్నం వెల్లడించారు.ఈ పథకం విజయవంతం కావడానికి రవాణా ,పోలీస్ ,హెల్త్ ,ఇన్సూరెన్స్ ,ఎన్ఐసి విభాగాలు కలిసి జిల్లా ,రాష్ట్ర స్థాయిలో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. గతంలో రోడ్డు ప్రమాదాలు జరిగితే పోలీసులకు సమాచారం ఇస్తే తమ మీద కేసులు అవుతాయనే భయం ఉండేదని అది అపోహ మాత్రమే అని తెలిపారు. ప్రమాదాలు జరగగానే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సమీక్షా సమావేశంలో రోడ్డు ప్రమాద బాధితులకు వెంటనే చికిత్స అందించేలా అన్ని సౌకర్యాలతో మరిన్ని ట్రామా సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్ లలో ఈ పథకం పై అవగాహన కల్పించాలని డిజిపి జితేందర్ ను ఆదేశించారు. మన జీవితంలో రోడ్డు ప్రమాదాల నుండి ఒక ప్రాణం రక్షించిన గొప్ప సంతృప్తి ఇస్తుందని ఇది ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. ఇది సామాజిక బాధ్యతగా అధికారులు వ్యవహరించాలని సూచించారు. ఈ పథకం పై సమాచార ప్రసార శాఖ ప్రత్యేక కార్యక్రమాలు చేయాలని ఆదేశించారు. పేదల్లో పేదలను రక్షించడానికి ఈ పథకం ఉపయోగపడుతుందని వెల్లడించారు. ఈ పథకం విజయవంతం కావడానికి అన్ని విభాగాల అధికారులు ఎవరి విధులు వారు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. సమీక్షా సమావేశంలో డిజిపి జితేందర్ ,అహ్మద్ నదీమ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, క్రిస్టినా జ్‌డ చొంగ్తు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫర్ ప్రిన్సిపల్ సెక్రటరీ,షాట్ చైర్మన్ శివసేన రెడ్డి, రవాణా శాఖ కమిషనర్ సురేం ద్ర మోహన్, జేటిసిలు ,యూనిసెఫ్ ,ఎన్ఐసి ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోండి

రేర్ ఎర్త్ ఎగుమతులపై చైనా ఆంక్షల నేపథ్యంలో..

### కేంద్రమంత్రులు పీయూష్ గోయల్, అశ్వినీ వైష్ణవ్ లకు మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రేర్ ఎర్త్ ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించిన దరిమిలా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ ల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చైనా తీసుకున్న ఈ నిర్ణయం తెలంగాణ తయారీ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో మంగళవారం భేటీ అయ్యారు. రేర్ ఎర్త్ ఎగుమతులపై ఆంక్షల విషయంలో తక్షణ జోక్యం కావాలని కోరారు. పలు ప్రముఖ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కంపెనీలు రేర్ ఎర్త్ మాగ్నెట్లు, కీలక ముడి పదార్థా లు, రసాయనాల దిగుమతుల్లో చైనాపై ఆధారపడ టం వల్ల తీవ్ర అవరోధాలు ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుత పరిస్థితి ఉత్పత్తి స్థాయిని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదంలో ఉంది.ఉత్పత్తి తగ్గితే అది ఉపాధి అవకాశాలపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉన్నందున దీనికి పరిష్కారంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం అత్యవసరం, అని మంత్రి శ్రీధర్ బాబు కేంద్ర మంత్రికి విరించారు.

ఇదే విషయమై కేంద్ర ఐటీ,ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్టవ్ తో సైతం మంత్రి శ్రీధర్ బాబు చర్చించారు. రాష్ట్రంలో పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం పూర్తి స్థాయి సహకారం అందించాలని మంత్రి శ్రీధర్ బాబు కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌ను కోరారు. ముఖ్యంగా హైదరాబాద్‌నాగ్‌పూర్, హైదరాబాద్‌వరంగల్, హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్, విజయవాడ ఇండస్ట్రీయల్ కారిడార్ల అభివృద్ధి వివరాలు వివరించారు. జహీరాబాద్‌లో అభివృద్ధి చేస్తున్న ఇండస్ట్రీయల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద అవసరమైన మౌలిక సదుపాయాల కోసం రూ. 400 కోట్ల నిధులు పీఎం గతిశక్తి పథకం కింద మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**వరంగల్లో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి..**

గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా హైదరాబాద్‌వరంగల్ ఇండస్ట్రీయల్ కారిడార్ (HWIC) నిలిచిపోయిందని కేంద్రమంత్రికి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. అయితే..ఇందులో భాగంగాఉన్న ఫార్మా సిటీని ప్రభుత్వం ఇప్పుడు 'ఫ్యూచర్ సిటీ'గా అభివృద్ధి చేస్తోందని తెలిపారు. దీనిలో భాగంగా.. వరంగల్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి సహా పలు నోడ్స్‌కు కేంద్రం నిధులు విడుదల చేయాలని కేంద్రమంత్రిని కోరారు.

**తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వండి..**

కేంద్రం ప్రతిపాదించిన 100 పారిశ్రామిక పార్కుల పథకం కింద తెలంగాణలో పార్కుల అభివృద్ధికి రాష్ట్రం ఆసక్తిగా ఉందని, ఇప్పటికే ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తమ అభిప్రాయాలు పంపినట్లు గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

**జాతీయ డిజైన్ సెంటర్ ఏర్పాటు చేయండి**

దేశంలో డిజైన్ రంగాన్ని ఉద్ధరిస్తూ, మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తుల ద్వారా గ్లోబల్ గుర్తింపు సాధించేలా హైదరాబాద్‌లో జాతీయ డిజైన్ సెంటర్ (NDC) ఏర్పాటు చేయాలని రాష్ట్రం ప్రతిపాదించిందన్నారు.ఇది దేశవ్యాప్తంగా డిజైన్ థింకింగ్‌కు కేంద్రంగా మారుతుందన్నారు.

**వికసిత్ భారత్ 2047లక్ష్యంలో తెలంగాణ భాగస్వామ్యం**

ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేస్తోందని, కేంద్రంతో కలిసి వికసిత్ భారత్ 2047 లక్ష్యం సాధనలో రాష్ట్రం ముందుంటుందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

## సోనియాగాంధీకి పోస్టుకార్డు పంపిన కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అసెంబ్లీ సమావేశాలు పెట్టి, ఆరు గ్యారెంటీల అమలు, మహిళలకు కాంగ్రెస్ చేసిన మోసంపై చర్చిద్దామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత అన్నారు. ఎన్నికల హామీ మేరకు పెన్షన్లను పెంచే విధంగా సిఎం రేవంత్ రెడ్డికి ఆదేశాలివ్వాలని సోనియా గాంధీని కోరారు. మహిళలకు రూ. 2500, వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఎఐసిసి అగ్రనేత సోనియా గాంధీకి అబిడ్స్ జిపిఒ నుంచి కవితతో పాటు పలువురు మహిళలు పోస్టుకార్డు పంపించారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తయినప్పటికీ ఆరు గ్యారంటీల హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. వృద్ధులకు రూ. 2వేల పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామని హామీనిచ్చారని, వికలాంగుల పెన్షన్‌ను రూ.4వేల నుంచి రూ.6వేలకు పెంచకుం డా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్‌ఆచారి, నాయకులు మహేందర్, సంపత్‌గౌడ్, రూప్ సింగ్, అర్చనా సేనాపతి, లావణ్య, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## యాసంగి రైతుబంధు ఇవ్వనందుకు సిఎం క్షమాపణ చెప్పాలి

### బహిరంగచర్చకు ఎక్కడికి రావాలో చెప్పండి...మహేశ్‌కుమార్ గౌడ్‌కు హరీశ్‌రావు సవాల్



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో 18 నెలల చూశాక కాంగ్రెస్ పాలన ప్రజలకు అర్థమైందని. అందుకే కెసిఆర్ మళ్లీ రావాలని కోరుకుంటున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. అబద్దాలు చెప్పటంతో సిఎం రేవంత్‌రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పోటీ పడుతున్నారని విమర్శించారు. బుధవారం సిద్దిపేటజిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా రాయి కోడ్ మండలం యూత్ కాంగ్రెస్ నేత పటోళ్ల ప్రశాంత్, ఆందోల్ మాజీ ఎంఎల్ఎ క్రాంతి కిరణ్, హరీష్‌రావు సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రశాంత్ పాటిల్‌కు బిఆర్ఎస్ కండువా కప్పి మాజీ మంత్రి హరీష్‌రావు సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వానాకాలం, యాసంగి రైతుబంధు ప్రభుత్వం ఎగ్గొట్టారని విమర్శించారు. రైతులకు 15వేలు ఇస్తానని చెప్పి కేవలం 12వేలు మాత్రమే ఇచ్చారన్నారు. రైతు బంధు సృష్టికర్తనే కెసిఆర్ దేశానికి రైతుబంధు పరిచయం చేసింది కెసిఆర్ అన్నారు. కెసిఆర్ 11 పర్యాయాలు రైతులకు 80 వేల కోట్లు రైతుబంధు కింద రైతులకు అందించారన్నారు. గత వానకాలం యాసంగి, రైతుబంధు వేయకుండ పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బహిరంగ చర్చకు పోదాం అని అంటున్నారని, ఎక్కడికి రమ్మంటావో చెప్పు తాను సిద్దమని హరీష్‌రావు సవాల్ విసిరారు. కాంగ్రెస్ 18 నెలల పాలనలో ఏ ఒక్క ప్రాజేక్టు పూర్తి చేశారా? ఒక్క ఎకరాకు నీళ్లు ఇచ్చారా అని సూటిగా ప్రశ్నించారు. బహిరంగ చర్చకు ఎక్కడ పెట్టుకుందాం? ఏ టివిలో కూర్చోందామో చెప్పు, ఎక్కడ మాట్లాడుతామో చెప్పు అని మహేశ్‌కుమార్ గౌడ్‌కు హరీష్ రావు సవాల్ విసిరారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నేతలు జైపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు విఠల్, సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.


**శంషాబాద్ మున్సిపాలిటీ కార్యాలయం :: రంగారెడ్డి జిల్లా.**

Lr No. E1/SHBM/98/2025, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు తేదీ: 24.06.2025

నమోదిత కాంట్రాక్టర్ల నుండి టెండర్లు ఆహ్వానించబడినవి: **1.** 2025లో 100 రోజుల కార్యక్రమంలో జెసిబి, డోజర్, ట్రాక్టర్ & కార్మికులను నియమించడం, **2.** శంషాబాద్ మున్సిపాలిటీలో సిసి రోడ్లు మరియు డ్రైనేజీ నిర్మాణం. శంషాబాద్ మున్సిపాలిటీ కమిషనర్ ద్వారా 01.07.2025న మ.03:30 గం.ల వరకు స్వీకరించబడును మరియు అదే రోజు మ.03:45 గం.లకు టెండరుదారుల సమక్షంలో లేదా వారి ప్రతినిధుల సమక్షంలో కమిషనర్, శంషాబాద్ మున్సిపాలిటీ ద్వారా తెరవబడును.

*టెండర్ల షెడ్యూల్ క్రింద ఇవ్వబడినది:*

**టెండర్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ తేదీ:** 24.06.2025 మ.03:30 గం.లకు,
**ఇ-ప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్ల సమర్పణ:** 01.07.2025 మ.03:30 గం.లకు,
**టెండర్ల ప్రారంభం:** 01.07.2025 సా.03:45 గం.లకు,

మరిన్ని వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్లాట్‌ఫారం అనగా **https://tender.telangana.gov.in** ను సందర్శించండి లేదా శంషాబాద్ మున్సిపాలిటీ కార్యాలయాన్ని సంప్రదించండి. సంప్రదించవలసిన నంబర్లు: 7337323577 / 7337336191.

సం/- కమిషనర్
శంషాబాద్ మున్సిపాలిటీ

DIPR R.O. No. : 4100-PP/CL/ADVT/1/2025-26, Date: 25-06-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: సర్కిల్-2, ఉప్పల్.**

NIT No. 09/EEC-2/UPL/GHMC/2025-26, టెండర్ నోటీసు తేదీ: 24.06.2025

**పని పేరు:** 4 పనులకు ''బోనాల పండుగ -2025కు సంబంధించి జిహెచ్ఎంసి, ఉప్పల్ సర్కిల్, చిల్కానగర్, వార్డ్ నెం.7లో వివిధ ప్రదేశాలలో స్టోన్ డస్ట్ సరఫరా మరియు వ్యాప్తి'',...... ''బోనాల పండుగ -2025కు సంబంధించి జిహెచ్ఎంసి, ఉప్పల్ సర్కిల్, ఉప్పల్, వార్డ్ నెం.10లో వివిధ ప్రదేశాలలో స్టోన్ డస్ట్ సరఫరా మరియు వ్యాప్తి'', **అంచనా విలువ:** రూ.3.26లక్షలు, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 02.07.2025న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ వి.హరిలాల్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ డివిజన్-2, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-2, ఉప్పల్, జిహెచ్ఎంసి.**

DIPR R.O. No. : 4112-PP/CL/ADVT/1/2025-26, Date: 25-06-2025

ప్రజాపక్షం
గురువారం, 26 జూన్

# పంచాయతీ ఎన్నికలకు ఊపు!

రాష్ట్రంలో చాలాకాలంగా వాయిదా పడుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఊపందుకోనుంది. సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు నిర్వహించాలన్న బుధవారంనాటి హైకోర్టు ఆదేశాలను ఎలాంటి కాలయాపన లేకుండా, వాయిదా విధానాలుగానీ అనుసరించకుండా, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలి. పూర్తి కాని వార్డుల రిజర్వేషన్ల ఖరారుకు 30 రోజుల గడువును రాష్ట్ర ప్రభుత్వం కోరితే, ఎన్నికల నిర్వహణకు 60 రోజుల సమయం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కోరింది. ఈ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు 95 రోజుల వ్యవధి ఇచ్చింది. కాబట్టి, స్థానిక సంస్థల ఎన్నికలు మరోసారి వాయిదా పడవన్న నమ్మకం బలపడుతున్నది. రాజ్యాంగం అధికరణ 243 'జీ' ప్రకారం, గ్రామపంచాయతీలను బలోపేతం చేయాలి. 11వ షెడ్యూల్‌లో చెప్పిన విధంగా రాష్ట్ర ప్రభుత్వాలు 29 శాఖలకు సంబంధించిన పనులు గ్రామపంచాయతీలకు బదలాయింపు చేయాలి. 1992లో జరిగిన రాజ్యాంగ సవరణ గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు రాజ్యాంగ భద్రత కల్పించింది. దీనిని అను సరించి, పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలు విధిగానైతే క్రమం తప్పకుండా ఎన్నికలు జరుగుతాయో, అలాగే పంచాయతీలకు, మున్సిపాలిటీలకు కూడా వాటి పదవి కాలం ముగిసే ముందే ఎన్నికలు నిర్వహించాలి. అదే విధంగా, పాత పాలకవర్గం పదవీ కాలం ముగిసేనాటికి, కొత్త పాలకవర్గం సిద్ధంగా ఉండాలి. కానీ, వివిధ కారణాలతో మన రాష్ట్రంలో ఇంతకు ముందు, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలో జరగలేదు. ప్రస్తుత గ్రామపంచాయతీల కాల పరిమితి 2024 ఫిబ్రవరి ఒకటోతేదీ నాటికే ముగిసింది. మరుసటి రోజు నుంచే పాలన స్పెషల్ ఆఫీసర్ల చేతుల్లోకి వెళ్ళింది. ప్రభుత్వ అనుమతి తీసుకొని మాత్రమే రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని, 2018లో అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధమైన ఆదేశాలు ఇచ్చింది. అంటే ప్రభుత్వం తనకు అనుకూలమైనప్పుడు మాత్రమే పంచాయతీ ఎన్నికలు జరిపే వెసులుబాటు ఏర్పడింది. ఈ ఆదేశాలతో రాష్ట్ర ఎన్నికల సంఘం తన స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోయి, ప్రభుత్వంలో ఒక శాఖగా మారి పోయింది. అందుకే, జూన్, జూలై మాసాల్లోగా ఎన్నికల నిర్వహణను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచించినా ఫలితం లేకపోయింది. ఇప్పుడు హైకోర్టు విస్పష్టమైన తీర్పునిచ్చి, స్థానిక సంస్థల ఎన్నికలపై నెలకొన్న గందరగోళానికి తెరదించింది. ఇక ఎలాంటి జాప్యం లేకుండా, నిర్దేశించిన గడువులోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డి సర్కారుపై ఉంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా, సదరు బిల్లుకు కేంద్ర ఆమోదం లభించలేదు. కేంద్రం జనాభా లెక్కల తోపాటు కులగణన చేపడుతున్నందున మరో 2–3 ఏళ్ల వరకూ ఆమోదం లభించదు. ఆ పేరుతో ఎన్నికలు వాయిదా వేయకూడదు. అది అప్రజాస్వామికం. కేంద్ర ఆమోదం లభించకపోతే, తమ పార్టీ 42 శాతం రిజర్వేషన్లు పాటిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలోనే చెప్పారు. ఈ పర్యాయానికి ఇతర పార్టీలూ ఆ పద్ధతి పాటించి, బీసీలకు న్యాయం చేయవచ్చు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో అభివృద్ధి గండిపడింది. కొన్ని చోట్ల నిధుల కొరత... మరికొన్ని గ్రామ పంచాయతీల్లో నిధుల దుర్వినియోగం.... ప్రజాప్రతినిధులు లేకపోవడంతో అధికారుల ఇష్టారాజ్యం... పాలన అస్తవ్యస్తం. ప్రజాస్వామ్య వ్యవస్థలో, ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు లేకుండా, స్థానిక సంస్థల పాలన సంవత్సరాలపాటు అధికారుల చేతుల్లో చిక్కుకోవడం ప్రమాదకరం. [illegible] ఉన్న వార్డుల విభజనలు లేదా రిజర్వేషన్ల అంశాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, కోర్టు ఆదేశించిన విధంగా సెప్టెంబర్ చివరిలోగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు పూర్తిచేయాలి. రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలి. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలి. సాకులు వెతికి.. కారణాలు చూపి.. ఎన్నికల ప్రక్రియను మరోసారి వాయిదా వేయించే ప్రయత్నాలు కూడదు. అది ప్రజాస్వామిక దేశం... ఇక్కడ, ప్రభుత్వ చేతిలో కీలుబొమ్మల్లా మారే అధికారులుకాదు.. ప్రజాప్రతినిధులే నిర్ణయాధికారులు.

# ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సైనిక వ్యయం

## అతి ఎక్కువ సైనిక వ్యయం చేసే దేశాల్లో భారత్ ఐదవ స్థానం

ప్రభాత్ పట్నాయక్

ప్రపంచవ్యాప్తంగా సైనిక వ్యయం గణనీయంగా పెరిగింది. ఈ పెరుగుదలకు యూరప్ నేతృత్వం వహిస్తుంది. సైనిక వ్యయం కింద ఏది చేర్చబడుతుంది అనే అంశంపై ఆధారపడి, సైనిక వ్యయం అంచనాలలో తేడాలు ఉంటాయి. మనం విశ్లేషణ కోసం స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రి) అంచనాలను తీసుకుందాం. సిప్రి ప్రకారం, గడిచిన దశాబ్దంలో వరుసగా ప్రతి ఏటా వాస్తవ సైనిక వ్యయం పెరిగింది. 2024లో అంతకుముందు సంవత్సరం కంటే 9.4 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. ప్రచ్ఛన్నయుద్ధం ముగిసిన తర్వాత ఏ సంవత్సరంలోనైనా అత్యధిక వార్షిక పెరుగుదల ఇదే. 2024లో మొత్తం ప్రపంచ సైనిక వ్యయం 2.718 ట్రిలియన్ల అమెరికన్ డాలర్లకు చేరుకుంది.

ఈ పెరుగుదలకు రెండు స్పష్టమైన కారణాలను మనం ఊహించవచ్చు: మొదటిది, అమెరికా నేతృత్వం వహిస్తున్న మెట్రోపాలిటన్ సామ్రాజ్యం పెరుగుతున్న సవాళ్లను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా అమెరికాలో హౌసింగ్ బబుల్ బద్దలు కావటంతో నయా ఉదారవాద పెట్టుబడిదారీ సంక్షోభం ప్రారంభమైంది. రెండవది, ఈ సామ్రాజ్యాన్ని నిర్వహించడానికి సైనిక వ్యయంలో సింహభాగాన్ని భరించడానికి అమెరికా ఇక మీదట సుముఖంగా లేదు. దానికి బదులు ఐరోపా భాగస్వాములు ఈ భారాన్ని పంచుకోవాలని అమెరికా కోరుకుంటుంది. ఈ కారణాల వల్ల సామ్రాజ్యవాద శక్తులు సైనిక వ్యయాన్ని దూకుడుగా పెంచడంతో, ఇతర దేశాలు కూడా తమ సైనిక వ్యయాన్ని వాస్తవరూపంగా పెంచే ఒత్తిడిలో పడ్డాయి. తద్వారా అవి సామ్రాజ్యవాద శక్తుల జగన్నాథ రథ చక్రాల కింద నలిగిపోకుండా ఉంటాయి.

ఈ రెండు కారణాలపై ఒక మాట చెప్పాలి. సంక్షోభానికి ముందు కొన్నాళ్ళు దేశాలు బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్‌లో తీవ్రమైన కరెంట్ అకౌంట్ లోటు లేకుండా లేదా లోటు ఉన్నప్పటికీ ఆర్థిక ప్రవాహాల ద్వారా వాటిని భరించగలిగిన సంక్షోభం తర్వాత తీవ్ర ఇబ్బందుల్లో పడ్డాయి. కోవిడ్ మహమ్మారి ప్రారంభమైన తర్వాత వాటి పరిస్థితి మరింత దిగజారింది. ఎగుమతి మార్కెట్లు కుదించుకుపోవడంతో వాటి కరెంట్ అకౌంట్ లోటు విస్తృతమైంది. స్వదేశానికి తిరిగి పంపడం క్షేమమనుకుందనే భయంతో ఆర్థిక ప్రవాహం తగ్గిపోయింది. అవి రుణ సంక్షోభంలో చిక్కుకున్నాయి. మహమ్మారి తర్వాత అనేక దేశాలకు మరింత తీవ్రమైన రూపంలో ఇదే గతి పట్టింది. ఈ పరిణామాలు అమెరికా నాయకత్వంలోని సామ్రాజ్యవాద శక్తులు ప్రపంచంపై రుద్దిన నయా ఉదారవాద అంతర్జాతీయ ఏర్పాట్లపై [illegible].

అదే సమయంలో చైనా అద్భుతమైన అధిక వృద్ధి రేట్లను ప్రదర్శించింది. మొదట్లో మెట్రోపాలిటన్ పెట్టుబడి ఆశ్రయంతో మెట్రోపాలిటన్ కేంద్రాల నుండి కార్యకలాపాలను మార్చడం ద్వారా ప్రేరేపించబడింది. ఇది బలమైన కరెంట్ అకౌంట్ మిగులును కలిగి ఉంది. అటువంటి బాధిత, వెంటనే బాధితురాలు కాని దేశాలకు కొంత సహాయం అందించడానికి ముందుకు వచ్చింది. ఇది సామ్రాజ్యవాదం ఆధిపత్యానికి పెను సవాలును విసిరింది. దీనికి వ్యతిరేకంగా అది సైనిక జోక్యానికి తన సామర్థ్యాన్ని బలోపేతం చేయాలని భావిస్తుంది.

454 బిలియన్ల డాలర్లు. ఇది రష్యా వ్యయం కంటే మూడు రెట్లు అధికం. అది కూడా రష్యా ప్రస్తుతం యుద్ధంలో నిమగ్నమై ఉన్న సమయంలో. సైనిక ప్రయోజనాల కోసం రష్యా కంటే మూడు రెట్లు ఎక్కువ ఖర్చు చేయడానికి రష్యా ముప్పును ఉదహరించడం హాస్యాస్పదమైన కుట్ర. సామ్రాజ్యవాద వ్యవస్థను నిర్వహించుకునేందుకే ఆ లెక్కలు యూరోపియన్ సైనిక వ్యయంలో కనిపిస్తున్నాయి.

> **2024లో భారతదేశం 86.1 బిలియన్ల డాలర్ల మిలటరీ వ్యయంతో ప్రపంచంలో అతిపెద్ద సైనిక వ్యయం చేసే దేశాలలో అమెరికా, చైనా, రష్యా, జర్మనీ తర్వాత ఐదవ స్థానంలో ఉంది. మన దేశంలో ఫాసిస్ట్ తరహా ప్రభుత్వం మహాత్మా గాంధీ నరేగా వంటి కార్యక్రమాలకు నిధులు తగ్గించినప్పటికీ, సైనిక వ్యయాన్ని పెంచడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నది. తద్వారా ట్రంప్ నాయకత్వంలోని మెట్రోపాలిటన్ పెట్టుబడిదారీ విధానం ఏమి చేయాలని ప్రయత్నిస్తుందో దానినే అది ప్రతిబింబిస్తుంది. దీనికి వ్యతిరేకంగా మనం పోరాడాలి.**

అదే సమయంలో, సంక్షోభం నేపథ్యంలో అమెరికా తన సైనిక వ్యయంలో కొంత భాగాన్ని ఇతర సామ్రాజ్యవాద దేశాలపైకి మోపేందుకు ప్రయత్నిస్తోంది. సరిగ్గా అది తన స్వంత ఆర్థిక వ్యవస్థపై సంక్షోభం ప్రభావం నుంచి ఉపశమనం పొందేందుకు స్వంత వాణిజ్య భాగస్వాములను పణంగా పెట్టి తన దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుచుకునేందుకు స్వీయరక్షక ఆర్థిక విధానాలను అవలంభిస్తూ సుంకాలను ఆశ్రయించింది. భారాన్ని బదిలీ చేస్తుండడంతో మొత్తంగా సామ్రాజ్యవాద ప్రపంచం సైనిక వ్యయం పెరిగింది. ఎందుకంటే యూరప్ పాక్షికంగా అమెరికా సైనిక గొడుగు కింద పాక్షికంగా ఉన్న యూరప్ స్వంతంగానే భారీగా సైనిక వ్యయానికి సిద్ధపడుతోంది.

రష్యా దాడి ప్రమాదాన్ని బూచిగా చూపుతూ ఐరోపా ప్రభుత్వాలు తమ అధిక సైనిక వ్యయాన్ని సమర్థించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. కానీ ఈ వాదన నిలబడదు. సోవియట్ యూనియన్ పతనమైన సమయంలో నాటో తూర్పుకు విస్తరించబోదని మిఖాయిల్ గోర్బచేవ్‌కు క్లింటన్ ప్రభుత్వం వాగ్దానం చేసినప్పటికీ రష్యా సరిహద్దు వరకు దాని విస్తరణ జరిగింది. ఉక్రెయిన్‌లో ఎన్నికైన విక్టర్ యనుకోవిచ్ ప్రభుత్వాన్ని అమెరికా వ్యూహరచనతో తిరుగుబాటు చేయించి, ఆయన స్థానంలో యుద్ధ కాలంలో నాజీ సహకరించిన స్టెఫాన్ బందేరా అనుచరులతో కూడిన ఫాసిస్ట్ పాలనను అధికారంలోకి తీసుకువచ్చింది. రష్యా మాట్లాడే మైనారిటీలపై ఆ ప్రభుత్వం అణచివేతను ప్రారంభించింది. ఉక్రెయిన్ నాటో సభ్యత్వాన్ని కోరింది. రష్యా ఈ ముప్పును ఎదుర్కోవలసి వచ్చింది. కాబట్టి యూరప్‌పై రష్యా దురాక్రమణ గురించి మాట్లాడటం కేవలం సామ్రాజ్యవాద ప్రచారం.

2024లో రష్యా మొత్తం సైనిక వ్యయం 149 బిలియన్ల డాలర్లు కాగా, యూరోపియన్ నాటో సభ్య దేశాల మొత్తం సైనిక వ్యయం 454 బిలియన్ల డాలర్లు.

ఈ సందర్భంలో ప్రత్యేకంగా ఆందోళన కలిగించేది జర్మనీలో సైనిక వ్యయం పెరుగుదల. ఇది మునుపటి సంవత్సరం కంటే 28 శాతం పెరిగింది. రెండవ ప్రపంచ యుద్ధానంతర పరిస్థితి జర్మనీని తిరిగి ఆయుధాలను పట్టేందుకు అనుమతించని స్థితి నుండి, 2024లో యూరప్‌లో అతి పెద్ద సైనిక వ్యయం చేసే దేశంగా, ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద సైనిక దేశంగా మారడం ఒక ముఖ్యమైన మార్పు. జర్మనీ నాజీ గతాన్ని బట్టి, దాని పునరుజ్జీవన సంకేతాలు పొడసూపుతున్నాయి. ప్రత్యేకంగా అపఖ్యాతి పాలైన దాని యుద్ధోన్మాద చరిత్రను బట్టి, ఇది అత్యంత తీవ్రమైన పరిణామాలతో కూడిన పరిణామం.

కీలక ప్రశ్న ఏమిటంటే: సామ్రాజ్యవాద ప్రపంచంలో సైనిక వ్యయం పెరగడం, దానిని మరింత పెంచేందుకు కట్టుబడి ఉంటామని ప్రకటనలు, సైనిక వ్యయాన్ని ఎలా భరించాలి? ఆర్థిక లోటులో కొంత పెరుగుదల అనివార్యంగా సంభవించినప్పటికీ, సంక్షేమ వ్యయంలో కోత తప్పదు. ముఖ్యంగా బూర్జువా ప్రభుత్వాల దృష్టిలో పెట్టుబడిదారులకు పన్ను రాయితీలు ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరిచే ప్రధాన సాధనంగా కనిపిస్తాయి. అమెరికన్ కాంగ్రెస్ ఆమోదించిన, సెనేట్ ఆమోదం కోసం ఎదురుచూస్తున్న డొనాల్ట్ ట్రంప్ 'బిగ్ బ్యూటిఫుల్ బిల్'లో వివరించిన ఆయన ఆర్థిక ఎజెండాను పరిశీలించినప్పుడు ఇది స్పష్టమవుతుంది. ఈ బిల్లు ప్రకారం రాబోయే పదేళ్లలో పన్ను రాయితీలు 3.76 ట్రిలియన్ల డాలర్లు కాగా, మొత్తం ఖర్చు తగ్గింపులు 1.3 ట్రిలియన్ల డాలర్లు. దీనివల్ల పేరుకుపోయిన ప్రభుత్వ అప్పు 2.5 ట్రిలియన్ల డాలర్లకు పెరుగుతుంది (ఈ అప్పుపై వడ్డీని లెక్కించకుండా). బిల్లు కింద పన్ను రాయితీలు స్పష్టంగా ప్రజలందరికీ ఇవ్వబడతాయి. కానీ పన్ను, ఖర్చుల ప్రతిపాదనలను కలిపి చూస్తే, ధనవంతులే అత్యధిక లబ్ధిదారులు అవుతారు. పేదలు పూర్తిగా దుర్భరమవుతారు. వాస్తవానికి, జనాభాలో మొదటి 10 శాతం మందికి రాబోయే సంవత్సరాల్లో వారి కుటుంబ వనరులలో నికర పెరుగుదల ఉంటుంది. అయితే చివరి 10 శాతం మందికి వారి కుటుంబ వనరులలో నికర తగ్గుదల ఉంటుంది. ప్రధానంగా మెడికెయిడ్ అందుబాటులో ఉండకపోవడం, అధిక ఆరోగ్య బీమా ఛార్జీలే కారణం.

అమెరికా కాంగ్రెస్ ఈ బిల్లును కేవలం ఒక ఓటు మెజారిటీతో ఆమోదించినప్పటికీ, సెనెట్‌లో ఫలితం ఇంకా అస్పష్టంగా ఉన్నప్పటికీ, ప్రపంచీకరణ చెందిన ద్రవ్య పెట్టుబడి ఈ బిల్లును ఎంతవరకు అంగీకరిస్తుంది అనేది పూర్తిగా భిన్నమైన విషయం. అది ఇంకా అస్పష్టంగానే ఉంది. బ్రిటన్‌లో లిజ్ ట్రస్ ప్రభుత్వం పెట్టుబడిదారులకు పన్ను రాయితీలు ఇవ్వడానికి ద్రవ్యలోటును విస్తరించాలని ప్రతిపాదించింది. కానీ ఈ ఆర్థికలోటు విస్తరణ కూడా ద్రవ్య పెట్టుబడికి ఆమోదయోగ్యం కాలేదు; పెట్టుబడి దేశం వీడి వెళ్ళిపోవడంతో బ్రిటిష్ పౌండ్ విదేశీ మారక మార్కెట్లో పడిపోయింది. దీంతో లిజ్ ట్రస్ రాజీనామా చేయవలసి వచ్చింది. ఈ ప్రక్రియలో ఆమె బ్రిటీష్ చరిత్రలో అత్యంత స్వల్ప కాలిక ప్రధానమంత్రి అయ్యారు. ద్రవ్య పెట్టుబడి ట్రంప్ బిల్లును అంగీకరించకపోతే, కార్మికులను మరింత తీవ్రంగా ప్రభావితం చేస్తూ సంక్షేమ వ్యయంలో మరింత భారీ కోతల ద్వారా లోటును మరింత తగ్గించవలసి ఉంటుంది.

ఈ విధంగా మనం మెట్రోపాలిటన్ పెట్టుబడిదారీ స్వభావంలో పూర్తి మార్పును చూస్తున్నాం. యుద్ధం తర్వాత ఎదురైన అస్తిత్వ సంక్షోభం కారణంగా యుద్ధానంతర సంవత్సరాలలో పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షేమ వ్యయాన్ని పెంచడానికి అంగీకరించవలసి వచ్చింది (వలసరాజ్యాలకు స్వేచ్ఛ, దాదాపు పూర్తి ఉపాధికి అంగీకరించడం సహా). మెట్రోపాలిటన్ పెట్టుబడి నుండి సాధించిన ఈ రాయితీలను అప్పుడు పెట్టుబడిదారీ స్వభావంలో ఒక ప్రాథమిక ,శాశ్వత మార్పుగా, దోపిడీ వ్యవస్థను సంక్షేమ పెట్టుబడిదారీ వ్యవస్థగా పిలవచ్చనే అభిప్రాయాన్ని ఉదారవాదులు ప్రచారం చేశారు. ఇది సోషలిజం దిశగా పరివర్తన అవసరాన్ని తొలగిస్తుందని వాదించారు.

1960ల చివరలో, 1970ల ప్రారంభంలో వచ్చిన ద్రవ్యోల్బణం పెరుగుదల ఈ వాదనను త్రోసిపుచ్చింది. నిరూపించబడింది. ఇది ప్రతిచోటా నయా ఉదారవాద పాలనను తీసుకువచ్చింది. మెట్రోపాలిటన్ ఆర్థిక వ్యవస్థలలో నిరుద్యోగ స్థాయిలను పెంచింది. నయా ఉదారవాద పెట్టుబడిదారీ సంక్షోభం సామ్రాజ్యవాద ఆధిపత్యానికి ఒక సవాలును సృష్టించింది. ఇది సంక్షేమ వ్యయం నుండి సైనిక వ్యయం వైపు మరింత మార్పును తీసుకువస్తోంది. మెట్రోపాలిటన్ పెట్టుబడిదారీ విధానం దాని స్వంత దేశంలో కూడా దశాబ్దాలుగా చూడని భయంకరమైన దోపిడీ, దూకుడు రూపాన్ని తీసుకుంటుంది.

# గ్రామ పంచాయతీలకు నిధుల కొరత!

దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసి, అవి స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థలుగా పని చేసే రీతిలో చర్యలు తీసుకోవాలని భారత రాజ్యాంగం అధికరణ 40 చెబుతున్నది. అదే విధంగా అధికరణ 243(1) ప్రకారం రాష్ట్ర ఆర్థిక సంఘం పంచాయతీల అవసరాలను గుర్తించి, వాటికి కావలసిన నిధులను రాష్ట్ర బడ్జెట్ నుంచి విడుదల చేయడానికి ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది. ఆ నివేదికను అసెంబ్లీ సమావేశాలలో చర్చించి గ్రామ పంచాయతీలకు నిధులను విడుదల చేయాల్సి ఉంది. అయితే కొన్ని రాష్ట్రాలు తప్ప, చాలా రాష్ట్రాలు పంచాయతీలను బలోపేతం చేసే చర్యలు తీసుకోలేదు. దీనితో ఎన్నో గ్రామ పంచాయతీలు నిధుల కొరతతో అల్లాడుతున్నాయి. మన రాష్ట్రంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గత పది సంవత్సరాలలో ఒక్కటంటే ఒక్క రాష్ట్ర ఆర్థిక సంఘం నివేదికను అసెంబ్లీ ముందు ఉంచడంగానీ, ఆర్థిక సంఘం సూచించిన ప్రకారం గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేయడం గాని జరుగలేదు. ఫలితంగా అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతున్నది. తెలంగాణలో 12,769 గ్రామపంచాయతీలు ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రాష్ట్రంలో దాదాపుగా 8000 గ్రామ పంచాయతీలు ఉండేవి. రాష్ట్ర ప్రభుత్వం 200 జనాభా లేని గ్రామాలను కూడా పంచాయతీలుగా చేసి రాజకీయ నాయకులకు ఉద్యోగాలు కల్పించడం తప్ప పంచాయతీలకు ఎటువంటి లాభం కలగలేదు. 2011 జనాభా ప్రాతిపదికన రాష్ట్రవ్యాప్తంగా 12769 గ్రామపంచాయతీలకు కేంద్రం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు ప్రతినెలా దాదాపు రూ.1080 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌ఎఫ్‌సి క్రింద ప్రతినెలా రూ.129 కోట్లు నిధులు విడుదల చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన రాష్ట్రంలోని పంచాయతీలకు కేంద్రం నిధులు 5 నెలలకు




సంబంధించి రూ.5,480 కోట్లు, ఎస్‌ఎఫ్‌సి నిధులు 16 నెలలకు సంబంధించి రూ.1,920 కోట్లు రావాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పెండింగ్‌లో ఉన్న ఈ నిధులు విడుదలయితేనే గ్రామపంచాయతీలో అభివృద్ధి పనులు ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఎన్నికైన పాలక వర్గాలు ఉన్నప్పుడే కేంద్ర ఆర్థిక సంఘం నిధులు విడుదలవుతాయి. కాబట్టి, స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయితే తప్ప నిధులు దక్కవు. ఇలావుంటే, ఒక పద్ధతి అంటూ లేకుండా గత ప్రభుత్వ పెద్దలు తమకు తోచినంత, తమకు కావలసిన పంచాయతీలకు నిధులు విడుదల చేయడం జరిగింది. పంచాయతీలకేకాక శాసన సభ నియోజకవర్గాలకు కూడా పక్షపాత ధోరణితో గత ముఖ్యమంత్రి పదివేల కోట్లు దగ్గర పెట్టుకొని కొన్ని నియోజకవర్గాలకు వందల కోట్లు మంజూరు చేయడం, కొన్నింటికి మొండిచేయి చూపించడం జరిగింది. 2018వ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పంచాయతీ చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టం సెక్షన్ 37 ప్రకారం జిల్లా కలెక్టర్లకు సర్పంచులపై విస్తృత అధికారాలు ఇచ్చింది. కలెక్టర్ ఆదేశాలు సర్పంచ్ అమలు చేయకున్నా, అధికార దుర్వినియోగం వంటి సందర్భాలలో సర్పంచులు పదవి నుంచి తొలగించవచ్చు. కొన్ని సందర్భాలలో సర్పంచులు స్థానిక శాసనసభ్యునికి అనుకూలురు కానప్పుడు శాసనసభ్యుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం, దానిపై కలెక్టర్ సర్పంచులు పదవి నుంచి తొలగించడం వంటివి జరగడంతో సర్పంచులు ఒక భయానక వాతావరణం నెలకొంది. గ్రామపంచాయతీలకు నిధుల లేమి కారణంగా చాలా చోట్ల సిబ్బందికి వేతనాలు చెల్లించడం లేదు. గత ప్రభుత్వం గ్రామపంచాయతీలోని 500 జనాభాకు ఒక మల్టీపర్పస్ కార్మికుడిని నియమించుకునే అవకాశం కల్పించింది. వీరు విద్యుత్ లైట్లు, పారిశుద్ధ్యం, మురుగు కాలువలు పూడిక తొలగింపు, చెత్త ట్రాక్టర్ నడిపించడం, మంచినీటి సరఫరా వంటి పనులు చేయాల్సి ఉంటుంది. అసలే చాలిచాలని వేతనాలతో రూ 8,500 పనిచేస్తున్న వీరికి నాలుగు నెలలుగా బకాయిలు ఉన్నాయి. తక్షణమే విడుదల చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామ పంచాయతీలకు గత ప్రజాప్రతినిధుల పదవీకాలం గత ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీతో ముగిసింది. అధికారంలో ఉన్నప్పు డు, వారు నిధులు మంజూరవుతాయన్న నమ్మకంతో, అప్పులు సప్పులు చేసి మరీ అభివృద్ధి పనులు చేపట్టారు. చాలా వరకు పనులు ముగిసినప్పటికీ, ఆ బిల్లులు ఇంతవరకు రాలేదు. తమకు రావలసిన పెండింగ్ బిల్లులు చెల్లించాకే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని సర్పంచుల సంఘం కోరింది. గత ప్రభుత్వంలోని అధిక మొత్తంలో బిల్లులు బకాయిలు ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ పెండింగ్ బిల్లులపై స్పందించడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల కోడ్ పేరుతో గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడం చాలా దురదృష్టకరమని, వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**– పరిశీలకుడు**

# మాదక ద్రవ్యాల మత్తులో యువత చిత్తు

ప్రపంచవ్యాప్తంగా 300 మిలియన్లకు పైగా ప్రజలు, ముఖ్యంగా యువత , మాదకద్రవ్యాల దురలవాట్ల విష వలయంలో చిక్కి విలవిల్లాడుతూ, పలు సవాళ్లకు తెర లేపుతున్నారు. గత దశాబ్ద కాలంలో కన్నాబిస్ ఆధారిత డ్రగ్స్ అక్రమ వినియోగం 25 శాతం పెరగడం ఓ ప్రమాదకర హెచ్చరికగా తీసుకోవాలి. మాదక ద్రవ్యాల అక్రమ వ్యాపారం సాలీనా 400 బిలియన్లు దాటడంతో పాటు నేరాలు, ఘోరాలు, అవినీతి, హింస, వింతపోకడలు, మానవ అక్రమ రవాణా, తీవ్ర అనారోగ్య సమస్యలకు దారి తీస్తున్నాయి. దినదినం అత్యంత సామర్థ్యం లేదా దుష్ప్రభావం కలిగిన డ్రగ్స్ మార్కెట్‌లో పలు రూపాల్లో విచ్చలవిడిగా ప్రత్యక్షం కావడం, యువతతో పాటు పాఠశాల పిల్లలు కూడా దురలవాట్లకు తలవంచడంతో పలు ఆందోళనకర అనారోగ్యాలకు, చివరికి ప్రాణాలు పోయే దుస్థితికి చేరడం చూస్తున్నాం. ఇలాంటి అవాంఛనీయ విష వలయాలు పేదరికాన్ని, అశాంతిని పెంచుతున్నాయి.



**అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం:**

ప్రమాదకర, ప్రాణాంతక మాదక ద్రవ్యాల దురలవాట్ల పట్ల సామాన్య జనాల్లో అవగాహన కలిగించడానికి ఐక్యరాజ్యసమితి, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) కృషి చేస్తున్నాయి. మాదక ద్రవ్యాల నిర్మూలనతో విద్య, ఆరోగ్యం, న్యాయం, ప్రత్యామ్నాయ జీవనోపాధులు సుసాధ్యం అవుతాయి. మాదక ద్రవ్యాల దుర్వినియోగంతో పాటు వాటి అక్రమ రవాణా అనైతిక యంత్రాంగాలను ఛేదించడం, కట్టడి చేయడంతో సామాజిక ఆర్థిక ప్రగతి సాధ్యం అవుతుంది. మాదక ద్రవ్యాల దుర్వినియోగంతో పాటు అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రభుత్వాలు, సంస్థలు, పౌర సమాజం సమన్వయంతో ముందుకు సాగుతూ, డ్రగ్స్ లేని ప్రపంచాన్ని నిర్మించే ప్రయత్నాలను ముమ్మరం చేయాలి.

ముఖ్యమైన మాదక ద్రవ్యాల జాబితాలో స్టిమ్యులెంట్స్ (కొకైన్ లాంటివి), డిప్రసెంట్స్ (ఆల్కహాల్ లాంటివి), పెయిన్ కిల్లర్స్ (హెరాయిన్ లాంటివి), హేలూసినోదెన్స్ (ఎల్‌ఎస్‌డి లాంటివి) వర్గాలు వస్తాయి. మాదక ద్రవ్యాల్లో మరుజువానా, ఓపినాయిడ్స్, కొకేయిన్, ఆల్కహాల్, ఆంఫిటమైన్స్, కన్నాబిస్, ఏటిఎస్, సెడెటివ్స్, ఇన్హలెంట్స్, హేలూసినోయిడ్స్ మొదలగునవి వస్తాయి.

మాదక ద్రవ్యాల దుర్వినియోగ వలయంలో చిక్కిన అభాగ్యులకు శారీరక, మానసిక, భావోద్వేగ సమస్యలు ఉత్పన్నం అవుతాయి. డ్రగ్స్ వాడకం పెరిగితే గుండె జబ్బులు, స్ట్రోక్, ఊపిరితిత్తులు నోటి క్యాన్సర్స్, హెచ్‌ఐవి, హెపటైటిస్, శ్వాస ఇబ్బందులు, కాలేయం/మూత్ర పిండాల సమస్యలు, బరువు తగ్గడం, నిద్రలేమి, అనవసర ఆవేశం, ఆందోళన, టిబీ, జ్ఞాపకశక్తి, తడబాటు, చులకన కావడం, కుటుంబ సంబంధాల విచ్ఛిన్నం, చివరికి మరణం లాంటి పలు ఇతర సమస్యలు కూడా ఉత్పన్నం అవుతున్నాయి. భారతంలో 14.6 శాతం మంది ఆల్కహాల్‌ను, 2.8 శాతం కన్నాబిస్ ఉత్పత్తులను, 2.06 శాతం ఓపినాయ్స్‌ను, 1.08 శాతం సెడేటివ్స్‌ను వాడుతున్నట్లు తేలింది. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, అస్సాం, మిజోరాం, మణిపూర్, సిక్కిం, యూపీ రాష్ట్రాల్లోనే సగానికి పైగా డ్రగ్స్ వినియోగదారులు ఉన్నట్లు తేలింది.

మాదక ద్రవ్యాల దుర్వినియోగాల కట్టడికి భారత ప్రభుత్వం నిషా ముక్త్ భారత్ అభియాన్, డ్రగ్ డీ అడిక్షన్ కేంద్రాలు, ఎన్‌సిబి వంటివి యువతలో నైపుణ్యాలు లేదా సామర్థ్యం పెంచడం లాంటివి కొనసాగించాలి. విద్యాలయ పరిసరాల్లో డ్రగ్స్ చొరబడకుండా గస్తీలను పెంచి, మత్తులో జీవితాలను చిత్తు చేసుకోకుండా, మాదక ద్రవ్యాలు మానవ ప్రగతికి ప్రతిబంధకాలని తలిచి, రేపటి ఆరోగ్యకర పౌర సమాజ స్థాపనకు నేడే పునాదులు వేద్దాం, నో టు డ్రగ్స్ అంటూ యువభారతం నినదించాలి.

# చిత్రహింసలు... మానవతకు కళంకాలు

చిటికెడు రుణం కోసం వెట్టిచాకిరీ దురాచారాలు, బాల కార్మికుల శ్రమను దోచే సంపన్న కుసంస్కారులు, ఆలినోట్‌లో గుడ్డలు కుక్కి చిత్రహింసలు చేస్తున్న మనసులేని భర్తలు, దినదినం అమానవీయ చిత్రహింసలకు గురవుతున్న అభాగ్యులు ఎందరో నిశ్శబ్దంగా రోదిస్తున్నారు, ఓదార్పుకి ఆమడ దూరం అవుతున్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు, సంక్షోభాలు, తీవ్ర విపత్తుల నడుమ మిలియన్ల కొద్ది ప్రజలు ఇప్పుడు కూడా చిత్రహింసలను అనుభవించడం కొనసాగుతున్న వేళ ప్రపంచ దేశాలు ప్రతి ఏటా జూన్ 26న ఐరాస అంతర్జాతీయ చిత్రహింస బాధితుల మద్దతు దినం (యూఎన్ ఇంటర్నేషనల్ డే ఇన్ సపోర్ట్ ఆఫ్ విక్టిమ్స్ టార్చర్) పాటించడం ఆనవాయితీగా మారింది. సరైన కారణం లేకుండా అమానవీయంగా, ఉద్దేశపూర్వకంగా హింసించడం లేదా బాధ పెట్టడాన్ని 'టార్చర్' లేదా 'చిత్రహింస'గా నిర్వచిస్తారు. చిత్రహింస పెట్టడం నేరమని, మానవ హక్కులను హరించడం అమానవీయమని, చిత్రహింసలు బాధితుల కనీస జీవించే హక్కులను కాలరాస్తున్నారని, వ్యక్తిత్వ హననం జరుగుతున్నదని తెలుసుకోవాలి. నేడు కనీసం వందకు పైగా సాయుధ పోరాటాలు జరుగుతున్నాయని, ఆయా ప్రాంతాల్లో అన్ని వయస్సుల ప్రజలు చిత్రహింసలకు గురవుతున్నారని అర్థం అవుతున్నది. ఐక్యరాజ్యసమితి ద్వారా ప్రతి ఏటా కనీసం 50,000 మంది బాధితులకు న్యాయ, మానవీయ, మానసిక, వైద్య అవసరాలకు చేయూత ఇవ్వడం కొనసాగుతున్నది. స్వేచ్ఛకు దూరంగా నిర్బంధాల వలలో చిక్కుకున్న వారు, పిల్లలు కౌమార యువత, శరణార్థులు, వలసదారులు, ఆదివాసీ జాతులు, లైంగిక లింగ ఆధార హింస బాధితులు లాంటి మిలియన్ల అభాగ్యులు నేడు ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా అల్పాదాయ దేశాల్లో చిత్రహింసలు కొనసాగుతున్నాయి. చిత్రహింస బాధితులు అధికంగా శ్రీలంక, ఇరాన్, ఇరాక్, అఫ్ఘానిస్థాన్, కాంగో, సూడాన్, ఇథియోపియా, టర్కీ, సిరియా లాంటి దేశాల్లో ఉన్నట్లు వివరాలు స్పష్టం చేస్తున్నాయి. ఇటువంటి అభాగ్య చిత్రహింస బాధితులకు మద్దతుగా ప్రజల్లో అవగాహన పెంచడం, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం, వారికి మానవ హక్కులు కల్పించడం, సామాజిక మాధ్యమాల వేదికగా బాధితుల పక్షాన గళాలు విప్పడం, బాధితుల పరిరక్షణ చట్టాలకు పదును పెట్టడం, బాధితుల జీవిత గాథలను వినడం లాంటివి ఐరాస అంతర్జాతీయ చిత్రహింస బాధితుల మద్దతు దినం వేదికగా జరగాలి. చిత్రహింస బాధితులు దీర్ఘకాలిక మానసిక సమస్యలు, ఆందోళనలు, నిరాశలు, ఒత్తిడులు, నొప్పులు, తలనొప్పి, శ్వాస ఇబ్బందులు లాంటి వ్యాధి లక్షణాలు కనిపిస్తాయని గమనించాలి. ప్రతి ఒక్కరు కనీస గౌరవాన్ని, మర్యాదను పొందడానికి అర్హులని తెలుసుకోవాలి. ఇలాంటి చిత్రహింస బాధితులకు మద్దతుగా నిలుస్తూ, అవసర చేయూతను అందిస్తూ, స్వేచ్ఛను బహుకరిస్తూ, మానవీయతను బతికిస్తూ వారి జీవితాల్లో సానుకూల మార్పులకు కారణం కావాలి. ఇలాంటి చిత్రహింసలు జరగకుండా చూసుకోవడం, బాధితులకు అండగా నిలవడం మన కనీస కర్తవ్యమని తెలుసుకుందాం, చిత్రహింసలు లేని పౌర సమాజాన్ని నిర్మించుకుందాం.

# నీటి కాలుష్యం – ప్రజారోగ్యాన్ని మింగేస్తున్న సైలెంట్ కిల్లర్..!

ప్రపంచం అభివృద్ధి బాట పట్టినప్పటికీ, మనిషి ఆరోగ్యాన్ని గాఢంగా ప్రభావితం చేస్తూ మౌనంగా నాశనం చేస్తున్న ప్రధాన సమస్యల్లో ఒకటి నీటి కాలుష్యం. తాగడానికి, వంటకు, పంటలకు, పరిశ్రమలకు ఉపయోగించే నీరు కాలుషితమవుతున్న వేగాన్ని చూస్తే భవిష్యత్ పట్ల భయమేస్తోంది. మానవుడే కాలుష్యానికి ప్రధాన కారణం కావడం విషాదకరం. వ్యవసాయంలో అధికంగా వాడుతున్న యూరియా, పెస్టిసైడ్లు భూమిలోకి జారిపడి భూగర్భ జలాలను కలుషితం చేస్తున్నాయి. పరిశ్రమల నుండి విడుదలయ్యే రసాయనాలు నదుల్లో కలిసిపోతున్నాయి. నగరాల్లో మురుగు నీరు శుద్ధి లేకుండా నేరుగా నదుల్లోకి వెళ్లడం వల్ల, మంచినీటి మూలాలు బాక్టీరియా, వైరస్, రసాయనాలతో కలుషితమవుతున్నాయి. ఈ కాలుష్యం ప్రజారోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. గిల్డీడ, హెపటైటిస్, టైఫాయిడ్ డెంగ్యూ వంటి జల జనిత వ్యాధులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో శుద్ధి చేసిన నీరు అందుబాటు లేకపోవడంతో చిన్నపిల్లలు, గర్భిణులు, వృద్ధులు తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. వరదల సమయంలో కలుషిత నీటి కారణంగా ప్రాణాపాయం మరింత పెరుగుతుంది. ప్రభుత్వాలు ఈ సమస్యను ప్రాధాన్యతతో తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పరిశ్రమలపై పర్యావరణ నియంత్రణలు గట్టిగా అమలు చేయాలి. మురుగునీటి శుద్ధి కేంద్రాలు అన్నిచోట్ల ఉండాలి. గ్రామాల్లో సురక్షితమైన తాగునీటి పథకాలను విస్తరించాలి. డ్రైనేజీలు మంచినీటి మూలాలకి దూరంగా ఉంచాలి. తాగునీటిని పరిగణనలోకి తీసుకుని జాగ్రత్తగా వాడాలి. స్వచ్ఛతలో భాగస్వాములవ్వాలి.

నీటి కాలుష్యం మౌనంగా ఉన్నా, దాని ప్రభావం గట్టిగా వినిపిస్తోంది – మానవ సమాజం ఆరోగ్యాన్ని మింగేస్తూ..! దీనిని పట్టించుకోకపోతే రానున్న తరాలకు నీరు అవసరం కాదు, ఔషధమే మిగిలిపోతుంది. కాబట్టి ఇప్పటికైనా నీటి కాలుష్యాన్ని అరికట్టే దిశగా మనం మొదలుపెట్టాలి. ఇకనీటిని జీవనాధారంగా చెప్పుకుంటాం. అయితే అదే నీరు కాలుష్యమైతే జీవితాన్ని బలితీసుకునే ప్రాణాంతక ముప్పుగా మారుతుంది. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో శుద్ధతలేని నీరు రోజురోజుకీ కోట్లాది ప్రజల జీవితాలను ముప్పు పాలుచేస్తోంది. ఈ సమస్యపై ఐక్యరాజ్యసమితి, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ), సీఎస్‌ఈ వంటి సంస్థలు వరుస హెచ్చరికలు జారీ చేసినా, ప్రభుత్వాల వైఖరి మాత్రం 'గత అనుభవాలు గాలికొదిలే' ధోరణిలోనే ఉంది. నీటి కాలుష్యం వల్ల కలిగే ఆరోగ్య ముప్పులు, ఆర్థిక నష్టాలు, ప్రభుత్వాల నిర్లక్ష్యం, పరిష్కార మార్గాలపై సమగ్రంగా విశ్లేషిద్దాం.

ఒక్క డయేరియా వల్లే మన దేశంలో సంవత్సరానికి సుమారు 15 లక్షల మంది పిల్లలు మరణిస్తున్నారని కేంద్ర పర్యావరణ పరిశోధనా సంస్థ (CSE) చెబుతోంది. ఈ సమాచారం దాదాపు దశాబ్ద కాలంగా అందుబాటులో ఉంది. అయినా, దీని తీవ్రత తగ్గడం లేదు. ప్రతి సంవత్సరం సుమారు 3.5 కోట్ల మంది నీటి ద్వారా సంక్రమించే వ్యాధులకు గురవుతున్నారు. వాటి వల్ల 7.3 కోట్ల పనిదినాలు కోల్పోయి, దాదాపు రూ.36,600 కోట్ల ఆర్థిక నష్టం జరుగుతోంది. డబ్ల్యూహెచ్‌ఓ అంచనా ప్రకారం, ప్రతి ఇంటికీ శుద్ధ తగిన తాగునీటిని సరఫరా చేస్తే, 4 లక్షల మరణాలు నివారించవచ్చని స్పష్టం చేసింది. 2025 వానాకాలానికి ముందే ఒడిశాలో 6 జిల్లాల్లో కలరా వ్యాప్తి, పదుల సంఖ్యలో మరణాలు జరిగాయి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలతో కలరా వేగంగా వ్యాప్తి చెందుతోంది. 2024లో ఏపీలో 9 జిల్లాల్లో కలరా, 20 జిల్లాల్లో 110కి పైగా డయేరియా అవుట్ బ్రేక్స్ నమోదయ్యాయి. తెలంగాణలో ప్రతి సంవత్సరం సగటున 3.5 లక్షల డయేరియా కేసులు నమోదవుతున్నాయి. విషజలాలతో పాటు, చెత్త మడుగుల వల్ల దోమలు విపరీతంగా పెరిగి డెంగీ, మలేరియా లాంటి వ్యాధులు ప్రజల జీవనాన్ని ముప్పు చేస్తోంది. నీటి పైపులు మురుగుకాల్వల గుండా వేయడం, లేదా పాత గొట్టాల లీకేజీల వల్ల మురుగునీరు తాగునీటిలో కలుస్తోంది. క్లోరినేషన్ పద్ధతులు చాలా చోట్ల పాటించట్లేదు. ప్రజలకు అందాల్సిన సురక్షిత తాగునీటి హక్కు గాలికొదిలే హక్కుగా మారింది.

**– మన్నారం నాగరాజు**

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## డ్రగ్స్ కేసులో పంజాబ్ మాజీ మంత్రి అరెస్ట్..!

**న్యూఢిల్లీ :** పంజాబ్ రాష్ట్రానికి సంబంధించిన 2021 నాటి డ్రగ్స్ కేసులో శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడి) సీనియర్ నాయకుడు, ఆ రాష్ట్ర మాజీ మంత్రి విక్రమ్ సింగ్ మజీతియా అరెస్టయినట్లు తెలుస్తోంది. బుధవారం తెల్లవారు జామున విజిలెన్స్ అధికారులు అమృత్‌సర్‌లోని మజీతియా నివాసంలో ఆకస్మిక సోదాలు చేశారు. విక్రమ్ మజీతియా శిరోమణి అకాలీదళ్ పార్టీ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌కు సొంత బావ. ఆయన గతంలో పంజాబ్ రాష్ట్రమంత్రిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఆయన భార్య గనీవే కౌర్ మజీతియా ఎమ్మెల్యేగా ఉన్నారు. 2021 నాటి డ్రగ్స్ కేసులో విక్రమ్ మజీతియా నిందితుడిగా ఉన్నారు. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన సిట్.. మజీతియాకు, ఆయన కుటుంబానికి సంబంధించిన కంపెనీల్లో అక్రమ లావాదేవీలు జరిగినట్లు గుర్తించింది. ఈ క్రమంలో బుధవారం విజిలెన్స్ బ్యూరో అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రైడింగ్‌కు రావడం స్థానికంగా సంచలనం రేపింది. ఈ సందర్భంగా మజీతియా, మరికొందరిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. కేసులో ఎవరినైనా అరెస్ట్ చేశారా..? అన్న ప్రశ్నకు అమృత్‌సర్ ఆర్పీఎస్ సంధూ అవునని చెప్పారు. అరెస్టయిన వాళ్లను ఇక్కడ నుంచి తీసుకెళ్లామని తెలిపారు. ప్రస్తుతం ఇంట్లో సోదాలు జరుగుతున్నాయన్నారు.

## 11 ఏళ్లలో అప్రకటిత అత్యవసర పరిస్థితి

### పౌర స్వేచ్ఛల అణిచివేత : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** హద్దులేని ద్వేషపూరిత ప్రసంగం, పౌర స్వేచ్ఛలపై అణిచివేత జరుగుతోందని కాంగ్రెస్ పేర్కొంది. పదకొండు సంవత్సరాలుగా భారత ప్రజాస్వామ్యం 'క్రమబద్ధమైన, ప్రమాదకరమైన' ఐదు రెట్లు దాడికి గురైందని, దీనిని 'అప్రకటిత అత్యవసర పరిస్థితి@11' అని అభివర్ణించింది. ఇందిరా గాంధీ ప్రభుత్వం అత్యవసర పరిస్థితి విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్‌పై బిజెపి విమర్శలు చేస్తున్న నేపథ్యంలో, కాంగ్రెస్ కూడా ప్రతివిమర్శలు చేస్తోంది. ప్రభుత్వం పార్లమెంటును బలహీనపరుస్తోందని, రాజ్యాంగ సంస్థల స్వయంప్రతిపత్తిని క్షీణింపజేస్తోందని ఆరోపించింది. 'ప్రభుత్వ విమర్శకులను నిత్యం దుర్భాషలాడుతున్నారని, పాలకవర్గం ద్వేషం, మతతత్వాన్ని ఉద్దేశపూర్వకంగా వ్యాప్తి చేస్తుందని, నిరసన తెలుపుతున్న రైతులను 'ఖలిస్తానీలు' అని ముద్రవేస్తున్నారని, కుల గణనను సమర్థించేవారిని 'పట్టణ నక్సల్స్'గా కొట్టిపారేశారు' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఒక ప్రకటనలో ఆరోపించారు. 'మహాత్మా గాంధీ హంతకులను కీర్తిస్తున్నారు. మైనారిటీలు తమ ప్రాణాలకు, ఆస్తులకు భయపడి జీవిస్తున్నారు. దళితులు, ఇతర అణగారిన వర్గాలను అసమానంగా లక్ష్యంగా చేసుకున్నారు, ద్వేషపూరిత ప్రసంగాలు చేసే మంత్రులకు పదోన్నతులు లభించాయి' అని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంపై దాడులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో, ప్రధాన మంత్రి కొత్త రాజ్యాంగం కోసం '400 పార్' నినాదం ఎత్తుకున్నారని, బాబాసాహెబ్ అంబేద్కర్ వారసత్వాన్ని మోసం చేశారని రమేష్ ఆరోపించారు.



అయితే దేశ ప్రజలు ఆయన నినాదాన్ని తిరస్కరించారని, ప్రస్తుత రాజ్యాంగంలో పొందుపరచబడిన ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయాన్ని పరిరక్షించడం, రక్షించడం, మరింత ప్రోత్సహించడం కోసం కాంగ్రెస్‌కు ఓటు వేశారన్నారు. మోదీ ప్రభుత్వం పార్లమెంటును బలహీనపరుస్తోంది, పార్లమెంటరీ నిబంధనలను నిరంతరం ముక్కలు చేస్తోందని కూడా ఆయన ఆరోపించారు. ప్రజా సమస్యల లేవనెత్తినందుకు ఎంపిలను ఏకపక్షంగా సస్పెండ చేశారు, ప్రభుత్వం కీలకమైన జాతీయ సమస్యలను చర్చించడానికి నిరాకరించిందని ఆయన అన్నారు. కీలకమైన చట్టాలు బుల్‌డోజర్ చేయబడ్డాయని, పార్లమెంటరీ కమిటీ లు దాటవేయబడ్డాయన్నారు. కాగ్ అసంబద్ధంగా మారిందని, ఎన్నికల కమిషన్ సమగ్రత తీవ్రంగా రాజీ పడిందని, కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల సమగ్రత గురించి తీవ్రమైన ప్రశ్నలు విస్మరించబడ్డాయన్నారు. ప్రతి పక్ష పాలిత రాష్ట్రాల్లో బిల్లులను నిరోధించడానికి, విశ్వవిద్యాలయ నియామకాలలో జోక్యం చేసుకోవడానికి గవర్నర్ కార్యాలయాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రముఖ విద్యా సంస్థలు ఏకపక్ష పన్ను డిమాండ్లను ఎదుర్కొన్నాయని పేర్కొన్నారు. దాదాపు 20,000 స్వతంత్ర పౌర సమాజ గొంతులను అణచివేసినట్లు ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టులు, వార్తా సంస్థలపై ప్రభుత్వం బెదిరింపులు, అరెస్టులు, దాడులకు పాల్పడుతోందని, మీడియాపై అపూర్వమైన ఒత్తిడి ఉందని రమేష్ పేర్కొన్నారు. 'ప్రభుత్వానికి అనుకూలమైన జర్నలిస్టులను నియమించుకోవాలని యజమానులపై ఒత్తిడి తెస్తున్నారని, ప్రభుత్వ ప్రకటనలు, అనుమతులను సంపాదకీయ కంటెంట్‌ను నియంత్రించడానికి సాధనాలుగా ఉపయోగిస్తున్నారన్నారు. అధికారుల చేతుల్లో శక్తివంతమైన సాధనమైన సమాచార హక్కును నిర్వీర్యం చేశారని రమేష్ ఆరోపించారు. దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ, వివిధ ప్రతిపక్ష పార్టీల నాయకులను వేధించడానికి, పరువు తీయడానికి ఇడి, సిబిఐ, ఆదాయపు పన్ను శాఖ వంటి సంస్థలు మోహరించబడ్డాయని రమేష్ పేర్కొన్నారు.

## న్యాయపరిపాలనా స్వతంత్రతకు 'ప్రత్యక్ష ముప్పు'

- న్యాయవాదులను నేరుగా పిలిపించేందుకు పోలీసులు, దర్యాప్తు సంస్థలను అనుమతించడంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్య
- న్యాయపరిపాలనలో న్యాయవాద వృత్తి ఒక అంతర్భాగమని తేల్చిచెప్పిన ధర్మాసనం

**న్యూఢిల్లీ :** పోలీసులు లేదా దర్యాప్తు సంస్థలు కక్షిదారులకు (క్లయింట్లకు) సలహాలివ్వడానికి న్యాయవాదులను నేరుగా పిలిపించుకోవడానికి అనుమతించడం న్యాయవాద వృత్తి స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తుందని, అది న్యాయపరిపాలనా స్వతంత్రతకు 'ప్రత్యక్ష ముప్పు' అని బుధవారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. న్యాయమూర్తులు జస్టిస్ కెవి.విశ్వనాథన్, ఎన్.కోటీశ్వర్‌సింగ్‌లతో కూడిన ధర్మాసనం మాట్లాడుతూ న్యాయ పరిపాలనలో న్యాయవాద వృత్తి ఒక అంతర్భాగమని తెలియజేసింది.'దర్యాప్తు సంస్థలు, పోలీసులు కేసు విచారణలో సలహాలు ఇచ్చే డిఫెన్స్ న్యాయవాదిని, న్యాయవాదులను నేరుగా పిలిపించుకోవడానికి అనుమతించడం న్యాయవాద వృత్తి స్వయం ప్రతిపత్తిని తీవ్రంగా దెబ్బతీస్తుంది. అంతేకాకుండా న్యాయపరిపాలనా స్వాతంత్ర్యానికి ప్రత్యక్ష ముప్పుగా కూడా పరిణమిస్తుంది'అని అత్యున్నత న్యాయస్థానం వివరించింది. ఈ అంశంలో ధర్మాసనం రెండు ప్రశ్నలను కూడా సంధించింది. ఒక వ్యక్తికి ఒక కేసులో చట్టపరమైన పార్టీగా మాత్రమే సంబంధం ఉన్నప్పుడు పరిగణించదగిన కొన్ని ప్రశ్న లు తలెత్తుతాయి. దర్యాప్తు సంస్థ, ప్రాసిక్యూటింగ్ ఏజెన్సీ, పోలీస్ నేరుగా ప్రశ్నించేందుకు న్యాయవాదిని పిలిపించవచ్చా? అని ధర్మాసనం తన మొదటి ప్రశ్నను సంధించింది. మరొక ప్రశ్నను కూడా ఇలా అడిగింది. 'దర్యాప్తు సంస్థ, ప్రాసిక్యూటింగ్ ఏజెన్సీ, పోలీస్ ఒక కేసును కలిగి ఉంటే ఆ వ్యక్తి పాత్ర కేవలం న్యాయవాదిగా కాకుండా మరేదైనా ఉందని భావించి, నేరుగా సమన్లు వేయడానికి అనుమతి ఉందా? లేదా?. ఆ అసాధారణ ప్రమాణాల కోసం న్యాయ విచారణాధికారిని పిలిపించాలా? వద్దా' అని ధర్మాసనం అడిగింది.



ధర్మాసనం మాట్లాడుతూ న్యాయపరిపాలన సమర్థత, న్యాయవాదులు తమ వృత్తిపరమైన విధులు మన:స్సాక్షిగా, మరింత ముఖ్యంగా,నిర్భయంగా నిర్వర్తించే సామర్థ్యం ప్రమాదంలో ఉన్నందున ఇతర అంశాలతో పాటు ఈ రెండు అంశాలు కూడా తలెత్తవచ్చని, ఈ నేపథ్యంలో సమగ్ర ప్రాతిపదికన అదనపు పరిష్కారం అవసరమని ధర్మాసనం పేర్కొంది. ఇది న్యాయపరిపాలనను నేరుగా ప్రభావితం చేసే విషయమని ధర్మాసనం చెప్పింది. ఈ అంశంలో ఎప్పుడైతే అతడు ఒక న్యాయవాదిగా ఉన్నాడో అప్పుడు ఆయనను ఒక ప్రొఫెనల్ గాబాధ్యుడిని చేయడం ప్రాథమికంగా అది సమర్థనీయం కాదు. కోర్టు తదుపరి పరిశీలనకు లోబడి ఉంటుందని తెలుస్తోంది. జూన్ 12న హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ గుజరాత్‌కు చెందిన ఒక న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారిస్తున్నప్పుడు ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.తన క్లయింట్‌పై ఉన్న కేసులో న్యాయవాదిని పోలీసుల ముందు హాజరుపర్చాలని ఇచ్చిన నోటీసును రద్దు చేయడానికి 2025 మార్చిలో హైకోర్టు నిరాకరించింది. తదుపరి ఆదేశాలు వచ్చేంతవరకూ ఆయనకు సమన్లు జారీచేయవద్దని, పోలీసులు జారీ చేసే నోటీసుల అమలును నిలిపివేయాలని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనిపై స్పందనను తెలియజేయాలని గుజరాత్ ప్రభుత్వానికి ధర్మాసనం నోటీస్ జారీచేసింది. రుణ లావాదేవీలో ఇద్దరు వ్యక్తుల మధ్య జూన్‌లో ఒక ఒప్పందం కుదిరిందని సుప్రీంకోర్టు గుర్తించింది. ఫిబ్రవరిలో వారిలో ఒకరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇదిలాఉంటే మార్చిలో ఒక పోలీస్ నోటీస్ జారీచేయబడింది. ఆ న్యాయవాది మూడు రోజుల్లో పోలీసులు ముందు హాజరుకావాలని సమన్లు జారీ చేయబడ్డాయి. సమన్లను సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సిబిఎ), సుప్రీంకోర్టు అడ్వకేట్స్‌ఆన్‌రికార్డ్స్ అసోసియేషన్ (ఎస్‌సిఏఓఆర్ఏ) ఖండించాయి. ఇది న్యాయవాద వృత్తి పునాదులను పెకిలించే 'కలతపెట్టే ధోరణి' అని పేర్కొన్నాయి.

## పటిష్ఠంగా ఓటర్ల సవరణ : ఇసి

**న్యూఢిల్లీ :** బీహార్ తర్వాత, 2026లో ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ ఏడాది చివరి నాటికి ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాలను సమగ్రంగా సమీక్షించనుంది. ఎన్నికల జాబితాల సమగ్రతను కాపాడటానికి, రాజ్యాంగ ఆదేశాన్ని అమలు చేయడానికి దేశవ్యాప్తంగా ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణను ప్రారంభించనుంది. దోషరహిత ఓటర్ల జాబితాను సిద్ధం చేయడానికి ఎన్నికల అధికారులు ఇంటింటికి వెళ్లి ధృవీకరణ చేయనున్నారు. అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ శాసనసభల పదవీకాలం వచ్చే ఏడాది మే, జూన్‌లో ముగుస్తోంది. ఈ రాష్ట్రాల్లోని ఓటర్ల జాబితాలను సమగ్రంగా సమీక్షించడం ఈ ఏడాది చివరి నాటికి ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు. అయితే, ఈ ఏడాది చివర్లో బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున, ఇసి అక్కడ వెంటనే ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణను నిర్వహించాలని నిర్ణయించింది. బిజెపికి సహాయం చేయడానికి ఇసి ఓటర్ల డేటాను మోసగించిందని ప్రతిపక్ష పార్టీల ఆరోపణల నేపథ్యంలో, అక్రమ వలసదారులు ఓటర్ల జాబితాలో నమోదు కాకుండా చూసుకోవడానికి పోల్ ప్యానెల్ ఇంటెన్సివ్ సవరణపై అదనపు చర్యలు తీసుకుంది. ఓటర్లుగా మారాలనుకునే లేదా రాష్ట్రం వెలుపల నుండి వలస వెళ్లాలనుకునే దరఖాస్తుదారుల కోసం అదనపు 'డిక్లరేషన్ ఫారమ్' ప్రవేశపెట్టింది. వారు జూలై 1, 1987కి ముందు భారతదేశంలో జన్మించారని, పుట్టిన తేదీ లేదా పుట్టిన ప్రదేశాన్ని నిర్ధారించే ఏదైనా పత్రాన్ని అందించాలి. బిహార్‌లో చివరిసారిగా 2003లో ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించబడింది. వేగంగా పట్టణీకరణ, తరచుగా వలసలు, యువ పౌరులు ఓటు వేయడానికి అర్హులు కావడం, మరణాలను నివేదించకపోవడం, విదేశీ అక్రమ వలసదారుల పేర్లను చేర్చడం వంటి బహుళ కారణాలు సమగ్రతను నిర్ధారించడానికి, లోపాలు లేని ఓటర్ల జాబితాల తయారీని నిర్ధారించడానికి సవరణను నిర్వహించాల్సిన అవసరం ఉందని ఇసి తెలిపింది. ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో ధృవీకరణ కోసం బూత్‌స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తారు. ప్రత్యేక సవరణను నిర్వహిస్తున్నప్పుడు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, 1950 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 16లో స్పష్టంగా నిర్దేశించబడిన ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హత, ఓటర్ల జాబితాలో నమోదుకు అనర్హతలకు సంబంధించిన రాజ్యాంగ, చట్టపరమైన నిబంధనలను ఇసి నిశితంగా పాటిస్తుంది అని ఎన్నికల సంఘం తెలిపింది.

## ప్రభుత్వం చేతిలో ఇసి కీలుబొమ్మ

### కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

**న్యూఢిల్లీ :** ఎన్నికల కమిషన్ ప్రభుత్వం చేతిలో 'కీలక బొమ్మ'గా మారిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. తమ పార్టీ ఎన్నికల్లో 'అక్రమాల' అంశాన్ని లేవనెత్తుతోందని, కానీ ఎన్నికల సంఘం వినడానికి సిద్ధంగా లేదని పేర్కొన్నారు. 2024 మహారాష్ట్ర ఎన్నికల్లో అక్రమాలను బయటపెట్టడానికి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ గణాంకాలను



ఉటంకిస్తూ వాస్తవాలను పేర్కొన్నారని, ఇతరులు కూడా నిజాలు చెప్పారని, కానీ ఎన్నికల కమిషన్ దానిని అంగీకరించడానికి సిద్ధంగా లేదని ఖర్గే అన్నారు. 'ఇసి ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారింది... వినోదం కోసం పనులు చేయడానికి మనకు తోలుబొమ్మలు ఉన్నట్లుగా. మీకు ఒక కీలుబొమ్మ ఉంది. మీరు (ప్రధానమంత్రి నరేంద్ర మోడీ) ఎన్నికల్లో గెలుస్తున్నారని చెప్పుకుంటున్నారు. ఎన్నికల్లో గెలవడం లేదు, మీ యంత్రాంగం గెలుస్తోంది' అని కాంగ్రెస్ ఇందిరా భవన్ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఖర్గే అన్నారు. దానిని మీకు కావలసిన చోటకు వదిలేయండి, మీకు కావలసిన చోట పట్టు సాధించండి అని వివిధ రాష్ట్రాల ఎన్నికలను ప్రస్తావిస్తూ ఆయన అన్నారు. 'మేము మహారాష్ట్రలో ఎన్నికల్లో గెలిచాము, ఐదు నెలల తర్వాత అదే స్థానంలో ఓటర్ల సంఖ్యలో భారీ వ్యత్యాసం ఉంది. ఐదు సంవత్సరాలలో, ఓటర్ల జాబితా 23 శాతం పెరుగుతుంది. కానీ ఐదు నెలల్లో, 8 శాతం పెరుగుదల ఎలా ఉంది' అని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. 'నేను 13 ఎన్నికల్లో పోటీ చేశాను, అనేక ఎన్నికలలో కూడా పాల్గొన్నాను, కానీ నేను అలాంటిది ఎప్పుడూ చూడలేదు' అని ఆయన అన్నారు. కాంగ్రెస్ నిరంతరం ఎన్నికల అక్రమాల అంశాన్ని లేవనెత్తుతోందని, కానీ ఎన్నికల కమిషన్ ఏమీ వినడానికి సిద్ధంగా లేదని, ఎందుకంటే ప్రభుత్వానికి 'ప్రతిచోటా నియంత్రణ' ఉందని ఖర్గే అన్నారు. ఆర్ఎస్ఎస్ వ్యక్తులను ప్రతిచోటా ఉంచారు, ఇతరులకు స్థానం లేదని, ఎన్నికల కమిషన్ తమ మాట వినడం లేదన్నారు. తమకు ఓటర్ల జాబితాను ఇవ్వడం లేదని, బిజపి ప్రభుత్వం దానిని కూడా నియంత్రిస్తున్నదని ఖర్గే మండిపడ్డారు. ఎన్నికల్లో చాలా చోట్ల అక్రమాలు జరిగాయని, చాలా మంది ఫిర్యాదు చేశారని కానీ, ఎన్నికల కమిషన్ సరిదిద్దలేదని ఆయన ఆరోపించారు. ఇసి మోదీ చెప్పేదే చేస్తోందని, ఆయన కోసం చేస్తున్న ఏ పనికైనా చాలా ధన్యవాదాలు అని ఖర్గే ఇసిని ఎద్దేవా చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన అక్రమాల ఆరోపణలను రాహుల్ గాంధీ పునరుద్ఘాటించిన మరుసటి రోజు ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ, 'ఓట్ల దొంగతనం' జరిగిందని, యంత్రాలతో చదవగలిగే డిజిటల్ ఓటరు జాబితాలను, సిసిటి వి ఫుటేజ్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ఐదంతస్తుల భవనంలో అగ్నిప్రమాదం

**నలుగురు మృతి, ముగ్గురికి గాయాలు**



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలోని ఓ భవనంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రోహిణిలోని రిథాల ప్రాంతంలో బహుళ తయారీ యూనిట్లు ఉన్న ఐదు అంతస్తుల భవనంలో జరిగిన అగ్నిప్రమాదంలో నలుగురు మరణించగా, ముగ్గురు గాయపడ్డారని పోలీసులు బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో రోహిణి సెక్టార్–5 ప్రాంతంలో ఉన్న భవనంలో మంటలు చెలరేగినట్లు అగ్నిమాపక శాఖకు సమాచారం అందడంతో, పదహారు అగ్నిమాపక వాహనాలను అక్కడికి తరలించినట్లు అధికారులు తెలిపారు. రిథాల మెట్రో స్టేషన్ సమీపంలోని ఒక ప్రాంగణంలో ఈ ఘటన జరిగినట్లు ఢిల్లీ అగ్నిమాపక సేవల అధిపతి అతుల్ గార్గ్ తెలిపారు. అగ్ని ప్రమాదానికి గల కారణం ఇంకా నిర్ధారణ కాలేదని, దర్యాప్తు జరుగుతోందని అధికారులు చెప్పారు. శిథిలాలలో ఇంకా ఎవరైనా చిక్కుకున్నారా అని తెలుసుకోవడానికి గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటివరకు పోలీసులు నాలుగు కాలిపోయిన మృతదేహాలను వెలికితీమన్నారు. 80 శాతం కాలిన గాయాలతో ఉన్న నితిన్ బన్సాల్ (31), రాకేష్ (30), స్వల్ప కాలిన గాయాలతో ఉన్న వీరేందర్ (25) అనే ముగ్గురిని రక్షించి బిఎస్ఎ ఆసుపత్రికి తరలించినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. నితిన్, రాకేష్‌లను మెరుగైన చికిత్స కోసం ఆర్ఎంఎల్ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. బుధవారం తెల్లవారుజామున 1.15 గంటల ప్రాంతంలో అగ్నిమాపక సిబ్బంది మొదటి అంతస్తు నుండి మూడు కాలిపోయిన మృతదేహాలను వెలికితీశారని, తరువాత మరొక మృతదేహం దొరికిందని అధికారి తెలిపారు. ఉదయం 6 గంటల నాటికి కింది అంతస్తులలో మంటలను అదుపులోకి తెచ్చామని, అయితే మూడవ, పైఅంతస్తులో భారీ పొగ కారణంగా అగ్నిమాపక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. భవనానికి అగ్నిమాపక భద్రతా ధృవీకరణ పత్రం లేదా అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ప్రాంగణాన్ని ఖాళీ చేయడానికి సరైన ప్రాంతం లేదని డిఎఫ్ఎస్ వర్గాలు తెలిపాయి. స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది గోడకు రంధ్రం వేయడానికి జెసిపి యంత్రాన్ని మోహరించాల్సి వచ్చిందని, ఆ తర్వాత అగ్నిమాపక చర్యలు ప్రారంభించామని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. భవనం యజమాని సురేష్ బన్సాల్ కుమారుడు నితిన్ బన్సాల్ గ్రౌండ్, మొదటి అంతస్తులను రెడీమేడ్, ప్లాస్టిక్ సంచుల తయారీకి ఉపయోగించారని పోలీసులు తెలిపారు. రెండవ అంతస్తును ఆనంద్‌కు ఫాబ్రిక్ సంబంధిత పని కోసం అద్దెకు ఇవ్వగా, మూడవ, పైఅంతస్తును డిస్పోజబుల్ ఆర్టికల్స్ వ్యాపారం చేసే రాకేష్ అరోరా గోడౌన్ స్థలంగా ఉపయోగిస్తున్నారు.

## పుణె మెట్రో రైలు రెండో దశకు గ్రీన్‌సిగ్నల్

- జార్ఖండ్‌లోని ఝరియా బొగ్గు గనుల నిర్వాసితుల పునరావాసానికి రూ.5,940 కోట్లు
- ఉత్తరప్రదేశ్‌లో పొటాటో కేంద్రం ఏర్పాటు
- కేంద్ర మంత్రి వర్గం ఆమోదం

**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేబినెట్ పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ఎమర్జెన్సీ బాధితులకు నివాళిగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించి.. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా తీర్మానాన్ని ఆమోదించింది. శుభాంశు శుక్లాతో కూడిన మిషన్ విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశించడాన్ని స్వాగతించింది. మరో తీర్మానానికి ఆమోదం తెలిపిన మంత్రివర్గం పుణె, ఆగ్రాలలో పలు ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటనకు 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర మంత్రివర్గం తీర్మానాన్ని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ చదివి వినిపించారు. 'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం ఈ రోజు అత్యవసర పరిస్థితిపై పోరాడిన లెక్కలేనన్ని మంది త్యాగాలను గుర్తుంచుకోవాలని నిర్ణయించింది. రాజ్యాంగాన్ని హత్య చేసే ప్రయత్నాన్ని విఫలం చేసిన ఈ ప్రజాస్వామ్యవాదులకు కేంద్ర మంత్రివర్గం నివాళులర్పించింది' అని పేర్కొన్నారు. కాగా, పుణె మెట్రో రైలు ప్రాజెక్టు దశ2ను కేబినెట్ ఆమోదించిందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ రెండు ఎలివేటెడ్ కారిడార్లు 12.75 కి.మీ. విస్తరించి ఉంటాయని.. 13 స్టేషన్లు ఉంటాయని తెలిపారు. చాందినీ చౌక్, బవ్ధాన్, కోత్రుడ్ ఖరడి, వాఘోలి వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న శివారు ప్రాంతాలను కలుపుతాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును నాలుగు సంవత్సరాలలోపు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అలాగే జార్ఖండ్‌లోని ఝరియా బొగ్గు గనుల నిర్వాసితుల పునరావాసానికి (ఝరియా మాస్టర్ ప్లాన్) రూ.5,940 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు.





నిర్వాసిత కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం కోసం నైపుణ్య శిక్షణ, స్థిరమైన ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలోని సింగ్నాలో దక్షిణాసియా ప్రాంతీయ కేంద్రం ఆఫ్ ది ఇంటర్నేషనల్ పొటాటో సెంటర్ (సిఐపి) ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనికి రూ. 111.5 కోట్లు కేటాయించింది. ఆహారం, పోషకాహార భద్రత, రైతుల ఆదాయం, ఉపాధి కల్పనను పెంచడం దీని ప్రధాన ప్రధాన లక్ష్యం. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగాళాదుంప ఉత్పత్తి చేస్తున్న దేశం భారత్ కాగా.. ఇందులో ఉత్తరప్రదేశ్ ముందువరుసలో ఉన్నది. పొటాటో సెంటర్ ఏర్పాటుతో బంగాళాదుంప ఉత్పత్తి, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, రవాణా, మార్కెటింగ్, విలువ గొలుసులో గణనీయమైన ఉపాధి అవకాశాలను సృష్టించే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. అలాగే, యూపీలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. యూపీ గౌతమ్‌బుద్ధనగర్‌లో రూ.417కోట్లతో ఈఎంసీ క్లస్టర్ ఏర్పాటు చేయనున్నది.

## కొనసాగుతున్న 'ఆపరేషన్ సింధు'

### 224 మందితో ఇజ్రాయెల్ నుంచి ఢిల్లీకి చేరుకున్న మరో విమానం

**న్యూఢిల్లీ :** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య వార్ కారణంగా అక్కడ చిక్కుకున్న భారతీయుల్ని రప్పించేందుకు కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ సింధు' కొనసాగుతోంది. ఈ ఆపరేషన్ ద్వారా ఇజ్రాయెల్, ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయుల్ని స్వదేశానికి తీసుకొస్తోంది. పొరుగు దేశాలకు చెందిన పౌరులకు కూడా భారత్ ఆపరేషన్ సింధు ద్వారా సాయం చేస్తోంది. ఈ ఆపరేషన్ ద్వారా ఇప్పటికే పలువురు భారతీయులు స్వదేశానికి చేరుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఇజ్రాయెల్ నుంచి 224 మంది భారతీయులతో కూడిన భారత వాయుసేనకు చెందిన విమానం ఢిల్లీకి చేరుకుంది. వారికి పాలెం విమానాశ్రయంలో అధికారులు స్వాగతం పలికారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఇజ్రాయెల్ నుంచి ఇప్పటి వరకూ 818 మందిని కేంద్రం స్వదేశానికి తరలించింది. మరోవైపు ఇరాన్ నుంచి 11వ విమానం ఇవాళ తెల్లవారుజామున ఢిల్లీలో ల్యాండ్ అయిన విషయం తెలిసిందే. 282 మంది భారతీయులు క్షేమంగా స్వదేశానికి తిరిగొచ్చారు. 'జూన్25న తెల్లవారుజామున మాషా (ఇరాన్) నుంచి 282 మంది భారతీయులతో ప్రత్యేక విమానం ఢిల్లీకి చేరుకుంది. దీంతో ఇప్పటి వరకూ ఇరాన్ నుంచి 2,858 మందిని స్వదేశానికి తీసుకొచ్చాం' అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎక్స్‌లో పోస్టు పెట్టింది. ఇందులో పొరుగు దేశాలైన నేపాల్, శ్రీలంకకు చెందిన వారు కూడా ఉన్నారు.

## ఏడాదికి రెండుసార్లు టెన్త్ పరీక్షలు

### ఫిబ్రవరిలో పరీక్షలు రాయడం తప్పనిసరి మేలో ఐచ్ఛికం : సిబిఎస్ఇ

**న్యూఢిల్లీ :** వచ్చే విద్యా సంవత్సరం (2026) నుంచి 10వ తరగతి విద్యార్థులు ఒక విద్యా సెషన్‌లో రెండుసార్లు సిబిఎస్‌సి బోర్డు పరీక్షలు రాసే అవకాశం ఉంది. అయితే ఫిబ్రవరిలో మొదటి దశకు హాజరు కావడం తప్పనిసరి అని అధికారులు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం మేలో జరిగే రెండవ దశ పరీక్షలు తమ పనితీరును మెరుగుపరచుకోవాలనుకునే విద్యార్థులకు ఐచ్ఛికం అని వారు తెలిపారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) 10వ తరగతికి సంవత్సరానికి రెండుసార్లు బోర్డు పరీక్షలు నిర్వహించడానికి నిబంధనలను ఆమోదించింది. ఈ చర్యను కొత్త జాతీయ విద్యా విధానానికి (ఎన్ఇపి) సిఫార్సు చేయబడింది. పరీక్షలు మొదటి దశలో ఫిబ్రవరిలో, రెండవ దశలో మేలో నిర్వహిస్తారు. రెండు దశల ఫలితాలు వరుసగా ఏప్రిల్, జూన్‌లలో ప్రకటిస్తామని సిబిఎస్ఇ పరీక్షల కంట్రోలర్ సంయమ్ భరద్వాజ్ అన్నారు. విద్యార్థులు మొదటి దశకు హాజరు కావడం తప్పనిసరి, రెండవ దశ ఐచ్ఛికమని, సైన్స్, గణితం, సాంఘిక శాస్త్రం భాషలలోని ఏవైనా మూడు సబ్జెక్టులలో విద్యార్థులు తమ పనితీరును మెరుగుపరచుకోవడానికి అనుమతించబడతారని ఆయన చెప్పారు. ఆమోదించబడిన నిబంధనల ప్రకారం, శీతాకాల పాఠశాలల నుండి 10వ తరగతి విద్యార్థులు ఏ దశలలోనైనా బోర్డు పరీక్షలకు హాజరు కావడానికి అవకాశం ఉంటుంది. అంతర్గత మూల్యాంకనం విద్యా సెషన్‌లో ఒకసారి మాత్రమే నిర్వహించబడుతుంది. సిబిఎస్ఇ ఫిబ్రవరిలో ముసాయిదా నిబంధనలను ప్రకటించింది. వీటిని వాటాదారుల అభిప్రాయం కోసం పబ్లిక్ డొమైన్‌లో ఉంచారు. బోర్డ్ పరీక్షల యొక్క 'అధికస్టేక్స్' అంశాన్ని తొలగించడానికి, అన్ని విద్యార్థులు ఏదైనా విద్యా సంవత్సరంలో రెండుసార్లు పరీక్షలు రాయడానికి అనుమతించబడాలని ఎన్ఇపి సిఫార్సు చేసింది.

**SRI SHIVANI COLLEGE OF PHARMACY**
D. No. 22-7-96/1, Near Doctor's Colony, Mulugu Road, Warangal, Telangana State-506007
(Affiliated to Kakatiya University, Warangal, Approved by PCI, New Delhi, Recognized By Govt. of T.S.)
**WANTED FACULTY**
Applications are invited for the following posts along with Bio-data, Xerox copies of certificates two passports size Photographs submit on or before 30.06.2025.
Principal/Professors/Associate Professors/Assistant Professors/Lectures.
in the Department of Pharmaceutics, Pharmaceutical Analysis, Pharmaceutical Chemistry, Pharmacology, Pharmacognosy.
Qualification, Experience & Salary: As per PCI norms.
Cont: Ph. 9866921912, 9440212200, 0870-2976777.
E-Mail: sscpwgl@gmail.com , Website: www.sscpwgl.com.
Sd/- ecretary and Correspondent

**LOST PASS BOOK**
I, PARMAYOLLA VIJENDAR REDDY, S/o. PARMAYOLLA MADHAVAREDDY, R/o. H.No. 1-16/1, Saireddyguda, H/O. Damerlapally Village, Shabad Mandal, Rangareddy Dist. Have lost my original Pattadar Pass Book No. T05220110508, Katha No. 867 while Travelling from my house by Motor Clycle. If found Contact: 9912855654



# జనరల్
STATE & REGIONAL NEWS

### ఉన్ని జాకెట్లు, రెయిన్ కోట్ల పంపిణీ

ప్రజాపక్షం/హైదరాబాద్: వర్షాకాలం ప్రారంభం కావడంతో విధి నిర్వహణలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు హోంగార్డులకు ఉన్ని జాకెట్లను, రైన్ కోట్లను హోంగార్డ్స్ అడిషనల్ డిజిపి స్వాతి లక్రా పంపిణీ చేశారు. డిజిపి కార్యాలయంలో బుధవారం నాడు జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ డీజీపీ మాట్లాడుతూ.... ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ రాష్ట్రంలో హోంగార్డులకు పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. వేతనం, పరేడ్ అలవెన్స్, ఎక్స్ గ్రేషియా పెంపు చేయడంతో పాటు హోంగార్డులకు ఐడి కార్డులను, హెల్త్ కార్డులను ఇచ్చేందుకు ప్రయత్నం జరుగుతుందని తెలియజేశారు. హోంగార్డులకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా ప్రస్తుత సీజన్లో విధి నిర్వహణ చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హోంగార్డులకు ఉన్ని జాకెట్లను, రైన్ కోట్లను పంపిణీ చేస్తున్నమన్నారు. హోంగార్డులు విధి నిర్వహణ చేయాలని తద్వారా మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.

### భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని
## ప్రణాళికలు రూపొందించుకోవాలి

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌లో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరా, డ్రైనేజ్, రోడ్లు, మెట్రో కనెక్టివిటీ, ఎలివేటెడ్ కారిడార్లకు సంబంధించి పూర్తి ప్రణాళికల రావాలన్నారు. రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్‌పై అధికారులతో సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కోర్ అర్బన్ రీజియన్‌కు సంబంధించి ప్రత్యేకంగా సమగ్ర పాలసీ తయారు చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. పెరుగుతున్న నగర జనాభా అవసరాలకు అనుగుణంగా రానున్న 25 సంవత్సరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కోర్ అర్బన్‌తో పాటు సెమీ అర్బన్, రూరల్ ఏరియాలపైనా ఒక స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్లేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ అభివృద్ధి పనుల్లో పురోగతిపై పూర్తి వివరాలను, ప్రస్తుతం జిహెచ్ఎంసి పరిధిలో కొనసాగుతున్న తాగునీటి సరఫరా, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ పనుల ప్రస్తుత పరిస్థితిని ముఖ్యమంత్రికి వివరించారు. అసంపూర్తిగా ఉన్న పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు.

**పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం తగదు :**
హైదరాబాద్ నగరంలో పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని, వర్షాకాలం నేపథ్యంలో డెంగ్యూ, చికున్ గున్యా లాంటి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను సిఎం ఆదేశించారు. హైదరాబాద్ నగరాభివృద్ధికి అభివృద్ధి పనులకు సంబంధించి పూర్తి వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఇందుకు సిఎం రేవంత్‌రెడిస్మాట్లాడుతూ రోడ్డుపై నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వానాకాలంలో డ్రైనేజ్ ఓవర్ ఫ్లో ఉండకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా చూడటంతో పాటు, దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్ష సమావేశంలో సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సిఎం సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ఎండిఎ పరిధిలోని ఎంఎయుడి కార్యదర్శి ఇలంబర్తి, జిల్లా హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఎఫ్‌సిడిఎ కమిషనర్ కె.శశాంక, వాటర్‌వర్క్స్ ఎండి అశోక్‌రెడ్డి, ఎంఆర్‌డిసిఎల్ ఎండి ఈ.వి.నర్సింహారెడ్డి, మెట్రో రైల్ ఎండి ఎన్‌విఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### తక్కువ సమయంలో పెద్ద మొత్తంలో రైతు భరోసా నిధులను జమచేసి
## దేశ చరిత్రలోనే రికార్డు సృష్టించాం

తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు

ఎన్నికల ముందు యాసంగి నిధులు విడుదలచేయని గత ప్రభుత్వం

ఛిద్రమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** "తెలంగాణ రాష్ట్రంలో మిగులు బడ్జెట్‌తో ప్రభుత్వాన్ని అప్పగిస్తే గత ప్రభుత్వ పెద్దలు ప్రకటించిన చెప్పిన రైతుబంధు నిధులను ఏనాడు సక్రమంగా పంపిణీ చేయలేదు. తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో మిగులు బడ్జెట్ ఉన్నప్పటికీ రైతుబంధు నిధుల మొత్తం తక్కువే అయినా పంపిణీకి ఒక్కో సీజన్‌లో 169 రోజులు సుమారు ఐదున్నర నెలలు పాటు సమయం తీసుకున్నారు. అదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి రూ.8 లక్షల కోట్ల లోటు బడ్జెట్. రైతు భరోసా కింద గత ప్రభుత్వంతో పోలిస్తే ఎకరాకు రూ.2వేలు అదనంగా కలిపి రూ.12 వేలు ఇవ్వాల్సిన పరిస్థితి. ఛిద్రమైన ఆర్థిక వ్యవస్థను స్వల్ప సమయంలోనే గాడిలో పెట్టి తక్కువ సమయంలోనే పెద్ద మొత్తంలో రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశాం.

కేవలం తొమ్మిది రోజుల్లో రూ.8,744.13 కోట్ల నిధులు రైతుల ఖాతాల్లో జమచేసి దేశ చరిత్రలోనే ఓ రికార్డు సృష్టించాం" అని డిప్యూటీ సిఎం, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రైతు భరోసాకు సంబంధించిన పూర్తి వివరాలతో డిప్యూటీ సిఎం కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గత ప్రభుత్వం ఎన్నికల ముందు రైతుల ఖాతాల్లో వేయాల్సిన రైతు భరోసా నిధులను వేయకుండా వెళ్ళిపోగా రైతుల పట్ల బాధ్యత, ప్రేమ కలిగిన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారు వదిలేసిన యాసంగి కాలానికి సంబంధించిన రూ.7,625 కోట్ల నిధులు రైతుల ఖాతాలలో జమ చేశామని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో పెట్టుబడి సాయంగా అందించిన నిధులు, సమయంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా నిధుల మొత్తం, తీసుకున్న సమయాన్ని పోలిస్తే రైతుల పట్ల ఎవరికి బాధ్యత, ప్రేమ ఉన్నాయో స్పష్టం అవుతుందన్నారు.

### రాజ్యాంగాన్ని కాపాడుకుందాం...
## మనుధర్మ సంస్కృతిని తరిమికొడదాం

ఆదివాసీ బంజారాల దేవతారాధన, సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకుందాం

రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క



**ప్రజాపక్షం /సూర్యాపేట :** భారత రాజ్యాంగాన్ని కాపాడుకొని మనుధర్మ సంస్కృతిని తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రెడ్డి హాస్టల్ లో ఏఐసిసి ఆదేశాలతో మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి సహకారంతో ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ అధ్యక్షతన జరుగుతున్న కాంగ్రెస్ ఆదివాసి బునియాది కార్యకర్తల సమ్మేళనంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఆర్ఎస్ఎస్, బిజెపిల మనుధర్మ సంస్కృతిని ఆదివాసి బంజారలపై రుద్దుతూ ప్రతి తండాలో, ప్రతి గూడాల్లో మనుసంస్కృతిని వ్యాప్తి చేస్తూ వారి సంస్కృతి, సాంప్రదాయాలు కనుమరుగుయ్యే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. గిరిజన, ఆదివాసిల దేవతలను, ఆచారాలను మరవద్దని కోరారు. భారత రాజ్యాంగం ఆదివాసి గిరిజనులకు ఎన్నో హక్కులను కల్పించిందని, వాటి నేడు ఒక్కొక్కటిగా బిజెపి, ఆర్ఎస్ఎస్ అమలు చేయకుండా అడ్డుకట్ట వేస్తుందన్నారు. భారత రాజ్యాంగం, హక్కులను ఆదివాసులు ఐక్యంగా ఉండి కాపాడుకోవాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బ్రాహ్మణిజాన్ని పెంచిపోషించి వారి భావాజాలనను ఆదివాసులపై రుద్దుతుందని చెప్పారు. ఏ దేవున్ని పూజించాలో కూడా బిజెపి, ఆర్ఎస్ఎస్ చెప్పడం సరైంది కాదన్నారు. అంతే కాకుండా దేశ వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆదివారిసి గిరిజనులకు నాడు జవహర్ లాల్ నెహ్రు నుండి మొదలుకొని నేటి రాహుల్ గాంధీ వరకు అన్ని రంగాల్లో పెద్దపీట వేశారని గుర్తు చేశారు. నాడు, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసి బంజారల అభివృద్ధి కోసం ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ రాహుల్ బాల్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్ టి సెల్ రాష్ట్ర కోఆర్డీనేటర్ కోట్య నాయక్ భూక్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ధరావత్ వీరన్న నాయక్, ప్రోగ్రాం ఇన్ చార్జ్ లింగం నాయక్, బంజార నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### మహిళా ఉద్యోగులను వేధిస్తే..
## కఠిన చర్యలు

వేధింపుల ఫిర్యాదుపై శాఖాపరమైన కమిటీ ఏర్పాటు

త్వరలో నివేదిక ఇవ్వాలని మంత్రి సీతక్క ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలోని ఒక అధికారి తమను వేధిస్తున్నారని కొంతమంది మహిళా ఉద్యోగులు చేసిన ఫిర్యాదుపైన మంత్రి ధనసరి అనసూయ సీతక్క శాఖపరమైన విచారణకు ఆదేశించారు. దీంతో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ నివేదిక అందిన వెంటనే సదరు అధికారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. వీలైనంత త్వరగా విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలన్నారు. తమది మహిళా పక్షపాత ప్రభుత్వమని, మహిళా సాధికారత కోసం వారి గౌరవాన్ని పెంచే విధంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని ఈ సందర్భంగా మంత్రి సీతక్క తెలిపారు. మహిళా ఉద్యోగులను వేధింపులకు గురి చేసినా, చిన్న చూపు చూసినా సహించేది లేదని, అలాంటి వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క హెచ్చరించారు.



## నాటి ఎమర్జెన్సీ చీకటి చరిత్రను గుర్తుచేయాల్సిన అవసరం ఉన్నది

గంగాపురం వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజాస్వామ్యాన్ని అణిచివేసిన ఎమర్జెన్సీ చీకటి అధ్యాయాన్ని, ఆ చరిత్రను గుర్తుచేయాల్సిన అవసరం ఉన్నదని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి గంగాపురం వెంకట్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిజెపి నాయకుడు ఎన్.వి సుభాష్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ 1975 జూన్‌లో ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ప్రకటించిన సమయానికి తాను ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాని, ఆ రోజు ఎంత భయంకరమైనదో మాటల్లో చెప్పలేనిదని గుర్తు చేశారు. దేశంలో పౌరహక్కులన్ని నిలిపివేశారని, దేశంలో వేలాదిమంది ప్రజాస్వామ్యవాదులను అకారణంగా అరెస్టు చేశారని, అప్పట్లోనే ఆ వ్యవస్థ ఎంత దుర్మార్గంగా ఉందో గ్రహించానని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి రాజ్యాంగ పుస్తకం పట్టుకుని మాట్లాడుతున్నారని, కానీ ఆ పుస్తకాల పేజీల్లో ఏం ఉంది ఆయనకే తెలియదేమో అన్న అనుమానం కలుగుతోందని వెంకట్ రెడ్డి చెప్పారు.

## రైతుల అభివృద్ధికి బ్యాంకులు దోహదపడాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** రైతుల అభివృద్ధికి బ్యాంకులు తమ వంతు సహకారం అందించి దోహదపడాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం సత్తుపల్లి నియోజకవర్గం, వేంసూరు మండలం అడసర్లపాడు, కందుకూరు గ్రామాల్లో పర్యటించి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ నూతన బ్రాంచిలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి బ్యాంకులు సంపూర్ణ సహకారం అందించాలన్నారు. పంట రుణాలతో పాటు వ్యవసాయ రంగ అభివృద్ధికి దోహదపడే విధంగా వ్యవసాయ టర్మ్ రుణాలు, వ్యవసాయ సంబంధిత రంగాల అభివృద్ధికి రుణాలను నిర్దేశించుకున్న లక్ష్యాల ప్రకారం పంపిణీ చేయాలని మంత్రి సూచించారు.గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటుచేసిన సహకార బ్యాంక్ బ్రాంచీలు స్థానిక రైతాంగానికి మేలు చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేసే రైతు భరోసా, ధాన్యం కొనుగోలు, బోనస్, పంట నష్ట పరిహారం వంటి వివిధ కార్యక్రమాలను సకాలంలో అందజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, సీనియర్ నాయకులు చలగుళ్ళ నర్సింహారావు, వినుకొండ కృష్ణ, ద్రోణవల్లి గోపి, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, డిసిసిబి డిజిఎం వేణుగోపాల్ రావు, సర్వేశ్వర్ రావు, ఏజిఎం చందు రావు, మేనేజర్లు నాగలక్ష్మి, రజిత, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

### పర్యాటకరంగం అభివృద్ధికి
## రాష్ట్రంలో పుష్కలమైన అవకాశాలు

పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** స్పెషల్‌సిఎస్ జయేష్‌రంజన్, పర్యాటక అభివృద్ధిసంస్థ మేనేజింగ్‌డైరెక్టర్ క్రాంతివల్లూరు, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి సోమశిల, అమరగిరిద్వీపం, ఇతర పర్యాటకప్రాంతాలను పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్‌శాఖమంత్రి జూపల్లికృష్ణారావు సందర్శించారు. రాష్ట్రంలో పర్యాటకరంగ అభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, టూరిజం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తూ ఈరంగంద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేదిశగా ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్‌రిట్రిట్ నల్లమల ప్రాజెక్టు అభివృద్ధిలో భాగంగా సోమశిల, అమరగిరి, కల్వకుర్తిలిఫ్టు ఇరిగేషన్, నార్లాపూర్‌రిజర్వాయర్ కొల్లాపూర్‌లోని మాధవస్వామి ఆలయం, జటప్రోలు మదనగోపాలస్వామి దేవాలయాన్ని సందర్శించారు. పర్యాటకరంగాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్గదర్శకత్వంలో ముందుకు తీసుకువెళతామని , ముఖ్యమైన పర్యాటకప్రాంతాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామన్నారు. దేశ, విదేశి పర్యాటకులను ఆకర్షించడానికి కృషిచేస్తున్నామన్నారు. సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్‌మెంట్ పథకంకింద రూ.68.10కోట్లు మంజూరయ్యాయని అన్నారు. ఆనిధులతో పర్యావరణం, జలవనరులు, ఆలయాలు, వాటర్‌స్పోర్ట్స్, అడ్వెంచర్‌గేమ్స్‌కు పుష్కలమైన వనరులు ఉన్న సోమశిల, అమరగిరిద్వీపం , మల్లేశ్వరం, ఈగలపెంటను అభివృద్ధికిప్రత్యేక చర్యలు చేపట్టామని వివరించారు. సోమశిలలో బోటింగ్‌జెట్టి, అమరగిరిద్వీపంలో బోటింగ్‌జెట్టి, కాటేజిలు, స్విమ్మింగ్ పూల్, కెఫ్టిరియా, స్పా, వెల్‌నెస్‌సెంటర్, ఇండోర్ అవుట్‌డోర్‌గేమ్స్, ఇతర సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## పత్రికా రంగానికి ప్రభుత్వ అండ

పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కషి

ఎపి మంత్రులు నిమ్మల, డోలా, గొట్టిపాటి హామీ

ఘనంగా ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర మహాసభ



**ఒంగోలు :** పత్రికారంగానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూల ధృక్పథంతో ఉన్నారని పలువురు రాష్ట్ర మంత్రులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఎపియుడబ్ల్యుజె) 36వ రాష్ట్ర మహాసభ బుధవారం ఒంగోలు దక్షిణ బైపాస్‌లోని విష్ణుప్రియ కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షుడు ఐవి.సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ముందుగా వారు యూనియన్ నాయకులు, శాసనసభ్యులతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ సమాజంలో పాత్రికేయుల పాత్ర ఎంతో ముఖ్యమైందని...వారి సంక్షేమం కోసం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అన్ని విధాల కృషిచేస్తుందని చెప్పారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సామాజిక మాధ్యమాలు కూడా ఎన్నో వచ్చాయని... దీనివల్ల ఏ వార్త అయినా వెంటనే ప్రజల వద్దకు చేరుతుందన్నారు. మంత్రి నిమ్మల రామానాయడు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి పాత్రికేయులు పట్టుకొమ్మల్లాంటివారని అందుకే పత్రికారంగాన్ని ఫోర్త్ ఎస్టేట్‌గా పిలుస్తారన్నారు. అటువంటి పత్రికారంగం మనుగడ సాగించటానికి తమ ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలందిస్తుందన్నారు. ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబానికి పత్రికారంగంతో ఎంతో అనుబంధం ఉందని పాత్రికేయులకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందజేయటానికి తాను సిద్ధంగా ఉంటానని అన్నారు. ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్ధన రావు మాట్లాడుతూ ఒంగోలులో జర్నలిస్ట్ కాలనీ నిర్మాణానికి తనవంతు సహకారం అందజేస్తానన్నారు.

**వేతన సవరణచట్టంపై ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలి : శ్రీనివాస్‌రెడ్డి**
ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పాత్రికేయుల వేతన సవరణ చట్టం కార్యరూపం దాల్చలేదని, వేతన సవరణ జరిగి సుమారు 15 సంవత్సరాలు అవుతుందని, దీనిపై ప్రజాప్రతినిధులు దృష్టిపెట్టాలని కోరారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అయిందని.. రాబోయే సంవత్సర కాలంలోనైనా పాత్రికేయుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాలని కోరారు. మంత్రుల కమిటీ సిఫారసుల మేరకు పాత్రికేయుల అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం జీవో రూపొందినప్పటికీ అది ఇంతవరకు కేబినెట్ ఆమోదానికి నోచుకోలేదని, వచ్చే కేబినెట్ సమావేశంలో ఆ జీవోను ఆమోదించేవిధంగా కృషిచేయాలని సభాధ్యక్షులు, ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షుడు ఐవి.సుబ్బారావు కోరారు. కార్యక్రమంలో ఐజెయు జనరల్ సెక్రటరీ బల్వీందర్ సింగ్ జమ్ము, స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్ఎన్.సిన్హా, జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, ఎపియుడబ్ల్యుజె ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.సురేష్, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్వీ రమణ, దాసరి కనకయ్య పాల్గొన్నారు.



## పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభుత్వాలు

మోదీ స్టీరింగ్ కార్పొరేట్ల చేతుల్లో : వక్తలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభుత్వాలు పాలన కొనసాగిస్తాయని, ప్రస్తుత మోదీ స్టీరింగ్ కార్పొరేట్ల చేతుల్లో ఉన్నదని వక్తలు విమర్శించారు.'నాడు ప్రకటిత ఎమర్జన్సీనేడు అప్రకటిత ఎమర్జన్సీమనకర్తవ్యాలు' అనే అంశంపై సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అధ్యక్షతన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌టిఐ మాజీ ప్రధాన కమిషనర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ రాజ్యాంగం, అందులోని సూత్రాలను విస్మరించి నాడు ఎమర్జన్సీని ప్రకటించారన్నారు.ఇలాంటి తప్పుడు నిర్ణయాలతో ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రజలు సరైన తీర్పునిచ్చారని వివరించారు. సుప్రీంకోర్టు, సిజెఐ, పార్లమెంట్, పిఎం అందరికంటే గొప్పది రాజ్యాంగమేనని, దీనిని ఎవరైనా బుల్‌డోజ్ చేస్తే ప్రజలే ఆ రాజ్యాంగాన్ని రక్షించుకుంటారని నాటి ఘటనలు చెబుతున్నాయని మాడభూషి శ్రీధర్ అన్నారు. సిపిఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ అప్పుడైనా.. ఇప్పుడైనా ప్రభుత్వాన్ని నడుపుతున్నది ప్రధానులు కాదని, వీరు కేవలం డ్రైవర్లు మాత్రమేనని, అసలైన డైరెక్టర్లు కార్పొరేట్లని అన్నారు. 1960లో కాంగ్రెస్ పార్టీ గుత్తాధిపత్యానికి పెద్ద దెబ్బ తగిలిందని, దీంతో అనేక రాష్ట్రాల్లో ప్రతిపక్షాల కూటములు విజయాలు సాధించాయన్నారు. సిపిఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు టి. జ్యోతి మాట్లాడుతూ ఎమర్జెన్సీకాలంలో ఎన్నో దారుణాలు జరిగాయన్నారు. రాజకీయ ప్రత్యర్థులను జైలులో పెట్టటం, పత్రికలపై సెన్సార్ విధించటం, పాత్రికేయులు, కార్యకర్తలను కూడా జైలులో పెట్టరని చెప్పారు.

## ప్రాజెక్ట్‌లపై అప్పడే కెసిఆర్ వివరించారు

మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రాజెక్టులు,కేంద్రం పని తీరుపైన ఇదివరకే శాసనసభలో కెసిఆర్ (సిఎంగా ఉన్న సమయంలో) సమూలంగా వివరించారని,ఆ సమయంలో 'మీ' పార్టీ (కాంగ్రెస్) సభ నుండి పారిపోయిందని, ఇప్పుడు ప్రాజెక్ట్‌ల విషయంలో శాసనసభలో కెటిఆర్, హరీష్ రావు లేదా గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్ రెడ్డి సమాధానం ఇస్తారని, వారు చెప్పే అంశాలకు ప్రజలు కన్విన్స్ అవుతారో లేదో చూద్దామని బిఆర్ఎస్ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు.హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్‌తో కలిసి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరంలోని మేడిగడ్డలో కేవలం రెండు పిల్లర్లు కృంగితే వాటిని బాగు చేయకుండా కాళేశ్వరం కూలేశ్వరం అని సిఎం అంటారా ? అని మండిపడ్డారు. వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ వరదలనైనా తట్టుకోవచ్చని,కానీ రేవంత్ రెడ్డి నోటి నుండి వచ్చే అబద్దాలను,బురదను మాత్రం భరించడం కష్టమన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి సీటులో ఉండి మూర్ఖంగా మతి భ్రమించినట్టుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఏం సాధించారని రైతు సంబరాలు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. గంగుల కమలాకర్ మాట్లాడుతూ .కాళేశ్వరంతో సస్యశ్యామలమైన తెలంగాణలోని పలు ప్రాంతాలు ఇప్పుడు ఎడారిగా మారుతున్నాయని ఆరోపించారు. కరీంనగర్ పట్టణానికి నాలుగు రోజులకు ఒకసారి నీళ్లు ఇస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి కెసిఆర్ స్థాయి రావాలంటే పదేళ్ల పాటు సిఎం చేసి ఉండాలని, కెసిఆర్‌కు రేవంత్ సమ ఉజ్జి కారని అన్నారు.

## సిసి రోడ్డు పనులు పరిశీలించిన మాజీ చైర్‌పర్సన్



**ప్రజాపక్షం/ ఘట్‌కేసర్ :** కొండపూర్ గ్రామంలోని 8వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, స్థానిక మాజీ కౌన్సిలర్ హేమలత గోపాల్ రెడ్డిలతో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ముల్లి పావనిజంగయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రతి వార్డులో అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లేందుకు నావంతు కృషి చేస్తానని సంబంధిత కాంట్రాక్టర్‌కి రోడ్డు నిర్మాణ పనుల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా నాణ్యమైన సిమెంట్‌ను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి గోపాల్ రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటి డైరెక్టర్ మచ్చేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నాగరాజ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థికి కాంస్య పతకం



**ప్రజాపక్షం/కొడంగల్:** ప్రయాగ్‌రాజ్‌లో ఇటీవల నిర్వహించిన 23వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో షాట్‌షాట్ విసిరే పోటీల్లో ప్రతిభ కనబర్చిన కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి సాయి కిరణ్ కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల సిబ్బంది విద్యార్థినిని సన్మానించి అభినందించారు. తమ కళాశాల నుంచి జాతీయ స్థాయిలో కాంస్య పతకం సాధించడం హర్షణీయమన్నారు. క్రీడలు యువతకు శారీరక, మానసిక వికాసానికే గాక సామాజిక గుర్తింపుకు దోహదం చేస్తాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రఫి యాఖానం, రాంరాబులతో పాటు అధ్యాపక బృందం తదితరులున్నారు.



## అంటు రోగాలపై ముందస్తు అప్రమత్తత

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** పరిసరాలు పరిశుభ్రంగా ఉంచగలిగితేనే రానున్న వర్షాకాలంలో అంటు రోగాలు సోకకుండా కాపాడుకోవచ్చని గౌతంనగర్ కార్పొరేటర్ మేకల సునీత సూచించారు. వర్షాకాలం ముందస్తు చర్యల్లో భాగంగా డివిజన్‌లోని శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని బుధవారం భవానీనగర్, వాణినగర్, తదితర ప్రాంతాల్లో చేపట్టారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య విభాగ సూపర్‌వైజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ వ్యాపారస్తులతో పాటు ఇళ్లల్లో నివసించే వారందరూ చెత్తా చెదారాలను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా కేవలం ఉదయాన్నే తమ వద్దకే వచ్చే స్వచ్ఛ ఆటోల్లో మాత్రమే వేయాలని, ఇళ్లల్లో ఎక్కడా నీరు నిలువ లేకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేస్తే జరిమానాలు విధిస్తారన్నారు.



## సమస్యలు పరిష్కరించేందుకు కృషి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** తన దృష్టికి వచ్చిన కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఇందిరా గృహకల్ప, విద్యా మారుతీ నగర్‌లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు ఆతీతంగా చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఐజికె కాలనీ నూతనంగా ఎన్నికైన కమిటీని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.




## శిశు మందిర్‌లో గ్రంథాలయం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో నూతన నందనంపాటి లైబ్రరీని ప్రారంభించారు. ఈ గ్రంథాలయాన్ని సోలీస్ కంటి ఆసుపత్రి అధినేత నందనంపాటి చిన్న వీరాంజనేయులు, సీతారామాంజనేయులు, హనుమాన్, కుషాయిగూడ అసోసియేషన్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డిలు ప్రారంభించారు. గ్రంథాలయాన్ని గ్రామ ప్రజలకు,విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేశామని వారు తెలిపారు. గ్రంథాలయాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సోమశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చక్రపాణిగౌడ్, సమితి అధ్యక్షులు డాక్టర్ నాగమోహన్, మల్లిఖార్జున్ రెడ్డి, సత్యనారాయణ, గురునాథ్‌రెడ్డి, వినోద్‌కుమార్, ప్రధానాచార్యులు రాధిక, ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్తుకు గురువారం అంతరాయం ఏర్పడుతుందని ఎఇ బాబు రావు తెలిపారు. చర్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి జెఎన్ఎన్‌యుఆర్ఎం ఫీడర్‌ను ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిలిపి వేయడంతో ఇసి నగర్, న్యూమింట్ నగర్, మహలక్ష్మి నగర్ కాలనీలలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



## పాఠశాల తనిఖీ చేసిన విద్యాశాఖాధికారి

**ప్రజాపక్షం/కోట్‌పల్లి:** వికారాబాద్ నియోజకవర్గంలోని కోట్‌పల్లి మండల పరిధిలోని ఎన్నారం ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి రేణుకాదేవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల విద్యా బోధన పరిశీలించారు. పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విద్యాబోధన, విద్యార్థుల సంఖ్య మెరుగుపరచాలని , విద్యా బోధన ఆర్టిఫిషియల్ ద్వారా బోధించినట్లయితే విద్యార్థులు ఆకర్షితులై పాఠశాలకు వస్తారని, మధ్యాహ్న భోజనం వివరాలు పదవ తరగతి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి చంద్రప్ప, ప్రధానోపాధ్యాయురాలు శారద,శేఖర్ హర్షబేగం, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజెఆర్ నగర్‌లో పర్యటించిన కార్పొరేటర్

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని రకాలుగా కృషి చేసానని, మరే ఇతర సమస్యలనైనా తన దృష్టికి తీసుకొని రావాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ కార్పొరేటర్ వై. ప్రేమ్‌కుమార్ కోరారు. బుధవారం ఆయన బిజెఆర్ నగర్ ప్రాంతంలో పర్యటిస్తూ అక్కడి అంగన్‌వాడి స్కూల్‌ను పరిశీలించారు. అంగన్‌వాడి కేంద్రంలో విద్యార్థులకు అవసరమయ్యే మరుగుదొడ్లు లేక పోవటం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని అంగన్‌వాడి టీచర్ పద్మజ కార్పొరేటర్ దృష్టికి తీసుకొని వెళ్లారు. జిహెచ్ఎంసి మల్కాజిగిరి సర్కిల్ ఇఇ లక్ష్మణ్, డిఇ లౌక్యతో ఈ విషయమై పరిశీలించి త్వరలో ఏర్పాటు చేస్తానని కార్పొరేటర్ తెలిపారు. బస్తీ దవాఖానా వైద్యాధికారి డా కిషన్, సిబ్బంది స్వప్న, జ్యోతి, భావిక, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# తెలంగాణ వ్యాప్తంగా డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంతర్జాతీయ మాదక ద్రవ్యా ల దుర్వినియోగం మరియు అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం తెలంగాణ వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాల్ని జరుపుకున్నారు. నెక్లెస్ రోడ్డు జల వీహార్ ముందు నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవంలో తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరి కిరణ్ పాల్గొన్నారు. ఎక్సైజ్ శాఖ పోలీసులు, అధికారులు సీనియర్ సిటిషన్లు, విద్యార్థులు, యువత, పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి అన్ని జిల్లా కేంద్రాల్లో డ్రగ్స్‌ను వినియోగించ వద్దని ప్లా కార్డులతోను, బ్యానర్లతో ర్యాలీలు నిర్వహించారు. సభలు, సమావే శాలు నిర్వహించి డ్రగ్స్‌ను వాడకం, అమ్మకం, రవాణ ఎన్‌పిడిఎస్ యాక్ట్ కింద నేరంగా పరిగణించబడుతుందని ప్రజలకు సమాచారం అందించారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలు, జీవితాలు ఎలా ఉంటాయనే విషయాలపై ఎక్సైజ్ పోలీసులు యువతకు అవగహన కలిపించారు. నిజామాబాద్, వరంగల్ అర్బన్, కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్, సిద్దిపేట ,జనగామ, సిరిసిల్ల, నిర్మల్‌తో పాటు ఇతర జిల్లాల డిప్యూటి కమిషనర్లు, ఎక్సైజ్ సూపరిండెంట్లు పోలీసులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహించారు. డ్రగ్స్‌పై ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించి డ్రగ్స్‌పై అవగహన కల్పిన ఎక్సైజ్ అధికారులకు, సిబ్బందికి అబ్కారీ శాఖ కమిషనర్ సి.హరి కిరణ్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం డ్రగ్స్ నిషేధిత దినోత్సవాన్ని తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించినందుకు అభినందించారు.

## 24,978 మంది ఖాతాల్లో రూ.23.49కోట్లు రైతు భరోసా జమ

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** రైతు భరోసా పథకం ద్వారా అన్నదాతకు అండగా ఉండే లక్ష్యంగా ప్రభుత్వం ఆర్థికంగా చేయూతను అందిస్తోందని జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు.



ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద జిల్లాలో 24978 మందికి రైతుల ఖాతాల్లో రూ. 23. 49 కోట్లు జమ చేయటం జరిగిందని, విడతల వారీగా వారికి నేరుగా బ్యాంకు ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తుంటామన్నారు. వ్యవసాయానికి పెట్టుబడి భారాన్ని తగ్గించి వ్యవసాయోత్పత్తులు పెంపొందించుకొనేందుకు ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వర్షాకాలం సాగు ప్రారంభానికి ముందే రైతు భరోసా నిధులు అందచేయటం పట్ల జిల్లా వ్యవసాయదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు.

## పేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చే దిశగా కృషి

### కలెక్టర్ ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** పేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఎంపిడిఒ లు, అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ని పనులు మొదలు పెట్టినారు అని అడిగినారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన మొదటి విడత, రెండవ విడతలో మంజురైన ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాల పనులను అధికారులు జగ్రత్తగా పరిశీలించి మొదటి విడత, రెండవ విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు 75 శాతం పూర్తి అయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అయన తెలిపారు. రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల విషయంలో ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందిన వాటిని 75 శాతం గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని తెలిపారు. ఇంటి నిర్మాణం 600 చదరపు గజాలలోపు ఉండాలని విషయాన్ని అబ్దిదారులకు సూచిస్తు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్ అందుబాటులో ఉండాలి అని ఎంపిడిఒలు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మిగిలిపోయిన మరమత్తు పనులను త్వరలో పూర్తి అయ్యేలా ఎంపిడిఒలు ప్రత్యేశ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వనమహోత్సవ కార్యక్రమం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాకు ఉన్న లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం ఎన్ఆర్‌జిఎస్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డిఆర్‌డిఓ శ్రీనివాస్ డిపిఓ జయసుద డిఎంఎచ్ఓ వెంకటరామణ అధికారులు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయురాలను సస్పెండ్ చేసిన కలెక్టర్ ప్రతీక్ జైన్ :** వికారాబాద్ జిల్లాలోని తాండూర్ నియోజకవర్గంలోని యలాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగర్ల్స్ పాఠశాలలో పదవతరగతి విద్యర్థులకు బయాలజీ బోధించే ఉపాధ్యాయురాలు ఆవు మెదడును చూపిస్తూ పాఠ్యాంశాన్ని భోదించరు. ఇట్టి సంఘటనపై అందిన ఫిర్యాదును స్థానిక మండల విద్యాధికారి రమేష్ పాఠశాలను సందర్శించి విద్యార్థులను, పాఠశాల ప్రధానోపాధ్యాయులను విచారణ చేసి ప్రాథమిక విచారణ నివేదికను జిల్లా కార్యాలయానికి అందించడం జరిగింది. ఇట్టి నివేదిక ఆధారంగా చేసుకొని కాసింబి స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విధుల నుండి జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం సస్పెండ్ చేయడం జరిగింది అని విద్యాధికారి రేణుకాదేవి ఒక ప్రకటనలో తెలిపారు.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా భాస్కర్ మదరాజు




**ప్రజాపక్షం/కాప్రా :** వరల్ట్ చారిటీ అవార్డ్స్ సిరొమొనిలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా రెండేళ్ల క్రితమే ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా నియమితుడైన భాస్కర్ మదరాజుకు బుధవారం ఏఎస్ రావునగర్ కమ్యూనిటీ హాలులో ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందచేసారు. గత 15 ఏళ్లుగా కాల్ పబ్లిక్ స్కూల్, లిటిల్ ఫ్లవర్ జూనియర్ కళాశాల, వసుంధర జూనియర్ కళాశాలల్లో గణితంలో ఉపాధ్యాయ వృత్తిలో తనదైన ప్రత్యేక కథా, కథనం, విజువల్ ట్రిక్స్, పిపిటి, యానిమేషన్,మెమొరి టెక్నిక్‌ల ద్వారా బోధనా తీరుకు గాను ఆయనకు అవార్డు లభించింది.



## కొనసాగుతున్న సర్వేయర్ శిక్షణా తరగతులు

### అభ్యర్థులకు వివరిస్తున్న ఎడి రాంరెడ్డి

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** సర్వే ట్రైనింగ్ అకాడమి ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో కొనసాగుతున్నాయి. లైసెన్స్ సర్వేయర్ శిక్షణా తరగతులు వికారాబాద్‌లో కొనసాగుతున్నాయి. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టేంపల్లిలోని డిపిఆర్‌సి భవనంలో ఈ శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. వికారాబాద్ జిల్లాలో సర్వేయర్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసుకున్న అభ్యర్థులను ఎంపిక చేసి బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇస్తున్నారు. సర్వేయర్ కోసం శిక్షణ తరగతులు జిల్లా సర్వే ల్యాండ్ రికార్డు అధికారి రాంరెడ్డి ఆధ్వర్యంలో మొదటి విడుతగా 150కి గాను 139మందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుంది అని ఆయన అన్నారు. మొదటి బ్యాచ్‌కి ఇప్పటివరకు 27రోజులు పూర్తి చేయడం జరిగిందని, మొత్తం 50 పనిదినాల్లో వీరికి శిక్షణ ఇవ్వడం జరుగుతుంది అని అన్నారు. ప్రతి వారం ఒక మండల సర్వేయర్ వచ్చి శిక్షణ పొందుతున్న వారికి సర్వేయర్ క్షేత్రస్థాయిలో భూములు ఎలా మ్యాప్ గీయాలి, భూమి కొలతలు ఎలా గీయాలనే విషయాలు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందులో ముఖ్యంగా ప్లాటింగ్ ఎట్లా గీయాలని అనే విషయాలను పూర్తిగా వివరించడం జరుగుతుంది అని అన్నారు. నిత్యం సర్వేకు సంబంధించిన థియరీ తరగతులు చెప్పడంతో పాటు క్షేత్రస్థాయిలో విషయాలను అవగాహన కల్పించడం జరుగుతుంది అని అన్నారు. ఈ శిక్షణ తరగతులు 20రోజుల పనిదినాల్లో ముగియనుందని, శిక్షణకు వచ్చిన అభ్యర్థులకు సర్వే విభాగంలో పూర్తిగా తర్ఫీదు ఇస్తున్నామని అన్నారు. అభ్యర్థులు దినిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్వేయర్‌ల శిక్షణ పూర్తి అయి అభ్యర్థులను అభ్యుత్వ ఆదేశాల ప్రకారం కలెక్టర్ సూచనలను పటిస్తు ముందుకు వెల్తామని ఎడి రాంరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ గౌష్, శిక్షణ పొందుతున్న అభ్యర్థులు పాల్గొన్నారు.



## క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు పోటీలు


**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల ఎంపిక ప్రక్రియలో భాగంగా మేడ్చల్ జిల్లా మండల స్థాయి లో ఎంపికైన 55 మంది బాల బాలికలకు బుధవారం జిల్లా స్థాయిలో వివిధ పోటీలు జరిగాయని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి తెలిపారు. ఎత్తు, బరువు, ఫ్లయింగ్ స్టార్టర్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, ఫ్లెక్సబిలిటి టెస్ట్, మెడికల్ టెస్ట్, పరుగు, షటిల్ పోటీల్లో జిల్లా స్థాయి లో ఎంపికైన బాలబాలికలకు జూలై 3,4 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల ద్వారా తుది ఎంపిక జరుగుతుందన్నారు.

## స్కూటీని ఢీకొని దూసుకెళ్లిన లారీ

### చిన్నారి మృతి.. అపస్మారక స్థితిలో తల్లిదండ్రులు



**ప్రజాపక్షం/కొడంగల్:** కూతురు,భార్యతో స్కూటీపై వెళ్తుండగా ఎదురుగా వేగంగా వస్తు న్న లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందగా చిన్నారి తల్లిదండ్రులు తీవ్ర గాయాలతో ఆసుపత్రిపాలైయ్యారు. ఈ సంఘటన బుధవారం మధ్యాహ్నం దుద్యాల్ గేట్ సమీపంలోని రైస్ మిల్లు వద్ద చోటు చేసుకుంది. వివరాలు.. కోస్గి పట్టానికి చెందిన వెంకటేష్ తన భార్య అనిత, కూతురు చిన్నారి అక్షితతో కలిసి స్కూటీపై(టీఎస్07జేజి 7811) కోస్గి నుంచి కొడంగల్ పట్టణానికి బ్యాంకు పని నిమిత్తం వెళ్తున్నాడు. తాండూర్ నుంచి పాలమూర్‌కు సిమెంటు లోడ్‌తో వెళ్తున్న లారీ(ఏపి03 యూ 9362) దుద్యాల గేటు వద్ద అతివేగంతో వస్తు ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీ కొట్టడం జరిగింది. ఈ దుర్ఘటనలో స్కూటీపై ఉన్న వ్యక్తులు చెల్లాచెదురుగా పడిపోయారు. ఈ ప్రమాదంలో చిన్నారి అక్షితపై నుంచి లారీ దూసుకుపోగా చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రగాయాలతో పడిఉన్న వెంకటేష్, అతని భార్యా అనిత స్పృహ కోల్పోయి అపస్మారక స్థితిలో ఉండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితుల మామ శ్రీనివాస్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాదగిరి తెలిపారు.



## 1.5 కేజీల గంజాయి స్వాధీనం

### సిఐ సంతోష్‌కుమార్

**ప్రజాపక్షం/తాండూర్:** వికారాబాద్ జిల్లాలోని తాండూర్ పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఒక వ్యక్తిని నుండి పోలీసులు 1.5 కిలలో గంజాయి స్వీదినం చేసుకోవడం జరిగింది అని అన్నారు. జిల్లా టాస్క్ ఫోర్స్ ఎండి అన్వర్ పాషా తాండూర్ సిఐ సంతోష్ కుమార్ అందించిన సమాచారం మేరకు తాండూర్ చౌరస్తాలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో భాగంగా ఒక వ్యక్తి గోనె సంచి వేసుకొని నడుచుకుంటు అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీస్‌లు అప్రమత్తమై వెంటనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించారు. వ్యక్తి పేరు మొహమ్మద్ రఫీక్, తండ్రి షబీర్. వృత్తి బండ్ల వ్యాపారి, నివాసం సీతారాంపేట్, తాండూర్ అని వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు. గంజాయిని పట్టుకున్న పోలీసులను ఎస్‌పి అభినందించారు.

## 27న యువజన కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్ నిర్వహణ

**ప్రజాపక్షం/పరిగి:** తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివచరణ్ రెడ్డి ఆదేశాల మేరకు వికారాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం పరిగి పట్టణంలో యువజన కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు యుత్ కాంగ్రెస్ అధ్యక్షులు జగన్ తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్పీకర్ ప్రసాద్ కుమార్, డిసిసి అధ్యక్షులు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కొడంగల్ ఇన్‌చార్జీ తిరుపతి రెడ్డి, చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చారీజ భీమ్ భారత్ పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని యువజన కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రభుత్వ మైనారిటీ గురుకుల పాఠశాలల్లో ఖాళీల భర్తీ ప్రక్రియ షురూ

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** మేడ్చల్ జిల్లాలోని ప్రభుత్వ మైనారిటి గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో బోధనా, బోధనేతర సిబ్బంది ఖాళీలను ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియామక ప్రక్రియ ప్రారంభమైందని, ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటిస్ సంక్షేమ శాఖాధికారి పేర్కొన్నారు.

తెలుగు బాయ్స్, గర్ల్స్ పాఠశాలల్లో టిజిటి తెలుగు, గర్ల్స్ పాఠశాలలో పిజిటి ఇంగ్లీష్, బాయ్స్ పాఠశాలలో పిజిటి గణితం, తెలుగు బాయ్స్, గర్ల్స్ పాఠశాలల్లో పిజిటి బయో సైన్స్, గర్ల్స్ పాఠశాలలో పిజిటి జంతుశాస్త్రంలకు గాను ఒక్కొక్కటి చొప్పున, బాయ్స్ పాఠశాలలో డిప్యూటి వార్డెన్ ఒకటి, గర్ల్స్ పాఠశాలలో ఒక ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు నియామకాలు జరుగుతాయి, వీటికి గాను సంబంధిత సబ్జెక్టులలో పిజిలో 50 శాతం, బిఈడిలో 50 శాతం, టిఈటి అర్హతతో పాటు మూడేళ్ల బోధానానుభవం, డిప్యూ టి వార్డెన్‌కు డిగ్రీ,కంప్యూటర్, ఆఫీస్ సబార్డినేట్‌కు గాను పదో తరగతి అర్హత ఉండాలన్నారు. జూలై 2 సాయంత్రం 4 గంటలలోపు తమ ధరఖాస్తులను మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో సమర్పించాలని జిల్లా మైనారిటిస్ సంక్షేమ శాఖ అధికారి జి.శాంతమ్మ తెలిపారు.

## గ్రామ గ్రామాన ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం



**ప్రజాపక్షం/బంట్వారం :** ఎంఆర్‌పిఎస్‌తోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్ మాదిగ బుధవారం విలేకర్ల సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 యేళ్ల మంద క్రిష్ణ మాదిగ చేసిన సుదీర్ఘ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకోని మండల పరిధిలో ఉన్న బోపునారం, తోర్‌మామిడి, బస్వాపూర్, యాచారం, సుల్తాన్‌పూర్, నూర్‌ల్లాపూర్,మంగ్రాస్ పల్లి, రోంపల్లి, నాగ్వారం, సల్‌బత్తాపూర్, మాద్వాపూర్, గ్రామాల్లో ఎంఆర్‌పిఎస్ జెండా పండగను ఘనంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బంట్వారం మండల ఇంచార్జీ భరత్ కూమార్ మాదిగ, నాయకులు ఎక్కెల్లి అనంతయ్య, దినేష్, రమేష్, తదితరులు ఉన్నారు.

## సాయిచంద్ మౌర్య పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/బొంరాస్‌పేట్ :** తెలంగాణ ఉద్యమ కళాకారుడు స్వర్గీయ మాజీ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ మౌర్య విగ్రహావిష్కరణకు సంబంధించిన పోస్టర్‌ను కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎరన్ పల్లి శ్రీనివాస్ అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29న ఆదివారం స్వగ్రామంలోని అమరచింతల విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుంది కావున కొడంగల్ నియోజకవర్గంలో ఉన్న సాయి చందు అభిమానులు, తెలంగాణ ఉద్యమాకారులు, బిఆర్ఎస్ పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, పెద్దత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సయ్యద్‌పల్లి రాములు, విష్ణువర్ధన్‌రెడ్డి, చాంద్‌పాషా, యాదగిరి, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## హస్తినాపురం జెడ్‌పి రోడ్డులో బ్యాంకు ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** హస్తినాపురం డివిజన్‌లోని జడ్‌పిరోడ్డులో నూత న బ్యాంకు ఏర్పాటు చేయాలని సికింద్రాబాద్‌లో స్టేట్ బ్యాంక్ ఇండియా (ఎస్‌బిఐ) హెడ్ ఆఫీసుల్లో రీజినల్ ఆఫీసర్ కె. పద్మజ రాణిని కలిసి బుధవారం బిజెపి పార్టీ డివిజన్ అధ్యక్షులు ఎరుకల మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ జడ్‌పి రోడ్డులో నివాసం ఉంటున్న కాలనీవాసులకు అందుబాటులో బ్యాంకులు లేకుండా ఉన్నాయని, ఈ ప్రాంత కాలనీల నుంచి బ్యాంకుల విషయంలో దూరంగా వెళ్లే పరిస్థితి ఉందని, తక్షణమే బ్యాంకులు ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. ఈ మేరకు సంబంధిత అధికారి ఉన్నత అధికారులకు తెలియ చేస్తామని సానుకులంగా స్పందించినట్లు వారు తెలిపారు.

## భూభారతి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి : కలెక్టర్ నారాయణ రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** భూ భారతి చట్టంలోని నిబంధనల మేరకు రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులన్నింటిని పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత జిల్లాలోని వివిధ డివిజన్‌లకు చెందిన ఆర్‌డిఒ,మండలాల తహశీల్దార్లతో భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి చట్టం అమలులో భాగంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిజమైన వ్యక్తులకు న్యాయం చేయాలన్నారు.కోర్టు కేసులు ఏమైనా ఉన్నాయో తెలుసుకుని, ఒకవేళ కోర్టు ఆర్డర్ ఉంటే పట్టాదార్ పాసు పుస్తకాలు ఇవ్వరాదని కలెక్టర్ సూచించారు. ప్రణాళికతో రెవెన్యూ సదస్సులలో వచ్చిన 21వేల దరఖాస్తులను జూలై 10వ తేదీ వరకు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా రెవె న్యూ అధికారి (డిఆర్ఒ) సంగీత,కలెక్టరేట్ సూపరిటెండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## గుడిసె వాసులకు పునరావాసం కల్పించాలి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** హయత్ నగర్ రేడియో స్టేషన్ వద్ద కొన్ని సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్న వారిని గుడిసెలు తొలగించడంతో వారి రోడ్డుపై పడ్డారని, గుడిసె వాసులకు ప్రభుత్వం పునరవాసలు కల్పించాలని ఎల్‌బి నగర్ ఎంఎల్‌ఎ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం హయత్ నగర్ లోనిఏడియో స్టేషన్ వద్ద నివాసం ఉంటున్న గుడిసెవాసులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలంతా ఎక్కడ ఉండలాని అన్నారు. దాదాపు 200 మంది కుటుంబాలు అక్కడ జీవనం సాగిస్తున్నారని ఆయన తెలిపారు. మాకు నిలవనిడ లేకుండా పోయిందని, వచ్చే వినాయక చవితి నేపథ్యంలో మేము ఎన్నో సంవత్సరాలుగా వినాయక విగ్రహాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని బాధితులు తెలిపారు. మాకు ప్రత్యన్మాయం చూపాలని ఎంఎల్‌ఎకు కోరారు. ఈ విషయంపై ఎంఎల్‌ఎ సుధీర్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగు సరిష్కారం చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ భూములు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి

### సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**ప్రజాపక్షం/షాబాద్ :** ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవనంలో సిపిఐ మండల మహాసభ నిర్వహించారు. మండల పార్టీ కార్యదర్శి నక్కల జంగయ్య అధ్యక్షతన సభ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ భూములను, భూదాన భూములను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములు వేలది ఎకరాలు ఉన్నాయి, వాటిని ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడం కారాణంగా భూ కబ్జాదారులు అక్రమంగా పాట్స్ చేసి అమ్ముకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమి లేని పేదవారికి సాగు భూమి పట్టాలు అందజేయాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. సిపిఐ పార్టీ 100 సంవత్సరాల శత జయంతి ఉత్సవాలను రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలో ఎర్రజెండ ఎగరావేసి పేదలకు అండగా నిలిచిందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తి అనాటి బ్రిటిష్ వలస పాలకులకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమ స్ఫూర్తితో దేశానికి స్వాతంత్రం వచ్చిందన్నారు. కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట సమితి సభ్యుడు రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం, నాయకులు సత్తిరెడ్డి, మక్బుల్, జిల్లా మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, అంజయ్య, రఘురాం, మధు, నారాయణ, రుక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

**మండల నూతన కమిటీ ఎన్నిక**

షాబాద్ మండల కార్యదర్శిగా పాలమాకుల శ్రీశైలం, సహాయ కార్యదర్శులుగా గడ్డం వెంకటేష్, రాములు, 15 మంది కౌన్సిల్ సభ్యులను మహా సభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తెలిపారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి

### యాంటీ నార్కోటిక్ బ్యూరో డిఎస్‌పి సోమనాథం




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యాంటీ నార్కోటిక్ బ్యూరో డిఎస్‌పి సోమనాథం పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో విద్యార్థి సేన అధ్యక్షులు టి.కె.శివప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టబోయే 'డ్రగ్స్ ఫ్రీ తెలంగాణకై 100 రోజుల మహోద్యమ వాల్‌పోస్టర్‌ను ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, ఆవిష్కరించారు. డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టే మేధోసంపత్తి గల యువ తెలంగాణను సాధించుకోవాలని కోరారు. సామాజిక బాధ్యతగా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్న విద్యార్థి సేన ప్రతినిధులను అభినందించారు. టి.కె.శివప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వంద రోజుల్లో అన్ని విద్యాసంస్థల్లో డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. సమావేశంలో చింతల పవన్, రామ్, రాజేశ్, విష్ణు, వెంకట్, భాస్కర్, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి : రాగుల



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** దోమల నివారణపై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని, దోమలు వ్యాపించకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎల్‌బి నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఇస్లావత్ సేవా నాయక్‌లు అన్నారు. బుధవారం డివిజన్‌లోని శక్తి నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో దోమల నివారణపై కాలనీ వాసులతో కలిసి అధికారులు అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లపై చెత్త వేయరాదని, తడి చెత్త, పోడి చెత్త స్వచ్ఛభారత్ ఆటోలోనే వేయాలని, చుట్టుపక్కల పచ్చిగడ్డి లేకుండా చూడాలని పచ్చిగడ్డి ఉంటే జిహెచ్‌ఎంసి సిబ్బందికి తెలియాచేయాలని సూచించారు. వర్షాకాలం రావడంతో మలేరియా, డెంగ్యూ వ్యాధులు వ్యాపించకుండా పరిశుభ్రత ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఇ మన్నెమ్మ, ఆశ్వినికుమారి, డిపిఓ టి,ఆర్ ప్రసాద్, ఏఈ శానిటేషన్ కే. రాజగోపాల్, డీజిఎం. డాక్టర్ నేగేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


## అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పది



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** అన్ని దానాల్లో కెల్లా అన్నధానం గొప్పదని సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ సుజాత అన్నారు. బుధవారం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీశ్రీశ్రీ బంగారు మైసమ్మ కాశి వైద్యనాథ దేవాలయంలో అమావాస్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిసీ సుజాత ముఖ్యఅతిథిగా హాజరై బంగారు మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గోల్డెన్ వాకర్స్ టీం (ఆర్యవైశ్య సంఘం) వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తుల కోరిన కోర్కెలు తీర్చే మహిమగల దేవత అమ్మవారు అని అన్నారు. సరూర్‌నగర్ పట్టణంలోని ఈ ఆలయంలో గత ఐదు సంవత్సరాలుగా ప్రతి రోజు వందలాది మంది నిత్య అన్నదానం చేస్తున్న ఫౌండర్ ట్రస్టీలు బేర బాలకిషన్, ఆకుల అరవింద్ లు కృషి గొప్పదని వారి సేవలకు కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిహెంఎంసీ సర్కిల్ శానిటరీ సూపర్‌వైజర్ బుచ్చయ్య, అర్యవైశ్య సంఘం సభ్యులు కాసెట్టి నాగేష్‌గుప్తా, కూర శ్రీనివాస్‌గుప్త, చోలేటి ఆనంద్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

## 30న యాదవుల ఆత్మగౌరవ సభ

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** యాదవ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలని, పరిపాలనలో భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద నిర్వహించ తలపెట్టిన యాదవుల ఆత్మగౌరవ సభకు రాజకీయ పార్టీలకతీతంగా తరలిరావాలని బిసి జన సభ రాష్ట్ర అధ్యక్షులు రాజారాం యాదవ్ యాదవులకు పిలుపునిచ్చారు. ఈ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి లోడంగి గోవర్ధన్, టిజెఏఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేకల కృష్ణ, బిసి ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్ తదితరులతో కలిసి ఆవిష్కరించారు. రాజారాం యాదవ్ మాట్లాడుతూ బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేశాకనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. యాదవులకు మంత్రి పదవితో పాటు ఎంఎల్‌సి, నామినేటెడ్ పదవులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పార్టీకి యాదవులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో తెలంగాణ యాదవ సంక్షేమ సంఘం రాష్ట్ర నేతలు గంగుల మధు యాదవ్, బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు వాసు కే యాదవ్, యాదవ హక్కుల పోరాట సమితి నేతలు తదితరులు పాల్గొన్నారు.



# 27న 'ఇస్కాన్' జగన్నాథ రథయాత్ర

### ప్రభుజీ మహా శృంగ దాస్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో శుక్రవారం కూకట్‌పల్లిలో నిర్వహించే జగన్నాథ రథ యాత్రలో లక్షలాధిగా పాల్గొనాలని ఇస్కాన్ కూకట్‌పల్లి అధ్యక్షులు ప్రభుజీ మహా శృంగ దాస్ ప్రజలకు పిలుపునిచ్చారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం అత్యంత దివ్యమైన పండుగగా జగన్నాథ రథయాత్ర ప్రపంచమంతా నిర్వహింస్తారని, ఈ క్రమంలోనే కూకట్‌పల్లిలో కూడా జగన్నాథుని రథ యాత్ర మహా వైభవంగా జరుగుతుందని తెలిపారు. జగన్నాథుని రథోత్సవాన్నిచూసేందుకు భక్తులు నలు మూలల నుండీ వేల సంఖ్యలో తరలివస్తారని, రథోత్సవం చూట్టానికి రెండు కళ్ళూ చాలవని అన్నారు. ఈ అద్భుతమైన జగన్నాథుని రథయాత్ర ఆధ్యాత్మికంగా ఉత్సాహంగా సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు, ఉత్తేజకరమైన కీర్తనలు, స్వచ్ఛమైన దైవ ప్రేమను ఉద్ధరించడానికి ఉల్లాసమైన కీర్తనలతో రథాన్ని లాగుతారని తెలిపారు. రథయాత్ర హైదర్ నగర్, మైసమ్మ ఆలయం నుండి మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమై నిజాం పెట్, జె.ఎన్.టి.యు, కె.పి. హెచ్.బి, వివేకానంద్ నగర్, బాలానగర్ మెట్రో స్టేషన్ వీధుల గుండా రాత్రి 8.00 గంటలకు మెట్రో గార్డెన్ వద్ద భక్తులకు మహాప్రసాద వితరణతో ముగుస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎలు అరికెపూడి గాంధీ, మాధవరం కృష్ణ రావు, మాజీ ఎంఎల్‌ఎ శ్రీశైలం గౌడ్, మాజీ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్‌లు పాల్గొంటారని తెలిపారు. తెలంగాణ అగర్వాల్ సమాజ్ మాజీ రాష్ట్ర అధ్యక్షు లు అంజనీ కుమార్ అగర్వాల్, మాట్లాడుతూ ఈ జగన్నాథుని రథ యాత్ర ముగింపు అనంతరం సికింద్రాబాద్, బాలంరాయి, క్లాసిక్ గార్డెన్స్‌లో కోలాట, గర్భ నృత్యాలు, భజనలు, కీర్తనలు ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించబడుతాయని, భక్తులందరూ అధికసంఖ్యలో పాల్గొని జగన్నాథుని ఆశీర్వచనాలు పొందాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ గుజరాతి సమాజ్ అధ్యక్షులు జాస్మాత్ పటేల్, ఇస్కాన్ కుకుట్ పల్లి సమన్వయకర్త ఏం. శ్రీవాణి, ఇస్కాన్ రష్యా ప్రతినిధి ఒక్సానాలు పాల్గొన్నారు.

**28న ఇస్కాన్ మియాపూర్ ఆధ్వర్యంలో**

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్), మియాపూర్ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 28న జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నామని మియాపూర్ ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షులు శ్రీరాందాస ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుజీ మాట్లాడుతూ ఈనెల 28న మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని చందానగర్ లోని ఆర్.ఎస్ బ్రదర్స్ వద్ద ఈ రథయాత్ర ప్రారంభమవుతుందన్నారు. రథయాత్ర మదీనగూడ, ఆల్విన్ క్రాస్‌రోడ్, మియాపూర్ క్రాస్ రోడ్, జె.పి నగర్ వీధుల గుండా కొనసాగుతూ విశ్వనాథ గార్డెన్ వద్ద ముగుస్తుందని పేర్కొన్నారు.

### ఫార్ములా ఇ-కార్ రేసు కేసులో

## మాజీ ఐఎఎస్‌కు ఎసిబి నోటీసు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫార్ములా ఇ–కార్ రేస్ కేసుకు సంబంధించి మాజీ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ కు మరోసారి ఎసిబి నోటీసులు జారీ చేసింది. జూలై 1న ఎసిబి కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని నోటీసులలో పేర్కొన్నారు. అరవింద్‌కుమార్ ఇటీవలే విదేశీ పర్యట న ముగించుకొని ఈ నెల 21వ తేదీన ఢిల్లీకి చేరుకున్నారు. ఒకటి రెండు రోజుల్లో హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉంది. వీటిని దృష్టిలో పెట్టుకుని అతన్ని జూలై 1న విచారణకు పిలిచారు.



## అక్రమ భూ రిజిస్ట్రేషన్లకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

### పారదర్శకంగా విచారణ చేసి బాధితులకు న్యాయం చేయండి : వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** సొంత కుటుంబ సభ్యుల నుండి అక్రమ భూ రిజిస్ట్రేషన్లకు పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండలం చిల్కమర్రి గ్రామానికి చెందిన భూ బాధితులు కొత్తపల్లి నర్సింహ్మారెడ్డి, కొత్తపల్లి వినోదలతోపాటు కుటుంబ సభ్యులు వచ్చి ఎమ్మెల్యే తమ గోడును వివరించారు. బాధిత రైతులు చెప్పిన మాట విన్న ఎమ్మెల్యే ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. పట్టాదారు లేకుండానే భూమి ఎలా జిపిఏ చేశారు. అనే విషయాలపై సుధీర్ఘల ఆలోచనలు సంబంధిత అధికారులతో చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ సొంత కోడలు కొత్తపల్లి వినోదపై ఉన్న భూమిని గుట్టు చప్పుడు కాకుండా మామ కొత్తపల్లి సుభాన్‌రెడ్డి జిపిఎ చేసుకోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. సొంత కోడలికి అన్యాయం చేసి పెద్ద కుమారికిడి అక్రమంగా భూ రిజిస్టేషన్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. అదే విధంగా కొత్తపల్లి నర్సింహ్మారెడ్డికి చెందిన భూమి వారి భార్య కొత్తపల్లి నవనీత ఎలా జిపిఎ చేసుకుందో అర్థం కాని ప్రశ్నగా మిగిలిపోయిందని వివరించారు. నకిలీ జిపిఎ డాక్యుమెంట్లను సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తులకు అదుపులోకి తీసుకొని పారదర్శకంగా విచారణ చేసి చర్యలు తీసుకొవాలని పోలీసులకు కొరినట్లు తెలిపారు. ఇప్పటికే షాద్‌నగర్ ఏసిపితో పాటు పట్టణ పోలీసులకు ఈ ఘటనపై వివరించడం జరిగిందని, భూత్పూర్ మీసేవ కేంద్రం ని ర్వాహకుడి వ్యవహారం బయటకు వస్తుందని వివరించారు. అక్రమంగా జిపిఎ డాక్యుమెంట్లు సృష్టించడమే కాకుండా ఇతరులకు ఏకంగా సెల్‌డి డ్ చేయడం చూస్తుంటే ఈ వ్యవహారాల్లో రాదు తే లి ఉంటారని, ధరణి లోసుగులను అసరగా చేసుకొని ఈ ఘటనకు పాల్పడ్డారని పేర్కొన్నారు. అం దుకే కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను బొందపెట్టి రైతు శ్రేయస్సు కోసం భూ భారతి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. రైతుల భూములను పూర్తి స్థాయిలో గ్యారంటి ఉంటుందని పేర్కొన్నారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఇందులో ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. రైతులకు ధైర్యం చెప్పి పంపించారు.

## సరూర్‌నగర్‌లో ఎమ్మెల్యే సబిత పర్యటన

### ఎమ్మెల్యే ఫోన్ చేసినా స్పందించని జోనల్ కమిషనర్



**ప్రజాపక్షం/ సరూర్‌నగర్:** ప్రజాప్రతి నిధులు ప్రజల సమక్షంలో ఉండి ఫోన్ చేసిన అధికారులు స్పందించడం లేదని, ప్రజాప్రతినిధులకే ఈ పరిస్థితి అయితే ఈ ప్రజాపాలన అని అర్భాటంగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాన్యుల పరిస్థితి ఏమిటని మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పటోళ్ల సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని హుడా కాంప్లెక్స్‌లో ప్రజలతో కలిసి స్థానిక నాయకులు, జిహెచ్‌ఎంసి అధికారులతో కలిసి పర్యటించి ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడుతూ జిహెచ్ ఎంసి, మున్సిపాలిటీ పరిధిలో వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నాలాల్లో, డ్రైనేజీల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడూ షిల్ట్ తీయాలని కెసిఆర్ ముఖ్యమంత్రి ఉన్న సమయంలో అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. కాని ప్రస్తుతం శానిటేషన్, చెత్తను క్లీన్ చేసే విషయంలో 100 రోజుల ప్రణాళిక అంటూ ప్రత్యేక ఆదేశాలు ప్రభుత్వం ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. దాని కంటూ గతం నుంచే ఒక పద్ధతి ఉందన్నారు. హుడాకాలనీలో సెకండ్ ఫేస్ ఎస్‌ఎన్‌డిపి నాలా పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. వాటర్ బోర్డు, జిహెచ్‌ఎంసీ నిధులు లేవని చెబుతున్నారని ఎల్‌బినగర్ జోనల్ కమీషనర్ కి ఫోన్ చేస్తే కనీసం స్పందించడం లేదని ఆరోపించారు. జోనల్ కమీషనర్ సరిగ్గా స్పంధించకుంటే డివిజన్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం ఎలా అవుతాయని ప్రశ్నించారు. ఎమ్మెల్యేకే జోనల్ కమీషనర్ స్పందించకుంటే ప్రజల సమస్యలపై ఇంకెలా స్పంధిస్తారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ సుజాత, వాటర్ వర్క్స్ అధికారులతో పాటు మహేశ్వరం నియోజకవర్గం యువజన విభాగం మాజీ అధ్యక్షులు లోకసాని కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏనుగు దంతాల ముఠాను పట్టుకున్న రాచకొండ పోలీసులు





**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** ఏనుగు దంతాలు స్మగ్లింగ్ చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పట్టుకున్నట్లు రాచకొండ పోలీస్ కమిషనర్(సిపి)ఎస్ సుధీర్ బాబు చెప్పారు. రెండు ఏనుగు దంతాలను స్వాధీనం చేసుకున్నమని, ఇవి ఒరిజినల్ దంతాలా కాదా అని ఫారెస్ట్ వాళ్ళతో చెక్ చేయించినట్లు తెలిపారు. వైల్డ్‌లైఫ్ యాక్ట్ 1972 ప్రకారం ఇది చట్టరీత్యా నేరమని, ఏనుగు నుంచి ఇవి కట్ చేసి సేకరించినట్లు ఆయన వివరించారు.ఈ కేసు లో ప్రసాద్,లోకేశ్వర్ రెడ్డి ఈ దందాను కొనసాగిస్తున్నరని,శేషాచలం అడవుల్లోని ఏనుగుల నుంచి దంతాలను సేకరించిరని,సిపి పేర్కొన్నారు.ఇల్లీగల్ యాక్టివిటిపై దృష్టి సరించిన రాచకొండ పోలీస్‌లు, బస్సుల్లో తీసుకొచ్చి అమ్మకాలు సాగిస్తున్న గుర్తించినట్లు సిపి పేర్కొన్నా రు. ఏనుగు దంతాల స్మగ్లింగ్ కేసులో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. పట్టుబడ్డ ఏనుగు దంతాలు 5.62 కేజీలు ఉంటుందని తెలిపారు. నిందితులు ఎర్ర చందనం స్మగ్లింగ్ చేస్తున్నారని,దాదాపు రూ.3 కోట్లు విలువగ ఏనుగు దంతాలను సీజ్ చేశామన్నారు.50 నుంచి 60 లక్షల వరకు కేజీ ఏనుగు దంతాలు మార్కెట్‌లో అమ్మకాలు సాగిస్తున్నారని సిపి సుదీర్ బా బు స్పష్టం చేశారు. ప్రస్తుతం నిందితుడు ప్రసాద్ మాత్రమే పట్టుబడ్డాడని, మరో నిందితుడు లోకేశ్వర్ రెడ్డి పరారీలో ఉన్నట్లు తెలిపారు.ప్రసాద్,లోకేశ్వర్ రెడ్డి ఇద్దరూ గతంలో ఎర్ర చందనం స్మగ్లింగ్ కేసులో పట్టుబడి జైల్లో ఉన్నారని,ఇద్దరికీ జైలులో పరిచయం ఏర్పడిందన్నారు.జైలు నుంచి విడుదలఅయ్యాక ఏనుగు దంతాల స్మగ్లింగ్ కు పాల్పడ్డారని సిపి సుధీర్ బాబు వివరించారు.

## ప్రజలకు అందుబాటులో ఉన్న పోలీస్ స్టేషన్ తరలించడం మానుకోండి

### జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలో ధర్నాలు నిర్వహించిన శ్రేణులు

**ప్రజాపక్షం/కొందుర్గు:** ప్రజలకు అందుబాటులో ఉన్న పోలీస్ స్టేషన్‌ను తరలించడం ప్రభుత్వం మానుకోవాలని వివిధ రాజకీయ పార్టీల శ్రేణులతో పాటు ప్రజా సంఘాల నాయకలు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలో రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ధర్నాలు నిర్వహించి మండల ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉన్న పోలీస్ స్టేషన్‌ను లాల్‌పహాడ్ చౌరస్తాకు తరలిస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాజకీయ కుట్రలో భాగంగానే మండల కేంద్రంలో ఉన్న పోలీస్ స్టేషన్‌ను శివారు ప్రాంతానికి తరలించేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. మండల కేంద్రంలో ఉండలంతో చుట్టు పక్కల గ్రామాలకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటుందని, అలాంటిది లాల్‌పహాడ్ చౌరస్తాకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వార్తలు సృష్టించడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. ఎన్నో పోరాటాలు చేసి జిల్లేడు చౌదరిగూడను మండల కేంద్రంగా ఏర్పాటు చేసుకుంటే ఇక్కడి నుండి పోలీస్ స్టేషన్‌ను తరలిస్తామని చెప్పడం బావ్యం కాదన్నారు. నూతనంగా ఏర్పడిన మండల కేంద్రం నుండి ప్రభుత్వ కార్యాలయం వెళ్ళిపోవడం అనేది బాధగా ఉంటుందని వివరించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా జెఏసిని ఏర్పాటు చేసి ధర్నాలు నిర్వహించారు. అందుకు షాద్‌నగర్ బిసి సేన నాయకులు సైతం పాల్గొని సంఘీభావం తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం పోరాటాలు చేసేందుకు బీసిసేన ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ బిసిసేన నాయకులు చెన్న బాల్‌రాజ్, ప్యాట శ్రీకాంత్, బోయ చెన్నయ్య, జిల్లేడు చౌదరిగూడ మండల కోశాధికారి కె.సంధ్య, కొందుర్గు మహిళా అధ్యక్షురాలు వీరపురం అనితగౌడ్, జిల్లేడు గ్రామ అధ్యక్షురాలు ఈ.కమలమ్మ, కార్యదర్శి లక్ష్మమ్మ, గ్రామ కోశాధికారి లక్ష్మి, కార్యవర్గ సభ్యులు రమేష్, సునీత, శశికల, సాగర్, బాలమణిలతోపాటు జెఏసి నాయకులు మచ్చ సుధాకర్, బాబురావు, హాఫీజ్‌లు పాల్గొన్నారు.



## మాదకద్రవ్యాల నిర్మూలనలో యువత కీలక పాత్ర పోషించాలి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మాదకద్రవ్యాల నిర్మూలించేందుకు యువత కీలక పాత్ర పోషించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పట్టణ సిఐ విజయ్‌కుమార్ వివరించారు. బుధవారం పట్టణంలోని విశ్వభారతి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు స్థానిక పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్లోగన్ రైటింగ్, చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సిఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థలకు అలవాడు పటి మత మేధాశక్తిని వృథా చేసుకోవద్దని, డ్రగ్స్ ఒక్కసారి వాడితే వ్యసనంగా మారే అవకాశం ఉంటుందని అన్నారు. గంజాయి, డ్రగ్స్ యువత పూర్తిగా బహిష్కరించాలని, అందులో యువతే కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా స్కూళ్ళు, కళాశాలలు, ఇత ర ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయించినట్లు తెలిస్తే తక్షణమే 1098కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రణయ్, కళాశాల ప్రిన్సిపాల్ శివకుమార్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడ



## అత్యుత్తమ ప్లేస్‌కి పంత్

టెస్ట్ ర్యాంకింగ్స్‌ను ప్రకటించిన ఐసిసి

ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్‌ను ప్రకటించింది. ఇంగ్లాండ్‌తో తొలి టెస్టుల్లో బ్యాక్‌టుబ్యాక్ సెంచరీలతో చెలరేగిన భారత స్టార్ వికెట్ కీపర్ రిషబ్ పంత్ ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా ఏడో ప్లేస్‌కు చేరుకున్నాడు. లీడ్స్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌లలో రెండు సెంచరీలు సాధించాడు. కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ సైతం టాప్ 20లోకి ప్రవేశించాడు. లీడ్స్‌లో జరిగిన తొలి టెస్ట్‌లో టీమ్ ఇండియా ఐదు వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. ఇంగ్లండ్ 82 ఓవర్లలోనే 371 పరుగుల లక్ష్యాన్ని ఛేదించగా.. ఐసిసి తాజా ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. లీడ్స్ టెస్ట్‌లో రెండు ఇన్నింగ్స్‌లలో రెండు సెంచరీలు చేసిన రెండో వికెట్ కీపర్‌గా పంత్ నిలిచాడు. అంతకుముందు జింబాబ్వేకు చెందిన ఆండీ ఫ్లవర్ ఒకే టెస్ట్ మ్యాచ్‌లో రెండు సెంచరీలు చేసిన ఏకైక వికెట్ కీపర్. లీడ్స్ టెస్ట్‌లో పంత్ తొలి ఇన్నింగ్స్‌లో 134, సెకండ్ ఇన్నింగ్స్‌లో 118 పరుగులు చేశాడు. అదే సమయంలో శుభ్‌మాన్ గిల్ ఐదు స్థానాలు ఎగబాకి టాప్ 20కి చేరుకున్నాడు. లీడ్స్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో గిల్ సెంచరీ చేశాడు. టాప్ 20 టెస్ట్ బ్యాట్స్‌మెన్ జాబితాలో భారతదేశం నుంచి ముగ్గురు బ్యాట్స్‌మెన్ మాత్రమే ఉన్నారు. పంత్, గిల్‌తో పాటు యశస్వి జైస్వాల్ నాలుగోస్థానంలో ఉన్నాడు. లీడ్స్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో యశస్వి సైతం సెంచరీ చేశాడు. టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో పెద్దగా మార్పులు జరుగలేదు. హెడింగ్లీ టెస్ట్‌లో 14వసారి ఐదు వికెట్లు తీసిన తర్వాత భారత ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 62 పరుగులు, సెకండ్ ఇన్నింగ్స్‌లో 149 పరుగులు చేసి ఇంగ్లాండ్ విజయంలో కీలకపాత్ర పోషించిన బెన్ డకెట్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఈక్రమంలో టెస్ట్ బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో ఐదు స్థానాలు ఎగబాకి ఎనిమిదో స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్ ఓలీ పోప్ మూడు స్థానాలు ఎగబాకి 19వ స్థానానికి, జామీ స్మిత్ ఎనిమిది స్థానాలు ఎగబాకి 27వ స్థానానికి చేరుకున్నారు. ఇంగ్లాండ్ సీనియర్ ప్లేయర్ జో రూట్ నంబర్ వన్ స్థానంలో కొనసాగుతున్నాడు. హ్యారీ బ్రూక్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. న్యూజిలాండ్‌కు చెందిన కేన్ విలియమ్సన్ మూడోస్థానంలో ఉన్నాడు. లీడ్స్‌లో ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ బాల్, బ్యాట్‌తోనూ రాణించగా.. ఆల్‌రౌండర్ల జాబితాలో మూడుస్థానాలు మెరుగుపరుచుకొని ఐదోప్లేస్‌కు చేరాడు. టెస్ట్ ఆల్ రౌండర్ల జాబితాలో టీమిండియా ప్లేయర్ రవీంద్ర జడేజా అగ్రస్థానంలో ఉన్నాడు. శ్రీలంక–బంగ్లాదేశ్‌తో మధ్య తొలి టెస్ట్ డ్రాగా ముగియగా.. ఈ మ్యాచ్‌లో రాణించిన పలువురు ఆటగాళ్ల ర్యాంకింగ్స్‌నాలో మార్పులు జరిగాయి. గాలెలో టెస్టులో 163 పరుగులు చేసిన బంగ్లా ప్లేయర్ ముష్ఫికర్ రహీమ్ 11 స్థానాలు ఎగబాకి 28వ స్థానానికి చేరుకోగా.. నజ్ముల్ హొస్సేన్ శాంటో ఒకే మ్యాచ్‌లో రెండు సెంచరీలు చేసి 21 స్థానాలు ఎగబాకి 29వ స్థానానికి చేరుకున్నాడు.

## బుమ్రా అంశంలో ప్లాన్ మార్చేది లేదు

గౌతం గంభీర్



ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్టులో ఇండియా ఓడిన విషయం తెలిసిందే. అయితే ఆ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో ప్రధాన బౌలర్ బుమ్రా ఒక్క వికెట్ కూడా తీయలేదు. ఇంగ్లాండ్‌తో ఆడే అయిదు టెస్టుల సిరీస్‌లో కేవలం మొదటి మూడు టెస్టులకు మాత్రమే బుమ్రాను ఎంపిక చేశారు. ప్రస్తుతం తొలి టెస్టు ఓడిన నేపథ్యంలో.. ఆ ప్లాన్‌ను ఎటువంటి మార్పు చేసేది లేదని ప్రధాన కోచ్ గౌతం గంభీర్ తెలిపారు. వాస్తవానికి హెడ్డింగ్లే పిచ్‌పై బుమ్రా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. కానీ ఇంగ్లీష్ బ్యాటర్ల వికెట్లను తీయడంలో భారత్ విఫలమైంది. రెండో ఇన్నింగ్స్‌లో 371 రన్స్ టార్గెట్‌ను ఇంగ్లాండ్ చాలా సులువుగా ఛేజ్ చేసింది. వర్క్ లోడ్ మేనేజ్మెంట్ వల్ల బుమ్రాపై అధిక వత్తిడి పెంచలేమని గంభీర్ తెలిపాడు. తొలి మూడు టెస్టులకే అతన్ని ఎంపిక చేసినా.. మొదటి టెస్టు ఓటమితో.. ఇంకా నాలుగు మ్యాచ్‌లే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అతని అంశంలో నిర్ణయాన్ని మార్చుకునే అవకాశం లేదని గంభీర్ తెలిపారు. తమ ప్రణాళికల్లో ఎటువంటి మార్పు లేదని, అతనిపై వర్క్‌లోడ్ ఉందని, ఈ సిరీస్‌కు రాకముందే ఆ అంశంపై క్లారిటీ ఉందన్నారు. బర్మింగ్‌హామ్‌లో జూలై రెండో తేదీ నుంచి రెండో టెస్టు ప్రారంభంకానున్నది. అయితే ఏ రెండు టెస్టుల్లో బుమ్రా ఆడుతాడో ఇంకా స్పష్టంగా తెలియదు. తమ వద్ద అద్భుతమైన బౌలింగ్ బృందం ఉందని, దాంట్లో తనకు నమ్మకం ఉందని, నమ్మకంతోనే జట్టును ఎంపిక చేస్తామని, ఆశతో కాదన్నారు. లీడ్స్ టెస్టులో అయిదో రోజు ఓ దశలో గెలిచే స్థితిలో ఉన్నామని, మన బౌలర్లు రాణిస్తారని గంభీర్ పేర్కొన్నారు.

## 50 ఓవర్లలో 444 పరుగులు..

### ఇండియా అండర్- 19 జట్టు



లీడ్స్ వేదికగా ఇంగ్లాండ్, టీమ్ ఇండియా మధ్య మొదటి టెస్ట్ మ్యాచ్ మంగళవారం ముగిసింది. ఈ పోరులో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టు ఆతిథ్య ఇంగ్లాండ్ టీమ్ చేతిలో 5 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. అయితే భారత్ అండర్ 19 టీమ్ మాత్రం తన సత్తా చాటింది. ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న యువ జట్టు లాఫ్‌బరోలో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ యంగ్ లయన్స్‌ను 231 పరుగుల తేడాతో ఓడించింది. ఈ క్రమంలో భారత యువ జట్టు కేవలం 50 ఓవర్లలోనే 444 పరుగులు చేసి అసలైన బజ్‌బాల్ క్రికెట్‌ను ఇంగ్లాండ్ యూత్ టీమ్‌కు రుచి చూపించింది. ఐపిఎల్ 2025లో చెన్నైసూపర్ కింగ్స్ తరఫున ఆడిన ముంబయికి చెందిన యువ బ్యాట్స్‌మన్ ఆయుష్ మాత్రే.. భారత యువ జట్టుకు నాయకత్వం వహించాడు. అయితే అతడు ఈ మ్యాచ్‌లో విఫలమయ్యాడు. కేవలం 1 పరుగుకే అవుటయ్యాడు. ఐపిఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ సైతం కేవలం 17 పరుగులు చేసి వెనుదిరిగాడు. కానీ ఈ మ్యాచ్‌లో 18 ఏళ్ల హర్వంశ్ పంగాలియా తన సత్తా చాటాడు. కేవలం 52 బంతుల్లో 103 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. తన ఇన్నింగ్స్‌లో మొత్తం 8 ఫోర్లు, 9 సిక్స్‌లు బాదాడు. అతడికి రాహుల్ కుమార్ తగిన సహకారం అందించాడు. 60 బంతుల్లో 73 పరుగులు చేశాడు. కనిష్క చౌహాన్ 67 బంతుల్లో 79 పరుగులు చేశాడు. అలాగే అంబ్రిష్ కేవలం 47 బంతుల్లోనే 72 రన్స్ రాబట్టాడు. ఈ మ్యాచ్‌లో సెంచరీతో సత్తా చాటిన వికెట్ కీపర్ బ్యాటర్ హర్వంశ్ స్వస్థలం గుజరాత్‌లో రాన్ ఆఫ్ కచ్‌లోని గాంధీధామ్ అనే చిన్న పట్టణం.

# ఫోకస్

# కళారంగం



## మీకు తెలుసా?

రాగం అంటే రంజించు శక్తి కల స్వరమాలిక. ఇది కొన్ని నిశ్చిత స్వరాల కలయిక. ప్రతి రాగానికి ఒక ప్రత్యేక భావం ఉంటుంది. ఉదాహరణకు, భక్తి, శాంతికి భైరవి, ఆనందం, ఉల్లాసం వ్యక్తీకరించడానికి తిలక్‌మోడ్ రాగాలు వాడతారు. దర్బార్ గంభీరతకు మారుపేరైతే, విరహభావాన్ని హిందోళం వ్యక్తపరుస్తుంది.

సంగీతంలో వివిధ భావోద్వేగాలకు రకరకాల రాగాలు ఉన్నట్టే... రాలకు సమయాలు కూడా ఉన్నాయి. ఉదయం: భూపాళి, బిలహరి, మధ్యాహ్నం: మాధమావతి, సాయంత్రం: యమునాకల్యాణి, రాత్రి: నీలాంబరి, కపి.

భారత శాస్త్రీయ సంగీతం రెండు రకాలు.. ఒకటి హిందుస్థానీ సంగీతం (ఉత్తర భారతం), రెండవది కర్నాటక సంగీతం (దక్షిణ భారతం).

ఎన్నో సంగీత వాయిద్యాలు సంగీతానికి వన్నెలు దిద్దుతున్నాయి. సంగీతం కీలకమైన వాయిదాల్లో మొదటిది వీణ. ఇది కర్ణాటక సంగీతంలో ప్రాచీనమైన తంత్రివాద్యం. హిందుస్తానీ సంగీతానికి 'సితార్' కీలకం. దక్షిణాది రిథం మాస్టర్ మృదంగం. హిందుస్తానీ తాళ వ్యవస్థకు హృదయం తబలా. మంగళ వాయిద్యంగా వినిపించేది నగస్వరమైతే, పండుగల్లో వీనులవిందు చేసేది షెహనాయ్.

ఆధునిక వాద్య పరికరాల్లో హార్మోనియం, కీబోర్డు, ఎలక్ట్రిక్ గిటార్, డ్రమ్స్ విశిష్ట స్థానాన్ని ఆక్రమించాయి.

ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా పాడే పాట 'హ్యాపీ బర్త్‌డే టు యూ'.

సంగీతాన్ని 20 హెర్ట్జ్ నుంచి 20 కిలో హెర్ట్జ్ ధ్వని శ్రేణుల్లో వినవచ్చు.


సంగీతం రాసే భాషను 'స్టాఫ్ నొటేషన్' అంటారు. ఇది పాశ్చాత్య సంగీతానికి ప్రామాణిక పద్ధతి.

## గోండు సంస్కృతికి నిలువుటద్దం..



గుస్సాడీ నృత్యం గోండు సంస్కృతికి నిలువుటద్దం. వాయిద్యాలకు అనుగుణంగా, లయబద్ధంగా కదిలే కాళ్లు... వేసే అడుగులు ప్రేక్షకులు ఉర్రూతలూగిస్తాయి. అడవి గీతం కొండకోనల్లో ప్రతిధ్వనిస్తుంటే, గోండులు ఉత్సాహంగా చేసే నృత్యంలో, దుస్తుల నుంచి కొమ్ము బూర వంటి వాయిద్యాల వరకూ... కలప్పై నెమలి పింఛాల నుంచి మెడలో డప్పు వరకూ ఎన్నో ప్రత్యేకతలు. గుస్సాడీ నృత్యంలో జీవనం తొణికసలాడుతుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని గోండు ఆదివాసీల సంస్కృతిలో అత్యంత ప్రసిద్ధమైన ఈ సంప్రదాయ నృత్యాన్ని ఎక్కువగా దసరా పండుగ సమయంలో ప్రదర్శిస్తారు. నృత్యకారులు రంగురంగుల పీలికలతో అలంకరించిన శిరస్త్రాణం (మయూర పింఛాలు లేదా రాగి గంటలతో), గజ్జెలు, సాంప్రదాయ వస్త్రాలు ధరిస్తారు. డప్పు, మండల వాయిద్యాల లయలో, ఈ నృత్యం సమాజ ఐక్యత, పూర్వీకుల గౌరవం, ప్రకృతితో అనుబంధాన్ని ప్రతిబింబిస్తుంది. గుస్సాడీ కేవలం నృత్యం కాదు, గోండ్ జాతి సంస్కృతి, గుర్తింపు, ఆధ్యాత్మిక భావనల సమ్మేళనం.


## సామాజిక రుగ్మతలను ఎండగట్టిన 'కాళ్లకూరి'




తెలుగు నాటక రంగంలో 'వర విక్రయం', 'చింతామణి'కి ఉన్న స్థానం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వీటి రచయిత కాళ్ళకూరి నారాయణరావు. సామాజిక రుగ్మతలపై ఆయన సమరశంఖారావం పూరించారు. తన నాటకాల ద్వారా ఎండగట్టారు. కొత్త ఆశలు... ఆశయాలవైపు సమాజాన్ని నడిపించారు. 1871ఏప్రిల్ 28న పశ్చిమ గోదావరి జిల్లా, వీరవాసరము మండలం, మత్స్యపురి గ్రామంలో బంగారురాజు, అన్నపూర్ణమ్మ దంపతులకు జన్మించిన కాళ్లకూరి, 1927 జూన్ 27న తుదిశ్వాస విడిచారు. బతికి ఉన్నంత కాలం సమాజంలో నెలకొన్న ఎన్నో సమస్యలపై తీవ్రంగా స్పందించారు. సంఘంలో వేళ్ళూనిన పలు దురాచారాలను ఎలుగెత్తి ఖండిచారు. వీరి రచించిన నాటకాలలో చింతామణి (1921), వర విక్రయం (1923), మధుసేవ (1926) బాగా ప్రసిద్ధిచెందినవి. వీటిని చాలా మంది నాటకాలుగా ప్రదర్శించారు. తెలుగు సినిమాలుగా కూడా వచ్చాయి. ఘన విజయం సాధించారు. కాళ్ళకూరి 1919 లో రాసిన 'పద్మవ్యూహం' నాటకంలో పద్యాలతో కూడిన సంభాషణలతో కొత్త ప్రయోగం చేశారు. వరకట్నం దురాచారాన్ని నిరసిస్తూ కాళ్లకూరి రచించిన నాటకం 'వరవిక్రయం'. ఇది ఎంతో ప్రాచుర్యమున్న నాటకం. ఇది లీలాశుకుని చరిత్ర. ఆనాటి కాకినాడ వేశ్యల గుట్టుమట్లు ఆ నాటకంలో రచయిత బట్టబయలు చేశారు. ఈ నాటకం కొన్ని వేల సార్లు ప్రదర్శితమైంది. ఆనాడు వరవిక్రయాన్ని ప్రదర్శించని నాటక సమాజమంటూలేదు. ఈ నాటకంలోని మాటలు ప్రజల నోటిలో తాండవించాయి. ఇదే స్థాయిలో ప్రాచుర్యం పొందిన మరో నాటకం 'చింతామణి'. వేశ్యావృత్తికి వ్యతిరేకంగా ఉద్యమం జరుగుతున్న కాలంలో కాళ్లకూరి ఈ నాటకాన్ని రాశారు. కాగా, 'మధుసేవ'లో మద్యపానం వలన కలిగే దుష్పరిణామాలను ఎత్తి చూపారు. పద్మవ్యూహం (1919), సంసార నటన (1974 కళలో ధారవాహికగా ప్రచురితం) మొదలైన నాటకాలు, కారణంలేని కంగారు (1920), దసరా తమాషాలు (1920), ఉబ్భగేసర చక్రవర్తి (1906), రూపాయి గమ్మత్తు (1920), ఘోరకలి (1921), మునిసిపల్ ముచ్చట్లు (1921), విదూషక కపటము (1921) వంటి ప్రహసనాలు రచించారు. తెలుగు కళారంగానికి, ప్రత్యేకించి నాటక రంగానికి కాళ్లకూరి చేసిన సేవలను ఆయన జయంతి సందర్భంగా గుర్తుచేసుకోవడం కళాభిమానుల విధి.




## అత్యంత పురాతన వాయిద్యం 'ఫ్లూట్'!



సాధారణంగా అత్యంత పురాతనమైన వాయిద్యాలుగా డప్పు, బూర తదితరాలను పేర్కొంటారు. అయితే, అన్నికంటే అత్యంత పురాతనమైన వాయిద్యం 'ఫ్లూట్' (వేణువు) అని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఇది మనకు తెలియకముందే మనిషి జీవనంలో ప్రవేశించిన సంగీత పరికరం. జర్మనీలోని హొలె ఫెల్స్ గుహలో, 2008లో అత్యంత పురాతనమైన ఫ్లూట్‌ను కనుగొన్నారు. ఇది సుమారు 42,000 నుండి 43,000 సంవత్సరాల పూర్వానికి చెందినదిగా పరిశోధకుల అంచనా. దానిని పక్షులు లేదా గొర్రెల పవిముకలతో తయారు చేశారని భావిస్తున్నారు. కొన్ని రంధ్రాల ద్వారా శబ్దాన్ని ఉత్పత్తి చేయగల సామర్థ్యం దీనికి ఉంది. కాగా, భారతదేశంలో పురాతన వాయిద్యం వెదురుతో తయారు చేసిన వేణువు. వేదకాలంలోనూ దీని ప్రస్తావన ఉంది. ఆస్ట్రేలియాలో డిడ్జిరిడూ, మిసోపొటేమియాలో లియర్, ఈజిప్టులో హార్ప్ పురాతనమైన వాయిద్యాలు.

## దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్న మోదీ

సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారథి ధ్వజం



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** కేంద్రంలోని బిజెపి మోదీ ప్రభుత్వం దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్నాడని, మూడవసారి అధికారంలోకి వచ్చినా ప్రజలకు తీవ్ర నిరాశే మిగిలిందని సిపిఐ మహబూబాబాద్ జిల్లా సెక్రటరి బి.విజయసారథి విమర్శించారు. బుధవారం సిపిఐ 26వ వార్డు పరిధిలోని రావి నారాయణరెడ్డి, సిగ్నల్ కాలనీ, కాకతీయ కాలనీ, భగత్ సింగ్ నగర్, సిపిఐ ఆఫీస్ ఏరియా నాలుగు శాఖల మహాసభలు వార్డు కన్వీనర్ ఎండి ఫాతిమా అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై విజయసారథి మాట్లాడుతూ మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి దేశాన్ని తీవ్రంగా సంక్షోభంలోకి నెట్టిందన్నారు. ఈ సంవత్సరకాలంలో వికసిత్ భారత్ అంటూ ప్రచారం చేసుకుంటున్న బిజెపి దేశాన్ని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టిందని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక కార్పోరేట్లకే బిజెపి ఊడిగం చేస్తోందన్నారు. మోడీ మూడవసారి అధికారంలోకి వచ్చిన నిరుపేదలకు చేసింది ఏమీ లేదన్నారు. అన్నిరంగాల్లో ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఆపరేషన్ సింధూరం పేరుతో అమెరికా దేశానికి దాసోహం అన్నమోడీ ఆపరేషన్ కగార్ పేరుతో చత్తీస్‌గఢ్‌లో అడవి సంపదను దోచుకుంటున్నారని అడవి బిడ్డలను అన్యాయంగా కాల్చేస్తున్నారని, బూడిద కూడా కుటుంబ సభ్యులకు అప్పగించకుండా అక్కడున్న ఆదివాసీలను, ప్రజలను నిర్ధాక్షిణ్యంగా హత్యలు చేస్తున్నారన్నారు. తక్షణమే ఆపరేషన్ కగార్ ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథి రెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, సాంబలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఉస్తేల వీరారెడ్డి ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్

**ప్రజాపక్షం/చింతలపాలెం:** ఉస్తేల వీరారెడ్డి ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, మల్లారెడ్డిగూడెం ప్రాంత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు కామ్రేడ్ ఉస్తేల వీరారెడ్డి 7వ వర్ధంతిని మండల కేంద్రంలోని సోమిరెడ్డి వెంకటరెడ్డి స్మారకభవనం కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉస్తేల వీరారెడ్డి చింతలపాలెం మండల కేంద్రంలో అనేక పోరాటాలు నిర్వహించి పేదలకు భూములు పంచడం, దళితులకు ఇంటి స్థలాలు అందించడం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, నిత్యం ప్రజల కోసం పాటుపడ్డ వ్యక్తి అని అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రస్తుత ఉన్న యువత వీరారెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని సమస్యల పరిష్కారానికి ప్రశ్నించే గళాలుగా కావాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించి కమ్యూనిస్టు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉస్తేల సృజన, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లంల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు నారాయణరెడ్డి, చింతలపాలెం మండల కార్యదర్శి రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## 'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి

కబ్జాకోరుల చెర నుండి ప్రభుత్వ భూములు కాపాడి పేదలకు పంచాలి : తక్కలపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్** : వరంగల్ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఖిలా వరంగల్ మండలం మార్కండేయనగర్ సిపిఐ శాఖ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిపిఐ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ఎన్నికల్లో సత్తా చాటాలని సూచించారు. కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం ఉంటేనే మేలు జరుగుతుందని, ప్రజలు భావిస్తున్నారని, నిత్యం ప్రజాసమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులేనని అన్నారు. కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే సమాజం లో ప్రజలకు రక్షణ ఉంటుందని చెప్పారు. వరంగల్ నగరంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది పేదలను సమీకరించి భూపోరాటాలు నిర్వహించిన సిపిఐ దేనని అన్నారు. బడా బాబుల, కబ్జాకోరుల మధ్య అన్యాక్రాంతమైన, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను పేద ప్రజలకు పంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా కబ్జా కోరులపై, వారికి సహకరించిన సంబధిత అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చెయ్యాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభకు ముందు సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి మహాసభ ప్రాంగణంలో ఎర్ర జెండా ఎగురవేశారు. అనంతరం అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ మహాసభకు సుంకరి భవానీ, నల్లతీగల కుమార్ అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్‌కే బాష్‌మియా, పనాస ప్రసాద్, జిల్లా నాయకులు గన్నారపు రమేష్, లక్ష్మణ్, తాళ్లపెల్లి జాన్‌పాల్ ఓర్సు రాజు, బద్రి, తదితరులు పాల్గొన్నారు.

## మతం పేరుతో ఉన్మాదం చేసే ఎవరైనా ఉగ్రవాదే!

పదిసార్లు పార్టీ మారేవారికి మమ్మల్ని విమర్శించే నైతిక హక్కు లేదు : బాగం

**ప్రజాపక్షం/కూసుమంచి:** భారతదేశంలో స్వాతంత్రానికి ముందు స్వాతంత్రం తరువాత కార్మికులకు, కర్షకులకు ప్రజలకు హక్కులు సాధించి పెట్టడంలో భారత కమ్యూనిస్టు పార్టీతో పాటు ఇతర కమ్యూనిస్టు పార్టీలు కీలకపాత్ర పోషించాయని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు కొనియాడారు. సిపిఐ కూసుమంచి మండల మహాసభ అమరజీవి సంగబత్తుల వెంకటరెడ్డి, పోటు ప్రసాద్ ప్రాంగణం కూసుమంచి మండల కేంద్రంలోని యోగానందం ఫంక్షన్ హాల్‌లో సంగబత్తుల ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. తోలుత మండల కేంద్రంలో పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహాసభల ప్రారంభ సూచకంగా ఏర్పాటు చేసిన అరుణ పతాకాన్ని సిపిఐ సీనియర్ నాయకులు భూక్య మంగ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాగం హేమంతరావు మాట్లాడుతూ, మతం పేరుతో ఉన్మాదం చేసే వాళ్ళు ఉగ్రవాదలతో సమానమని, వంద సంవత్సరాల కాలంలో సిపిఐ పార్టీ లేదా కమ్యూనిస్టు పార్టీలు దేశానికి ఏం చేశాయని కొంతమంది అవివేకులు కళ్ళున్నా చూడలేని కబోదులుగా మాట్లాడుతున్నారని ప్రస్తుత యువతకు కూడా కమ్యూనిస్టు పార్టీ తెలియజెప్పాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రజల కార్మిక కర్షక హక్కుల కోసం అనునిత్యం పోరాటం చేస్తున్న పార్టీ సిపిఐ అన్నారు. సిపిఐతో పాటు ఇతర కమ్యూనిస్టు పార్టీ లు కలిసి పోరాటం చేయటం వల్లనే దేశంలో జమీందారులు, జాకీర్దారుల, పటేల్, పట్వారిల వ్యవస్థలు రద్దయ్య అన్నారు. ఆ వ్యవస్థలో రద్దవటం కారణంగా ఎంతోమంది భూమిలేని కౌలు రైతులకు భూమి లభించింది అన్నారు. దేశ స్వాతంత్రంతో పాటు దేశంలోని ప్రజల హక్కుల ను ఆస్తులను పరిరక్షించడానికి సిపిఐ చేసిన పోరాటం నేటి యువత తప్పక తెలుసుకోవాలన్నారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా మాట్లాడుతూ కమ్యూనిస్టుగా ఉంటే గుండెల నిండా గర్వంగా ఉంటుందన్నారు. బుధవారం కూసుమంచి మండల కేంద్రంలో జరిగిన పార్టీ మండల 6వ మహాసభలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ సత్తా చాటాలని, పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాసంఘాల నాయకులు కృషి చేయాలని సూచించారు.



## కార్మికుల, కర్షకుల పక్షపాతి సిపిఐ

సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి** : కార్మికుల, కర్షకుల బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచేదే సిపిఐ పార్టీ అని, 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ పార్టీ అని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. మంగళవారం కేవెల్ మహేంద్ర భవన్‌లో జరిగిన సిపిఐ రామగిరి మండల మహాసభలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి వై.వి రావు సిఐ జిల్లా మాజీ కార్యదర్శి గౌతం గోవర్ధన్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మార్చి 2026 లోపు దేశంలో మావోయిస్టుల ను లేకుండా మట్టు పెట్టేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను, ఆది వాసీ గిరిజన ప్రజలను మారణ హోమం సృష్టించి చంపుతుందని ఆయన విమర్శించారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అదే విధంగా ఆపరేషన్ కగార్‌ను నిలిపి వే యాలని, ఆరు నెలల పాటు కాల్పులు విరమణ చేశామని మావోయిస్టులు కేంద్ర ప్రభుత్వంకు లేఖ రాశారని, అదేవిధంగా సిపిఐ పార్టీ కూడా కేంద్ర ప్రభు త్వంకు లేఖ రాయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా దేశంలో సిపిఐ పార్టీ ఆవిర్భావం జరిగి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 2025 డిసెంబర్ 26 లోపు సిపిఐ జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ మహాసభలను జరుపుకోవాలని, నూతన నాయకత్వంతో దేశ వ్యాప్తంగా ప్రజల సమస్యల్ని పరిష్కరించడం కోసం ఉద్యమాలు నిర్వహించాలని పార్టీ జాతీయ సమితి నిర్ణయించిందని ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగా ఈ నెల 28న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సిపిఐ జి ల్లా నాలుగవ మహాసభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య సిపిఐ, ఎఐటియుసి నాయకులు జూపాక రామచందర్, తదితరులు పాల్గొన్నారు. రామగిరి మండలం నూతన కమిటీ కార్యదర్శిగా జూపాక రామచందర్,సహాయ కార్యదర్శిగా క్రాంతికార్యవర్గ సభ్యులుగా ఎంఆర్‌సి రెడ్డి, క్రాంతి, డిటి రావు, ఇప్ప గంగాధర్, సాంబశివ రెడ్డి, రంజిత్, మొండయ్య, రాజేందర్, ధర్మయ్యలను ఎన్నుకోవడం జరిగిందని తాండ సదానందం తెలిపారు.

## బునాది కాలువ పనులుపూర్తి చేసి సాగునీరు అందించాలి

గోదా శ్రీరాములు డిమాండ్

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** సిపిఐ మండల 13వ మహాసభ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించగా భారీగా కమ్యూనిస్టులు తరలివచ్చారు. యాస బుచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాట్లాడుతూ పేదల పక్షాన నిలబడి పేదల సమస్యల కోసం పోరాటం చేస్తున్నది కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. మండల పరిధిలోని బునాది కా లువ పనులను త్వరితగతిన పూర్తి చేసి, రైతులకు సాగునీరు అందించాలని, మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన అందరికీ రేషన్ కార్డులను అందజేయాలని, ఇందిర మ్మ ఇండ్లను మంజూరు చేయాలన్నారు. మండల కేంద్రంలో 30 పడకల హాస్పిటల్లో ఏర్పాటు చేసి 24 వైద్య సేవలు అందించాలని, మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కోరారు. రాయిపల్లి, మొరిపిరాల, కొరటికల్, రహీంఖాన్ పేట, కూరెళ్ళ, బిక్కేరు వాగులపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశానికి ముందు ఈ మధ్యకాలంలో చనిపోయిన కమ్యూనిస్టు నాయకులకు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, బోలగాని సత్యనారాయణ, స్వాతంత్ర సమరయోధులు బత్తిని యాదగిరి, రాష్ట్ర చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



## చరిత్రాత్మక బైరాన్‌పల్లి పోరాట స్ఫూర్తిగా ప్రజాఉద్యమాలు

సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్



**ప్రజాపక్షం/మద్దూరు/-ధూల్మిట్ట** : కమ్యునిస్టులు అంటేనే తాడిత పీడిత ప్రజలకు స్వేచ్ఛను అందించే పోరాటాలకు కేంద్రబిందువని, తెలంగాణ విముక్తి కోసం మట్టి మనుషుల చేత బందుకులు పట్టించిన ఘనమైన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) దేనని, చారిత్రాత్మక బైరాన్‌పల్లి నెత్తుటి చరిత్రలో అమరులైన వీరుల పోరాట స్ఫూర్తితో, తాడిత పీడిత ప్రజల పక్షాన ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని సిపిఐ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. మద్దూరు మండల కార్యదర్శి జంగిలి యాదగిరి ఆధ్వర్యంలో మద్దూరు మండల 8వ మహాసభలో సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, స్థానిక నాయకులతో కలసి జిల్లా కార్యదర్శి మంద పవన్ పాల్గొని మాట్లాడుతూ... భారత దేశానికి పోరాటాలలో ఓనమాలు నేర్పింది సిపిఐ అని నాటి నుండి నేటి వరకు ప్రజా సమస్యలపై అలుపేరగని పోరాటం సాగిస్తూ ప్రతి క్షణం ప్రజలపక్షం వైపు సిపిఐ నిలుస్తుందని పవన్, సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్‌లు అన్నారు. అనంతరం సిపిఐ మద్దూరు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ తెలిపారు. మద్దూరు మండల నూతన కార్యదర్శి మరోసారి జంగిలి యాదగిరి ఎన్నిక కాగ, సహాయ కార్యదర్శిగా బోడ కరుణాకర్, కార్యవర్గ సభ్యులుగా అందె పర్శరాములు, ముస్త్యాల సిద్దులు, తుప్పతి రాజు, బింగి పోషయ్య, ఇర్రి బాల్‌రెడ్డి, రాజు, పెంబర్తి సుధాకర్, బొమ్మ రాజయ్య, ఇరుముల్ల కుమార్, వంగపల్లి వెంకటయ్య, సిద్దులు, మల్లేశం పర్శరాం రెడ్డి, కనుకయ్య,మల్లేశం, రాములు, ఎన్నికయ్యారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## డ్రగ్స్‌రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ప్రజాపక్షం/బిజినేపల్లి : డ్రగ్స్‌రహిత సమాజాన్ని నిర్మించాలని, మాదకద్రవ్యాల నిర్మూలన అందరిబాధ్యత అని జిల్లా ఎస్‌పి వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ సూచించారు. పాలెం వ్యవసాయ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్‌పి వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ హాజరై మాట్లాడుతూ చదువుకునే వయసులో యువత చెడువ్యసనాలకు గురికాకుండా క్రమశిక్షణతో మంచి ఆశయాలతో చదువుకొని భవిష్యత్తులో ఉన్నతస్థానానికి చేరుకోవాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటుపడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, మత్తుపదార్థాలు మనుషుల ఆరోగ్యాలను నిర్వీర్యం చేస్తున్నాయని ఎంతో మంది జీవితాలు మధ్యంతరంగా ముగిసిపోతున్నాయని అన్నారు. అవగాహన సదస్సులో మాదకద్రవ్యాల నిర్మూలనపై పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో సిఐ కనకయ్య, ఎస్‌ఐ కె.శ్రీనివాస్, శాస్త్రవేత్తలు ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ శశిభూషణ్, డాక్టర్ ఈటల సత్యనారాయణ, సిబ్బంది బాల్ నర్సింహ్మలు, శ్రీనివాస్‌గౌడ్, నారాయణ, రూప్‌సింగ్, శివ, అంజి, రవి, జితేందర్, మంజుల, అంకిత, రవీందర్ పాల్గొన్నారు.

## మక్తల్ పోలీసులను అభినందించిన ఎస్‌పి



ప్రజాపక్షం/నారాయణపేట్ : మక్తల్ పరిధిలో పలు దొంగతనం కేసులకు సంబంధించి జూన్ నెలలో ఇద్దరు దొంగలను పట్టుకుని జైలుకు పంపించినందున మక్తల్ పోలీసులకు రివార్డ్ అందజేసి మక్తల్ పోలీసులను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు, లింగయ్య, మహేష్, సిఐ రామ్లాల్, రాజేందర్ రెడ్డి, ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి, క్రైమ్ పోలీసులు పాల్గొన్నారు.

## స్నేహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాగులు, పుస్తకాలు పంపిణీ



ప్రజాపక్షం/అడ్డాకుల: అడ్డాకుల మండలం బుధవారం పాఠశాల విద్యార్థులకు స్నేహ ఫౌండేషన్ వారి స్కూల్ బ్యాగులు నోట్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 240 బ్యాగులు, 4850 నోట్ పుస్తకాలు ప్రాథమిక పాఠశాలకు 122 బ్యాగులు, 860 నోట్ పుస్తకాలను స్నేహ ఫౌండేషన్ మేనేజర్ వి.రామేశ్వర్ రెడ్డి, ఎంఈఓ కురుమూర్తి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా స్నేహ ఫౌండేషన్ మేనేజర్ వి.రామేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు కావలసిన వసతులను స్నేహ ఫౌండేషన్ కలిపిస్తుందని మంచి విద్యను అభ్యసించి అత్యధిక మార్కులు సాధించి మీ తల్లిదండ్రులకు మీ పాఠశాలకు మంచిపేరు తేవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



ప్రజాపక్షం/ఊర్కొండ : మండలంలోని గుడిగానిపల్లి గ్రామానికి చెందిన ఎడకుంట్ల చెన్నయ్య అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాదారం మాజీసర్పంచ్, కాంగ్రెస్ మండలపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధ్యాప నిఖిల్‌రెడ్డి మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల ద్వారా రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో మృతుడిభార్య వెంకటమ్మ, కుమారులు శ్రీకృష్ణ, మాజీసర్పంచ్ రజితకృష్ణయ్య, నాయకులు తిరుపతయ్య, నారాయణ, సత్తయ్య, శ్రీను, నర్సింహ్మ, శేఖర్ పాల్గొన్నారు.

## యువత డ్రగ్స్‌కు బానిసకాకూడదు




ప్రజాపక్షం/కల్వకుర్తి : యువత డ్రగ్స్‌కు బానిసకాకూడదని, విద్యలో రాణించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డిఎస్‌పి వెంకట్ రెడ్డి యువతకు సూచించారు. బుధవారం పట్టణంలోని వైఆర్‌ఎం డిగ్రీ కళాశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ప్రభుత్వ పాఠశాలలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి డిఎస్‌పి వెంకట్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ యువత ఎవరు కూడా డ్రగ్స్‌కి బానిస కాకూడదని, భవిష్యత్తులో మంచి విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా ఉత్తమ పౌరులుగా సమాజంలో నిలవాలని అన్నారు. అనంతరం యాంటీడ్రగ్స్ పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మాధవరెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాంరెడ్డి, అధ్యాపకబృందం, ప్రభుత్వ హైస్కూల్ ప్రిన్సిపాల్ ప్రసూన, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం



ప్రజాపక్షం/వంగూర్ : నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిపనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. బుధవారం మండలపరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ అభివృద్ధికమిటిచైర్మన్ ఎనుముల కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన అధికారుల రివ్యూ సమావేశంలో వారు మాట్లాడుతూ కొండారెడ్డిపల్లి గ్రామంలోని రోడ్డు విస్తరణపనులు, మోడల్ స్కూల్ అభివృద్ధి, భూగర్భ విద్యుత్ లైన్, అండర్ డ్రైనేజి వంటి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గానికి కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించుకుంటూ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో వందశాతం విద్యార్థులు నమోదయ్యేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు కృషిచేయాలని పేర్కొన్నారు. గ్రామంలో ఎస్సి కమ్యూనిటి భవనం, లైబ్రరీ, పోస్టాఫీస్, బ్యాంకు సేవలకు కావాల్సిన భవన నిర్మాణానికి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. గ్రామంలోని షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మాణాలకు తగుచర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అభివృద్ధిపనులను పర్యవేక్షించేందుకు అదనపు కలెక్టర్ దేవసహాయంను నియమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ జిల్లా మండలశాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ లబ్ధిదారులు త్వరగా ఇల్లు నిర్మించుకోవాలి

### ఉపాధ్యాయులు అంకిత భావంతో విద్యా బోధనలు చేస్తే మంచి ఫలితాలు : కలెక్టర్ ఆదర్శ్ సురభి



ప్రజాపక్షం/పాన్‌గల్ : వనపర్తి జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్దిదారులు తమ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. బుధవారం పాన్‌గల్ మండలంలోని మాధవరావుపల్లి గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. గ్రామానికి 57 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటివరకు 36 ఇళ్లకు ముగ్గురు పోసి 17 ఇళ్లు స్లాబ్ వరకు పూర్తి అయినట్లు తెలిపారు. ఇళ్లను పరిశీలించిన కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. మిగిలిన వాళ్లు నిర్మాణం ప్రారంభించలేదు. వారికి రద్దు చేసి అర్హత ఉన్న ఇతరులకు సిఫారసు చేయాలని మండల అభివృద్ధి అధికారిని ఆదేశించారు. మాధవరావు పల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ఉన్నప్పటికిని విద్యార్థులకు నాణ్యమైన విద్యాబుద్దులు నేర్పిస్తూ ప్రతి సంవత్సరం 5వ తరగతిలో గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు పొందే విధంగా చూడటంపై ఉపాధ్యాయుడు వీరస్వామిని కలెక్టర్ అభినందించారు. అంతకు ముందు పాన్‌గల్ గ్రామం ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో కొత్తగా చేరిన విద్యార్థులకు కలెక్టర్ అక్షరాభ్యాసం చేయించారు. పాన్‌గల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. 5వ తరగతి వరకు ఉన్న పాఠశాలలో 105 మంది విద్యార్థులు ఉండటం ఇంగ్లీష్ మీడియం ద్వారా నేర్చుకున్న పాఠాలను విద్యార్థులు చక్కగా చెప్పడంపై కలెక్టర్ అభినందించారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో విద్యా బోధనలు చేస్తే ఇలాంటి మంచి ఫలితాలు వస్తాయని కలెక్టర్ ఉపాధ్యాయులను ప్రోత్సహించారు. విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టడం, ప్రైవేట్ పాఠశాలలతో పోటీ పడటం, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. ఉపాధ్యాయుడు వెంకటేష్‌ను సైతం కలెక్టర్ అభినందించారు. పాన్‌గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. గత సంవత్సరం 10వ తరగతిలో ఎంత మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఎంత మంది ఉత్తీర్ణత సాధించారు. పరీక్షలు రాసిన అమ్మాయిలు ఎక్కడ ఉన్నారని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. అమ్మాయిలకు బాల్య వివాహాలు చేసే ప్రమాదం ఉంటుందని అందువల్ల ప్రతి అమ్మాయి జూనియర్ కళాశాలలో చేరే విధంగా చూడాలని సూచించారు. విద్యార్థులు అందరికి అర్థమయ్యే వరకు లెక్కలు ఎలా చేయాలి. లాజిక్ ఎలా అర్థం చేసుకోవాలని భోదించారు. ఈ పాఠశాల నుండి మ్యాథమాటిక్ లో ఒక్క విద్యార్థి ఫెయిల్ కాకుండా విద్యా భోదన చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యా అధికారి మహమ్మద్ అబ్దుల్ ఘని, పిడి డిఆర్డీఓ ఉమాదేవి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సుధారాణి, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ గోవిందరావు, మండల విద్యా అధికారి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# జెడ్‌పి ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

### విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: మహబూబ్‌నగర్ రూరల్ మండలం ధర్మాపూర్ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి బుధవారం తనిఖీ చేశారు. జడ్పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు మెనూ పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం గురించి ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పదవతరగతి గదిని సందర్శించి విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. తరగతి గదిలో సాంఘీక శాస్త్రం బోధన చేస్తున్నారు. బోర్డు పైన ఇండియా మ్యాప్‌లో ఉత్తరదిశలో రాష్ట్రాలు గురించి విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. విద్యార్థులు విద్యార్థినిలతో పాఠశాలలో మధ్యాహ్నం భోజనం ఎలా ఉంది. సౌకర్యాలు ఎలా ఉన్నాయి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో వారు భవిష్యత్తులో ఏ రంగంలో స్థిరపడాలని అనుకుంటున్నారని అడిగారు. తెలుగు భాష చదవడం రాయడంతో పాటు హిందీ, ఇంగ్లీష్, భాషలలో కూడా చదవడం రాయడం నైపుణ్యం సంపాదించాలని విద్యార్థులకు సూచించారు. తర్వాత పిల్లలతో కలిసి కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. డిజిటల్ ఏఐ కంప్యూటర్ ల్యాబ్ బోధన గురించి కంప్యూటర్‌లు బోధన గురించి తెలుసుకున్నారు. రోడ్డుకు అవతలివైపు ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు రోడ్డు దాటి ఏఐ కంప్యూటర్ ల్యాబ్ కు రావడం ఇబ్బందిగా ఉందని కలెక్టర్ దృష్టికి ఉపాధ్యాయులు తీసుకువచ్చారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జడ్పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి.కృష్ణయ్య తదితరులు ఉన్నారు.



### వాహనదారులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

ఉపరవాణా శాఖ కమిషనర్ కార్యాలయం ద్వారా వాహనదారులకు, యజమానులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ మహబూబ్‌నగర్ ఉప రవాణా కమిషనర్ (డిఐసి) కార్యాలయంను సందర్శించారు. డ్రైవింగ్ ట్రాక్‌ను పరిశీలించారు. డ్రైవింగ్ ట్రాక్‌ను ఆధునీకరణ చేయాలని సూచించారు. జప్తు చేసిన వాహనాలు పరిశీలించి వాటిని ఒక క్రమ పద్ధతిలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తుదారులు వేచి ఉండు గదిని సందర్శించారు. అక్కడ వివిధ పనులకు వచ్చిన దరఖాస్తు దారులతో ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలో సేవలు గురించి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం.కిషన్, ఆర్‌టిఓ రఘు కుమార్, ఎంవిఐ వాసుదేవ రావు, తదితరులు ఉన్నారు.

## ఎసిబిలో వలలో కల్వకుర్తి రెండో ఎస్‌ఐ

### భూవివాదంలో స్టేషన్ బెయిల్‌కు రూ.20 వేలు లంచం డిమాండ్
### రూ.10వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఎసిబి అధికారులు



ప్రజాపక్షం/కల్వకుర్తి : భూవివాదంలో కేసులో స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు లంచం తీసుకుంటుండగా కల్వకుర్తి రెండవ ఎస్ ఐ రాంచందర్‌జీని బుధవారం ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెండ్‌గా పట్టుకున్నట్లు ఎసిబి డిఎస్‌పి సిహెచ్ బాలకృష్ణ తెలిపారు. డిఎస్‌పి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.కల్వకుర్తి మండల పరిధిలోని గుండూర్ గ్రామ శివారులో గల ఓ భూవివాదంలో జరిగిన ఘర్షణలో ఫిర్యాదుదారుడు నంబి వెంకటయ్యకు స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు రెండవ ఎఐస్ రాంచందర్‌జీ ఇరవై వేలు లంచం డిమాండ్ చేయగా వాటిలో బుధవారం పది వేలు కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌లో రెండవ ఎస్‌ఐకి ఇస్తుండగా పట్టుకోవడం జరిగిందని డిఎస్‌పి తెలిపారు. లంచం తీసుకుంటూ పట్టుబడిన రెండవ ఎస్‌ఐని గురువారం హైదరాబాద్ నగరంలోని నాంపల్లి ఎసిబి కోర్టులో హాజరుపరుస్తామని డిఎస్‌పి తెలిపారు. లంచం అడిగితే ఎసిబి టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని ఏసిబి డిఎస్‌పి బాలకృష్ణ తెలిపారు.

# యాంటీ డ్రగ్స్ సోల్జర్స్‌గా యువత

### ఎస్పీ యోగేష్ గౌతమ్

ప్రజాపక్షం/నారాయణపేట్ : నేటి యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వాడకాన్ని నిర్మూలించి భావితరాలకు బంగారు బాటలు వేసేందుకు యాంటీ డ్రగ్స్ సోల్జర్స్‌గా పనిచేయాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ అన్నారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు అందరం కలిసికట్టుగా ముందుకు సాగాలని ముఖ్యంగా యువత భాగస్వామ్యం ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ వారోత్సవాలలో భాంగా బుధవారం డీడబ్ల్యుఓ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ నేతృత్వంలో జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో కలక్టరేట్, పోలీస్ ప్రెస్, డిడబ్ల్యుఓ మొత్తం నాలుగు జట్లు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఎస్పీ, అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. అనంతరం ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా కలెక్టరేట్ పోలీస్ టీం ల మధ్య ప్రారంభ మ్యాచ్‌ను ఎస్పీ, అదనపు కలెక్టర్ టాస్ వేసి ప్రారంభింపజేశారు. మొదట బ్యాటింగ్ చేసిన పోలీసు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 91 పరుగులు లక్ష్యంతో బలిలోకి దిగిన కలెక్టరేట్ జట్టు 7 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. ఆ తర్వాత ప్రెస్, డీడబ్ల్యు జట్ల మధ్య జరిగిన రెండో మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన ప్రెస్ టీమ్ నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఏకంగా 148 పరుగుల భారీ లక్ష్యాన్ని విధించా, డిడబ్ల్యుఓ జట్టు కేవలం 76 పరుగులు మాత్రమే చేసి ఓడిపోయింది. చివరగా మొదటి మ్యాచ్‌లో గెలిచిన పోలీస్ జట్టు, రెండో మ్యాచ్‌లో గెలిచిన ప్రెస్ జట్టు తుది పోరులో తలపడ్డాయి. మొదటి బ్యాటింగ్ చేసిన ప్రెస్ జట్టు పది ఓవర్లలో 49 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని పోలీస్ జట్టు ముందు ఉంచింది. అయితే పోలీస్ జట్టు 5 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు కోల్పోయి విజయాన్ని సొంతం చేసుకుంది. గెలుపొందిన విన్నర్, రన్నర్ జట్లకు జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్, అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డిపిఆర్ఓ ఎం.ఎ. రషీద్ కప్‌లను అందజేసి ఇరు జట్లను అభినందించారు. డిఎస్పీ నల్లపు లింగయ్య, ఆర్ ఐ నరసింహ, డివైఎస్ఓ వెంకటేష్, స్థానిక ఎస్ఐ వెంకటేశ్వర్లు, కలెక్టరేట్, పోలీసు, డిడబ్ల్యుఓ, మీడియా మిత్రులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## సిపిఐ మండల కార్యదర్శిగా పి.కృష్ణాజి




ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బిజినేపల్లి మండల కార్యదర్శిగా పి.కృష్ణాజి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల 18వ మహాసభలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాల్‌నర్సింహ సమక్షంలో ఎన్నికలను నిర్వహించారు. ఈసందర్భంగా పి.కృష్ణాజి మాట్లాడుతూ నాపై నమ్మకంతో మండలకార్యదర్శిగా రెండోసారి అవకాశం ఇవ్వడంతో నాపై ఎంతోబాధ్యత పెరిగిందన్నారు. రెండోసారి ఎన్నికకావడం ఎంతో శుభపరిణామం అన్నారు.

## అర్హులకే ఓటరు నమోదు చేపట్టాలి

ప్రజాపక్షం/బిజినేపల్లి : 18 సంవత్సరాలు నిండిన అర్హులకే ఓటరు నమోదు చేపట్టాలని బిఎల్‌ఓలకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించినట్లు తహసీల్దార్ మునీరుద్దిన్ తెలిపారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బిఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఓటరుజాబితాలో డబుల్ ఎంట్రీలను తొలగించడంతోపాటు తప్పులను సరిచేయడం, ఒకప్రాంతం నుంచి మరోప్రాంతానికి ఓటుహక్కు మార్పిడికి సంబంధితఫారాలను అభ్యర్థులనుంచి రాతపూర్వకంగా తీసుకొని మార్పులు, చేర్పులు చేపట్టాలని తెలిపారు. సంబంధిత ఫారాలను అభ్యర్థుల నుంచి రాతపూర్వకంగా తీసుకొని మార్పులు, చేర్పులుచేపట్టాలని తెలిపారు. ఆయనవెంట నాయబ్ తహసీల్దార్ చిక్కుడు రవికుమార్, ఎంఆర్‌ఐ బాలరాజు, సీనియర్ అసిస్టెంట్ భారతిబాయి, రికార్డుఅసిస్టెంట్ భగవంతుసాగర్, ఆయాగ్రామాల బిఎల్‌ఓలు ఉన్నారు.

# డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై నేడు ర్యాలీ



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంలో భాగంగా డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై నేడు (గురువారం) విద్యార్థులతో ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని మిని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన డ్రగ్స్, మత్తు పదార్థాల నియంత్రణపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్ 2025లో నషా ముక్త్ భారత్‌లో భాగంగా జూన్ 20 నుండి జూన్ 26వ తేదీ వరకు వారం రోజుల పాటు వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టినట్లు, నేడు ఉదయం 9 గంటలకు మహబూబ్ నగర్ స్టేడియం గ్రౌండ్ నుండి తెలంగాణ చౌరస్తా వరకు విద్యార్థిని, విద్యార్థులతో పెద్ద సంఖ్యలో మాదకద్రవ్యాల వినియోగం, మత్తు పదార్థాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీనీ నిర్వహించాలని అన్నారు. యాంటీ డ్రగ్ కమిటీ పాఠశాలలు, కళాశాలలు, మెడికల్ కాలేజీలలో ఎవరైనా డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం, రవాణా ఉంటే వారిని గుర్తించాలని. పాఠశాలలు, కళాశాలలు, మెడికల్ కాలేజీలలో మత్తు పదార్థాల నియంత్రణ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. గంజాయి సాగు చేయకుండా ఎక్సైజ్‌శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. కళాశాలకు వస్తున్న విద్యార్థులు ఎం చేస్తున్నారో వారి తల్లిదండ్రులు గుర్తించలేరని, కానీ విద్యార్థులలో చదువులో, డ్రెస్సింగ్ విధానాన్ని బట్టి వారిలో మార్పులను ఉపాధ్యాయులు గుర్తించగలరని అన్నారు. విద్యార్థులలో మత్తు పదార్థాల బారిన పడిన వారిని గుర్తించినట్లయితే వెంటనే మాకు సమాచారం అందిస్తే మత్తు పదార్థాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటామని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయని జిల్లా ఎస్పీ అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, అదనపు ఎస్పీ ఎన్‌బి రత్నం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా వెల్ఫేర్ అధికారిని జరీనా బేగం, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాల్‌లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రానికి పంపించండి



ప్రజాపక్షం/ధన్వాడ : ధన్వాడ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ విద్య చదువుతున్న 2,3 సంవత్సరాల విద్యార్థులను, వివిధ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు తల్లిదండ్రులను బలవంతంగా ఒత్తిడి చేస్తూ ప్రైవేట్ పాఠశాలలో చేర్పించుకుంటున్నారని. ఈవిధంగా చేయడం వల్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ విద్య అభ్యసించే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని తద్వారా తాము అధికారులతో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ధన్వాడ అంగన్వాడీలు తమ గోడును ఎంఈఓకు వెళ్లబుచ్చారు. ఈ అంశంపై ప్రైవేట్ పాఠశాలల ఆగడాలను అడ్డుకోకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాణి, శారద, భూదేవి, శాంత, సంతోష, శ్రీలక్ష్మి, సావిత్రమ్మలు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

### ఎస్‌పి రావుల గిరిధర్




ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : విద్యార్థుల దృష్టి తమ భవిష్యత్తు జీవిత లక్ష్యంపై మాత్రమే ఉండాలని, నిషేదిత గంజాయి డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వాడకం పట్ల విద్యార్థులు, యువత ఆకర్షితులు కావద్దని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవాలలో భాగంగా జేఎస్.రాములు ఫౌండేషన్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్‌ను బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి డ్రగ్స్ అలవాటు వలన శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పాడు చేస్తుందని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన గంజాయి రహిత ప్రాంతమే లక్ష్యంగా వనపర్తి పోలీసు కృషి చేస్తోందని, విద్యా సంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మత్తుకు బానిస అవడానికి అనేక కారణాలు ఉంటాయి. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మిన, సరఫరా చేసిన, సేవించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలు, గంజాయి వాడకంపై వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పీ, ఇంచార్జీ అదనపు ఎస్పీ, ఉమామహేశ్వరరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్, అప్పలనాయుడు, ఏహెచ్‌టియూ ఎస్‌ఐ అంజద్, నిర్వాహకులు జె.సతీష్ రాజు, మహిమరాజు, సంతోష్, రాజు, రవికుమార్ పాల్గొన్నారు.

## దాడిచేసిన వ్యక్తులపై చర్యలు




ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : తిమ్మాజిపేట మండలం చేగుంట గ్రామంలో చేతబడి నెపంతో దళిత గడ్డం కృష్ణయ్యపై దాడి చేసి చెప్పుల దండ మెడలో వేసి నెత్తిన చెప్పుపెట్టి ఊరేగించి చిత్రహింసలకు గురిచేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని అన్నిరకాలుగా ఆదుకోవాలనికోరుతూ బుధవారం జిల్లా ఎస్‌పి వైభవ్‌గైక్వాడ్ రఘునాథ్, కలెక్టరేట్ పరిపాలన అధికారి చంద్రశేఖర్‌కు దళితహక్కుల పోరాటసమితి ఆధ్వర్యంలో బాధితులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆసంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొమ్ముభరత్, బండిలక్ష్మి పతి మాట్లాడుతూ ఈఘటన అత్యంత అమానవీయం, అటవికం, అమానుషం అన్నారు. శనివారం సాయంత్రం ఘటన జరిగితే ఇప్పటికి ఎలాంటి చర్యలు రెవెన్యూ, పోలీసుయంత్రాంగం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బాధితుడు గడ్డంకృష్ణయ్య, డిహెచ్‌పిఎస్ నాయకులు ఊశన్న, బండి శ్రీను, కృష్ణయ్య, నాగయ్య ఉన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## జోగులాంబ బాలబ్రహ్మేశ్వరుడి దర్శించుకున్న ఎఐసిసి కార్యదర్శులు



**ప్రజాపక్షం/ఉండవెల్లి:** దక్షిణకాశిగా ప్రసిద్ధిగాంచిన జోగులాంబ బాలబ్రహ్మేశ్వంద్ర ఆలయాలను తెలంగాణ ఇంచార్జి ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ అల్లంపూరు మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి ఎస్.సంపత్‌కుమార్ ఫైనాన్స్ కమిషనర్ దీపక్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్ గురువారం నాడు అల్లంపూరు ఆలయంలో సందర్శించి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మొదటగా జోగులాంబ బాలబ్రహ్మేశ్వర దర్శించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కార్యనిర్వహణ అధికారి సురేందర్ కుమార్, చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.



## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

### సిపిఐ డిండి మండల మహాసభను జయప్రదం చేయండి పల్లా నర్సింహారెడ్డి

**ప్రజాపక్షం/డిండి:** అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వాలని ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3, ఎల్ 4 వంటి నిబంధనలు చూడకుండా అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం కేటాయించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం డిండి మండల సిపిఐ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నర్సింహారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం దిశగా ప్రభుత్వ పథకాలు ప్రజా పాలనలో ప్రజలందరికీ చేరువవ్వాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను పొందేలా ప్రభుత్వం, అధికారులు ఆచరణలో అమలు చేయాలని అన్నారు. వీలైనంత త్వరగా డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) డిండి మండల 15వ మహాసభలు జూన్ 29న డిండి మండల కేంద్రంలోని ఎలకుర్తి జైపాల్ గార్డెన్‌లో జరగనున్నాయని అన్నారు. ఈ మహాసభల విజయవంతానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, జిల్లా సమితి సభ్యులు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనొద్దీన్, మండల కార్యదర్శి కనకాచారి, మండల సహాయ కార్యదర్శి శైలేష్, విజేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు కేశవులు, హుస్సేన్, శ్రీనయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజం కోసం యువత సైనికుల్లా పనిచేయాలి

### నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్

**ప్రజా పక్షం/ నల్లగొండ టౌన్ :** డ్రగ్స్ రహిత సమాజం కోసం యువత యాంటీ డ్రగ్ సోల్జర్‌గా పని చేయాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యాంటీ డ్రగ్ అవగాహన వారోత్సవాలలో భాగంగా బుధవారం పట్టణంలోని చిన్న వెంకట్ రెడ్డి పంక్షన్ హాల్‌లో మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించి అనంతరం యువత చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ, యువత తమ శక్తియుక్తులను డ్రగ్స్ మాయలో పడి వృథా చేసుకోకూడదని, ఒక్కసారి డ్రగ్స్ వాడితే అది మెల్లమెల్లగా వ్యసనంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సంతోషం కొరకు సేవించడం అలవాటుగా పడి డ్రగ్స్ బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు. డ్రగ్స్ మీద పోలీసులు చేస్తున్న పోరాటంలో యువత పాలుపంచుకోవాలని, డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండడంతో పాటు, తమ దృష్టికి నిషేధిత డ్రగ్స్ సరఫరా ,వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని తక్షణమే తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి రమేష్, నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి, టూటౌన్ సిఐ రాఘవరావు, వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, టు టౌన్ ఎస్సై సైదులు, వివిధ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

## 30న హైదరాబాద్‌లో కవులు, కళాకారుల సదస్సు





**ప్రజాపక్షం/భువనగిరి :** ఈ నెల 30న హైదరాబాదులో ప్రజా నాట్యమండలి రాష్ట్ర స్థాయిలో జరుగే కవులు, కళాకారుల సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కే.శ్రీనివాస్ అన్నారు. భువనగిరిలోని యాదాద్రి భువనగిరి జిల్లా ఆఫీసులో ప్రజానాట్య మండలి సమావేశం అధ్యక్షులు పిట్టల శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కే.శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కళాకారులకు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదని తెలిపారు. కళాకారులను ఆదుకోలేదని అనేక వాగ్దానాలు చేసి కళాకారుల ఆశయాలను తుంగలో తొక్కారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలు దాటుతున్న ఇప్పటికైనా కళాకారులకు ఉద్యోగాలు, ఉపాధి గుర్తింపు కార్డులు, రవాణాచార్జీలు ఏర్పాటు చెయ్యాలని చెప్పారు. తెలంగాణ ప్రజానాట్యమండలి యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ మాట్లాడుతూ యాదాద్రి జిల్లాలో కవులు కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు పోతు ప్రవీణ్, కట్ల యాదగిరి, ఇంజా హేమలత, మూల పోచయ్య, చౌదరి, రాజప్ప, రాములు, సరిత, లక్ష్మి యాదమ్మ, అన్యమైన వెంకటేశం, సిపిఐ మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య, నారాయణ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

### ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నారాయణ, శ్రీ చైతన్య ఇతర ప్రైవేటు విద్యాసంస్థలలో పుస్తకాలను ఇష్టానురాజ్యంగా అమ్ముతూ విద్యార్థుల దగ్గర అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ ఆరోపించారు. ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండ పట్టణంలోని నారాయణ పాఠశాలలో అక్రమంగా అమ్ముతున్న పుస్తకాలను పట్టుకోని అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పుస్తకాల అమ్మకూడదు అని ఉన్నప్పటికీ పుస్తకాలు అమ్మడంతో విద్యార్థుల దగ్గర దోచుకుంటున్నారని ఆరోపించారు. కార్పొరేట్ విద్యాసంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యాసంస్థలలో పుస్తకాలు యూనిఫామ్ లు అమ్మడాన్ని నియంత్రించకపోతే దాడులు చేస్తామని హెచ్చరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో పట్టణ కార్యదర్శి గాదపాక సూర్య తేజ,గోపగోని ఉదయ్,గాత్రి క్,వాసు,నవీన్,మహేష్ తదితరులు ఉన్నారు.

# విద్యార్థులకు మెరుగైన విద్య

### ప్రతి పాఠశాలలో 60 రోజుల కార్యాచరణ తప్పక అమలు చేయాలి

### కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట:** విద్యార్థులకు మెరుగైన విద్య బోధించాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలను కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి గదిలో జరుగుతున్న గణితం క్లాస్‌ని, 9వ తరగతిలో జరుగుతున్న బేస్ లైన్ టెస్టులను సందర్శించి విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. 60 రోజుల కార్యచరణ ప్రతి పాఠశాలలో అమలు చేసి ఆగస్టు 15 నాటికి జిల్లాలో తెలుగు చదవటం, రాయడం రాని వారు ఉండవద్దని, బుక్ డిపో, కంప్యూటర్, ల్యాబ్ లను పరిశీలించారు. కంప్యూటర్ లకి లేవని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. తదుపరి వంట చేస్తున్న సిబ్బందిని ఏమైనా సమస్యలు ఉన్నాయా అడి అడగ్గా వంట గది కావాలని తెలపగా వెంటనే ప్రతి పాదనలు పంపాలని సూచించారు. చర్చి కంపౌండ్‌లో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి స్టాక్ రిజిస్టర్, హాజరు రిజిస్టర్ వివరాలు పరిశీలించారు. పాలు, గుడ్లు నాణ్యత పరిశీలించి, ప్రతిరోజు పిల్లలకి నాణ్యమైన పోషకాహారం సమయం ప్రకారం అందించాలని సూచించారు. పిల్లలను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయాలను సందర్శించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవిన్యూ సదస్సులలో స్వీకరించిన ఆర్జీలను క్షుణంగా పరిశీలించి రికార్డులు పరిశీలించి భూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాదవ్‌రావు, తహసిల్దార్ కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయులు పద్మ, ఉపాధ్యాయులు, సునీత, విస్వజ్ఞచారి, అధికారులు, అంగన్‌వాడీ టీచర్ పద్మ పాల్గొన్నారు.



## పాఠశాలలో మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం

### యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** పాఠశాలలో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యను బోధించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాణ్యమైన భోజనం అందిస్తేనే జ్ఞాపక శక్తి పెరిగి విద్యార్థులు మంచిగా చదువుతారని అన్నారు. అనంతరం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న విధానాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించి విద్యార్థులతో మాట్లాడుతూ ఇప్పటినుండే పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవ్వాలనే ఒక ప్రణాళిక వేసుకొని చదివినవి మర్చిపోకుండా రివిజన్ చేసుకుంటూ మంచిగా చదవాలని విద్యార్థులకు హిత బోధ చేశారు. పదవ తరగతి అనేది జీవితంలో ముందుకు పోవడానికి తొలి మెట్టు కాబట్టి మంచిగా చదువుకోని ఉన్నత శిఖరాలను అధి రోహించాలన్నారు. ఇష్టంతో కష్టపడి చదివితే తప్పనిసరిగా మంచి మార్కులతో ఉతీర్ణులవుతారని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆండాలు, సిబ్బంది ఉన్నారు.

# రెవెన్యూ సదస్సులో దరఖాస్తులకు పరిష్కారం

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** భూ భారతి రెవిన్యూ సదస్సులో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు మండల తహసీల్దార్‌లను ఆదేశించారు. బుధవారం మినీ మీటింగ్ హాల్ మండల తహసీల్దార్‌లతో భూ భారతి రెవిన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధించిన అన్ని దరఖాస్తులను క్లియర్ చేయాలని అన్నారు. అన్ని మాడ్యుల్స్‌లో దాఖలైన భూ భారతి దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపాలి అన్నారు. భూ భారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.సక్సేషన్, పెండింగ్ మ్యూ ్ఛ, డేటా కరెక్షన్ వంటి దరఖాస్తులను అవసరమైన రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని,దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన తర్వాతే పరిష్కరించాలని అన్నారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను మండల తహసీల్దార్ లాగిన్ లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ జరపాలన్నారు.అవసరమైన రికార్డులను కూడా క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. రెవిన్యూ పరంగా ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, రెవిన్యూ డివిజనల్ అధికారులు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, మండల తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సూర్యాపేటగా మారుద్దాం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** డ్రగ్స్ రహిత సూర్యాపేటగా మారుద్దామని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని సెల్ఫీ పాయింట్ వద్ద ఫోటోలు దిగిన కలెక్టర్, ఎస్‌పి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, వ్యతిరేక దినోత్సవం సందర్భంగా డ్రగ్స్ రహిత సూర్యాపేట లక్ష్యంగా ముందుకు సాగుతున్న క్రమంలో మత్తు పదార్థాలను అరికట్టేందుకు ప్రజలు, యువత, విద్యార్థులు కలిసికట్టుగా ముందడుగు వేయాలని అన్నారు. డ్రగ్స్‌బారీన పడకుండా పోలీసుశాఖ చేస్తున్న కృషి అభినందనీయమని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా ఐయామ్ యాంటీ డ్రగ్ సోల్డర్ అనే సెల్ఫీ పాయింట్ వద్ద కలెక్టర్, ఎస్‌పి లు ఇతర అధికారులు, సిబ్బంది ఫోటోలు దిగారు. ప్రతి అధికారి సెల్ఫీ పాయింట్ వద్ద ఫోటోలు దిగి మాధ్యమాలలో యువతకు అవగాహన కలిగేలా పెట్టాలని విస్తృత ప్రచారంలో అందరు పాల్గొన్నాలని కలెక్టర్ , ఎస్‌పి లు కోరారు. నేడు జరగబోయే ర్యాలీలో అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## చెల్లని చెక్కు కేసులో ఒకరికి జైలుశిక్ష

**ప్రజాపక్షం/కోదాడ:** తాను తీసుకున్న అప్పు కింద చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో ఒకరికి ఆరునెలల జైలుశిక్ష విధిస్తూ కోదాడ ప్రిన్సిపల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్టేట్ తీర్పు వెలువరించారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడకు చెందిన శ్రీరామ్‌కృష్ణ అనే వ్యక్తి నుండి ఉల్లేందుల శంకర్ అనే వ్యక్తి తన అవసరాల నిమిత్తం డబ్బు అప్పుగా తీసుకున్నాడు. ఆ అప్పు తిరిగి చెల్లించాలని కృష్ణ కోరగా పట్టించుకొని శంకర్ చివరకు 3లక్షల 50వేల రూపాయలకు చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కు బ్యాంకులో చెల్లకపోవడంతో కృష్ణ కోర్టును ఆశ్రయించాడు. ఈ కేసును విచారించిన ప్రిన్సిపల్ జ్యూడిషయల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్టేట్ కె.భవ్య బుధవారం తీర్పు వెలువరించారు. ఇచ్చిన చెక్కు తాలుకా 3లక్షల 50 వేలు కృష్ణ ఇవ్వాలని, చెల్లని చెక్కు ఇచ్చినందుకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో కృష్ణ తరుపున న్యాయవాది దేవబత్తిని నాగార్జునరావు తన వాదనలు వినిపించారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

### 60 సంవత్సరాల మహిళ కడుపులో నుండి 6 కిలోల కణితి తొలగింపు





**ప్రజాపక్షం /నల్లగొండ ప్రతినిధి :** ఇటీవలే నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ల బృందం బుధవారం మరో అరుదైన శస్త్ర చికిత్సను నిర్వహించారు. జిల్లాలోని పర్వేదుల గ్రామానికి చెందిన 60 సంవత్సరాల మహిళ గత రెండు సంవత్సరాలుగా కడుపు నొప్పితో బాధపడుతు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధానాస్పత్రికి వైద్యం నిమిత్తం వచ్చింది. ఆస్పత్రిలోని వైద్యులు ఆ మహిళకు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆమె కడుపులో కణతి ఉన్నట్లు గుర్తించారు. మహిళ కుటుంబ సభ్యుల సమ్మతితో బుధవారం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఆ మహిళకు ఆపరేషన్ చేసి సుమారు 6 కిలోల బరువున్న 30 30 సెంటిమీటర్లు కలిగిన కణతిని తొలగించారు. ఈ అరుదైన శాస్త్ర చికిత్సలో సర్జన్ల బృందం డాక్టర్ శ్రీకాంత్ వర్మ, డాక్టర్ నిఖిత ,డాక్టర్ వంశీ, డాక్టర్ దివ్య, అనస్తీషియా బృందం డాక్టర్ బద్రి నారాయణ ,డాక్టర్ నవీన్, డాక్టర్ సుధా, డాక్టర్ గిరి, డాక్టర్ శ్వేత లు సుమారు నాలుగైదు గంటల పాటు శ్రమించి ఈ కణతిని తొలగించారు.ప్రస్తుతం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో అత్యంత అదునాతన వైద్య పరికరాలు ,వైద్య సదుపాయాలు,డాక్టర్లు ఉన్నందున ఇలాంటి ఆపరేషన్లు నిర్వహించగలుగుతున్నామని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ అరుణకుమారి తెలిపారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఇలాంటి అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా చేసిన డాక్టర్ల బృందాన్ని ఆమె అభినందించారు.

## 30 వరకు ఆసరా పింఛన్లు పంపిణీ

**ప్రజాపక్షం / నల్లగొండ టౌన్:** జిల్లాలో వివిధ రకముల చేయూత ఆసరా పింఛన్లు జూన్30 వరకు పంపిణీచేస్తున్నట్లు డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి తెలిపారు. పింఛన్లు పొందుతున్న పింఛన్‌దారులు వృద్దాప్య, వితంతు, వికలాంగుల, చేనేత, కల్లుగీత, ఒంటరి మహిళలు మీ ప్రాంతంలో ఉన్నటువంటి పోస్ట్ ఆఫీస్ ద్వారా పింఛను మొత్తము నేరుగా పొందవలన్నారు. ఎవరు కూడ మధ్య దళారీలను నమ్మ వద్దన్నారు. పింఛను పొందుటకు ఎటువంటి సొమ్ము చెల్లించవలసిన అవసరము లేదాని పింఛను మొత్తము సొమ్ము రూ.16 తో సహా అడిగి తీసుకోవాలని సూచించారు.

## బాల్య వివాహాలు చేసుకుంటే సమస్యలు వస్తాయ్

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బాలబాలికలు సరైన వయస్సు రాకముందే వివాహాలు చేసుకుంటే సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం మండలంలోని దుబ్బతండా బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలకు ఆడపిల్లల సాధికారత గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలు 18 సంవత్సరాలు, అబ్బాయిలు 21 సంవత్సరాలు నిండకముందే వివాహాలు చేసుకుంటే వివిధ రకాల సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. పిల్లలు మానసిక పరిపక్వత కలిగి ఉండాలని అన్నారు. సమాజంలో సమస్యల గురించి వివరించి వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. బాలికలకు సేఫ్ టచ్ అన్‌సేఫ్ టచ్ గురించి అవగాహన కల్పించి పిల్లలు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని, బాలికలు ఎదుర్కొనే రుతుక్రమ సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండి వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని వివరించారు. బాలికలు శ్రద్ధగా చదువుకోని ఉన్నతమైన ఉద్యోగాలు పొంది, లక్ష్యాలను సాధించే దిశగా అడుగులు వేయాలని అవగాహన కల్పించారు. జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల కలిగే నష్టాలను, సీజనల్ వ్యాదులు పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో డీడబ్లువో కృష్ణవేణి, సీడీపీవో మమత, ఆయుర్వేదిక్ డాక్టర్ హేమాంజలి, ఐసీపీఎస్ వెంకన్న, డిస్ట్రిక్ట్ ప్రెషరీ ఆఫీసర్ సరిత, ఎంఈవో బాలు, ఎడ్యుకేషన్ ఆఫీసర్ సరస్వతి, వైద్యులు రవికుమార్, మోయిద్, సూపర్‌వైజర్లు వాణి, నజీమాబేగం, పద్మ, లీలాకుమారి, నాగమణి, ప్రిన్సిపాల్ ఉమాదేవి, గణేష్, ఆశ్రిత, కవిత, చినరాయుడు, కవిత, సక్కు, భవాని తదితరులు పాల్గొన్నారు.





# నల్లగొండలో భారీ అగ్నిప్రమాదం

### షాట్ సర్క్యూట్‌తో మెడికల్ ఏజెన్సీ భవనం దగ్ధం..

### సుమారు రూ. కోటి ఆస్తినష్టం!





**ప్రజాపక్షం /నల్లగొండ ప్రతినిధి :** నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రకాశం బజార్‌లో గల సాయిరాం మెడికల్ ఏజెన్సీ భవనంలో షాట్ సర్క్యూట్‌తో మంటను చెలరేగి మందులతో పాటు విలువైన పరికరాలు దగ్ధమైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. సుమారు కోటి రూపాయలు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. సంఘటన పై స్థానికులు,ఏజెన్సీ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం భువనేశ్వర్, అశోక్, ఆనంద్ లు కలిసి డిస్ట్రిబ్యూటర్ గా ఏర్పడి పట్టణంలోని ప్రకాశం బజార్ లో ఉన్న సాయిరాం మెడికల్ ఏజెన్సీని నిర్వహిస్తున్నారు. మెడికల్ ఏజెన్సీ భవనంలో కొన్ని సంవత్సరాలుగా వివిధ రకాల మందులను నిల్వ చేసి పలు మెడికల్ షాపులకు సరఫరా చేస్తున్నారు. అయితే రోజువారిగానే బుధవారం ఉదయం 9 గంటలకు గదులను శుభ్రం చేయడం నిమిత్తం ఏజెన్సీ నిర్వాహకులలో ఒకరు భువనేశ్వర్ ఓపెన్ చేసి బయటికి వచ్చారు. ఈ సందర్భంలో భవనం వెనుక భాగం నుండి ఒక్కసారిగా మంటలు చెల్లరేగడంతో అక్కడున్న నిర్వాహకుడు లోపల ఉన్న కంప్యూటర్లో హార్డ్ డిస్క్ ను తీసుకొచ్చే క్రమంలో అతనికి గాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. వారు వెంటనే స్పందించి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ఫైర్ ఇంజన్ తో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించగా మంటలు అదుపు కాకపోగా మరింతగా మంటలు చెలరేగడంతో ఫైర్ సిబ్బంది అదనంగా మరో మూడు నాలుగు ఫైర్ ఇంజన్ లను తీసుకొచ్చి సుమారు 50 మంది ఫైర్ సిబ్బం ది మంటలను ఆర్పేందుకు దాదాపుగా నాలుగు ఐదు గంటల వరకు ప్రయత్నం చేశారు. చివరికి మంటలు అదుపులోకి వచ్చాయి. దగ్ధమైన ఏజెన్సీ భవనం పక్కన హాస్పిటల్స్ . నివాస గృహాల తో పాటు పలు షాపులు కూడా ఉన్నప్పటికీ ఫైర్ సిబ్బంది చాకచక్యంగా చుట్టూ పక్కల వారికి ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా వ్యవహరించడంతో ఎలాంటి ప్రాణ హాని గాని ఆస్తి నష్టం కాని జరగలేదు. దీంతో పక్కనే ఉన్న ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ భారీ అగ్ని ప్రమాదంలో విలువైన మందులు, కంప్యూటర్స్, ఫర్నిచర్ పూర్తిగా దగ్ధం కావడంతో సుమారు కోటి రూపాయల కు పైగానే నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అగ్ని ప్రమాదం ఏ విధంగా సంభవించింది దీనికి గల కారణాలేంటి అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.



# రీల్

## సయారా నుంచి 'హమ్‌సఫర్' పాట విడుదల



యష్ రాజ్ ఫిలిమ్స్ నిర్మాణంలో మోహిత్ సూరి దర్శకత్వంలో 'సయారా' చిత్రం రూపు దిద్దుకుంటున్న సంగతి తెలిసిందే. అహాన్ పాండే, అనీత్ పద్దా జంటగా తెరకెక్కిన 'సయారా' ఆల్బమ్‌లోని నాల్గవ పాట హమ్‌సఫర్‌ను విడుదల చేశారు. ఇప్పటివరకు ఈ చిత్రంలోని మూడు పాటలు విడుదల చేయగా అవన్నీ చార్ట్ బస్టర్‌లుగా నిలిచాయి. సయారా టైటిల్ ట్రాక్, జుబిన్ నౌటియాల్ పాడిన బర్బాద్ సాంగ్, విశాల్ మిశ్రా ఆలపించిన తుమ్ హో తో పాటలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఇప్పుడు సంగీత ద్వయం సచెట్‌పరంపర పాడిన మరో రొమాంటిక్ పాటను రిలీజ్ చేశారు.

## డ్యూడ్ పోస్టర్ రిలీజ్



వరుస విజయాలతో దూసుకుపోతున్న యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ ప్రస్తుతం మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'డ్యూడలో నటిస్తున్నారు. కీర్తిశ్వరన్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతుంది. ప్రదీప్‌కు జోడీగా 'ప్రేమలు' ఫేమ్ మమిత బైజూ కథానాయికగా నటిస్తుండగా, సీనియర్ నటుడు శరత్ కుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే రిలీజైన ప్రదీప్ రంగనాథన్, మమిత బైజూకు ఫస్ట్ లుక్ పోస్టర్స్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మమిత బైజూ బర్త్ డే సందర్భంగా ఆమె పాత్రని 'కురళ్'గా పరిచయం చేస్తూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు.



## డొక్కా సీతమ్మ విజయాన్ని సాధించాలి

మురళీ మోహన్, ఆమని ప్రధాన పాత్రధారులుగా ఉషారాణి మూవీస్ బ్యానర్ మీద వల్లూరి రాంబాబు, మట్టా శ్రీనివాస్ నిర్మాతలుగా టి.వి.రవి నారాయణ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ'. ఈ చిత్రానికి రాహుల్ శ్రీవాత్సవ్ కెమెరామెన్‌గా పని చేశారు. కార్తిక్ కోడకండ్ల సంగీతాన్ని అందించారు. ఎం.రవి కుమార్ ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేశారు. సీనియర్ నటుడు మురళీ మోహన్ బర్త్ డే సందర్భంగా ఈ చిత్రం నుంచి స్పెషల్ పోస్టర్‌ను, గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మురళీ మోహన్ మాట్లాడుతూ.. 'నా పుట్టిన రోజుని ఎప్పుడూ కూడా ఆశ్రమాల్లో చేసుకుంటూ ఉంటాను. దివ్యాంగులు, వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాల్లో సెలెబ్రేట్ చేసుకుంటూ ఉంటాను. కానీ ఓ అరగంట వచ్చి వెళ్లండని 'డొక్కా సీతమ్మ' టీం పిలిచింది. అందుకే ఇలా వచ్చాను. చిన్న నిర్మాతలే అయినా నా బర్త్ డేను ఇలా సెలెబ్రేట్ చేస్తున్నందుకు థాంక్స్. రేలంగితో నా అనుబంధం మరువలేనిది. డొక్కా సీతమ్మ మీద సినిమా తీయాలని చాలా మంది అనుకున్నారు. కాటన్ దొర సైతం డొక్కా సీతమ్మని పొగిడారు. సన్మానం చేస్తామని లండన్‌కు రమ్మని పిలిస్తే సైతం డొక్కా సీతమ్మ వెళ్లలేదు. 'నేను అక్కడికి వస్తే ఇక్కడ వారి ఆకలి ఎవరు తీరుస్తారు?' అని డొక్కా సీతమ్మ మ నిరాకరించారు. అలాంటి ఓ గొప్ప మనిషి మీద సినిమాను తీస్తుండటం ఆనందంగా ఉంది. ఇప్పుడు అంతా కమర్షియల్‌గా మారింది. అలాంటి టైంలో రాంబాబు, రవి నారాయణ ముందుకు వచ్చారు. ఇలాంటి చిత్రాలు పెద్ద విజయాన్ని సాధించాలి' అని అన్నారు. దర్శకుడు టి.వి. రవి నారాయణ్ మాట్లాడుతూ.. ఈ కథను చేయాలని మురళీ మోహన్ చెప్పిన క్షణం నుంచీ ఇప్పటి వరకు ఆయన నన్ను ఎంకరేజ్ చేస్తూనే ఉన్నారు. ఆయన వల్లే ఈ మూవీ ఇక్కడి వరకు వచ్చింది. ఆయన సహకారాన్ని ఎప్పటికీ మర్చిపోలేను' అని అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ కార్తిక్ మాట్లాడుతూ.. 'మురళీ మోహన్ లాంటి గొప్ప వ్యక్తి నటిస్తున్న చిత్రానికి నేను పని చేస్తుండటం ఆనందంగా ఉంది. డొక్కా సీతమ్మ అంటే ధర్మం. ధర్మం అంటే మురళీ మోహన్ అని అన్నారు.

## వరలక్ష్మి 'హాలీవుడ్' ఎంట్రీ

ప్రముఖ నటి వరలక్ష్మి శరత్‌కుమార్ హాలీవుడ్‌లో అడుగుపెట్టారు. ప్రఖ్యాత బ్రిటిష్ నటుడు జెరెమీ ఐరన్స్ సరసన నటిస్తున్నారు. వెటరన్ దర్శకుడు చంద్రన్ రత్నం దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం శ్రీలంకలో చిత్రీకరించారు. 'రిజానా ఎ కేజ్‌డ్ బర్డ్ అనే ఈ సినిమా ఒక నిజమైన కథ ఆధారంగా రూపొందించారు. ఈ ప్రాజెక్ట్ గురించి వరలక్ష్మి మాట్లాడుతూ.. ఆస్కార్ అవార్డు గెలుచుకున్న జెరెమీ ఐరన్స్ వంటి గొప్ప నటుడితో కలిసి పనిచేయడం నిజంగా ఒక కల నెరవేరినట్టు అనిపిస్తోంది. లయన్ కింగ్ సినిమాలో స్కార్ పాత్రకు ఆయనే వాయిస్ ఇచ్చారు. ఆ సినిమా అంటే నాకు చాలా ఇష్టం. ఇప్పుడా సినిమాకు వాయిస్ ఇచ్చిన ఆయనతో నేను నటించడం అనేది ఒక గొప్ప అవకాశం. చంద్రన్ రత్నం దర్శకత్వంలో పనిచేయడం కూడా నాకు గర్వకారణం. శ్రీలంకలోనే కాదు, ప్రపంచ సినిమాకే ఆయన కొత్త దారులు చూపిన దర్శకుడు. ఇలాంటి అద్భుతమైన అంతర్జాతీయ స్టార్స్‌తో కలిసి పనిచేసే అవకాశం నాకు దొరికినందుకు ఆనందంగా వుంది. ఇది నా కెరీర్‌లో మరిచిపోలేని ఒక మైలు రాయి అవుతుందని ఆమె అన్నారు. రిజానా ఎ కేజ్‌డ్ బర్డ్ మూవీ దక్షిణాసియా, అంతర్జాతీయ సినిమా మధ్య ఒక హిస్టారికల్ కొలాబ్రేషన్‌గా నిలవబోతోందని ఆమె చెప్పారు.





## దం దిగ దం సాంగ్ ఆవిష్కరణ

రాజ్ గురు బ్యానర్ పై రాజా దారపునేని నిర్మాతగా దయానంద్ గడ్డం రచనా దర్శకత్వంలో జూన్ 11వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం వర్జిన్ బాయ్స్. ఈ చిత్రంలో మిత్ర శర్మ, గీతానంద్, శ్రీహాన్, జెన్నీఫర్ ఇమాన్యుల్, రోనిత్, అన్షుల ముఖ్య పాత్రలు పోషించనున్నారు. స్మరణ్ సాయి సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రానికి వెంకట్ ప్రసాద్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేయగా జేడీ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. బబ్లు, కౌశల్ మంద, ఆర్జె సూర్య, సుజిత్ కుమార్, కేదార్ శంకర్, ఆర్జె శరన్, శీతల్ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రం నుండి విడుదలైన దం దిగా దం పాటకు ప్రణవ్ చాగంటి లిరిక్స్ అందించగా యాసిర్ నిసర్ తన స్వరాన్ని అందించారు. మార్తాండ కె వెంకటేష్ చిత్రానికి ఎడిటింగ్ పనిచేశారు. ఆదిత్య మ్యూజిక్ ద్వారా ఈ చిత్ర పాటలు మార్కెట్లోకి విడుదలయ్యాయి.




## మహాశివలీల నేపథ్యంలో చంద్రేశ్వర




మహాశివుడి బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకున్న చిత్రం 'చంద్రేశ్వర'. 'అదృశ్య ఖడ్గం' అనేది ట్యాగ్‌లైన్. శివ బాలాజీ ఫిలింస్ పతాకంపై బేబీ అఖిల సమర్పణలో సురేష్ రవి, ఆశా వెంకటేష్ హీరో హీరోయిన్లుగా జీవి పెరుమాళ్ వర్ధన్ దర్శకత్వంలో డాక్టర్ రవీంద్ర చారి నిర్మించిన ఆర్కియాలజీ సస్పెన్స్ అండ్ హారర్ థ్రిల్లర్ 'చంద్రేశ్వర' సినిమాకు సంబంధించి ఇప్పటి వరకు విడుదలైన పోస్టర్స్, టీజర్, ట్రైలర్ సాంగ్స్ మంచి స్పందన లభిస్తోంది. అన్ని పనులు పూర్తి చేసి జూన్ 27న ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా నిర్మాత రవీంద్ర చారి మాట్లాడుతూ.. ''శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అన్నట్లు 'చంద్రేశ్వర' మూవీతో నేను పరిశ్రమలోకి అడుగుపెడుతున్నాను. ఆర్కియాలజీ నేపథ్యంలో ఎమోషన్స్‌తో కూడిన సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. ఏ టెక్నాలజీ లేని ఆ కాలంలో మన పూర్వీకులు గొప్ప దేవాలయాలు నిర్మించారు. అప్పటి వారి జీనవ విధానం ఎలా ఉండేది? అనే అంశాలు ఆకట్టుకుంటాయి. ఆర్కియాలజీ బ్యాక్‌డ్రాప్‌లో ఇంత వరకు ఇలాంటి సినిమా రాలేదని గర్వంగా చెప్పగలం. ఈ సినిమాకు సంగీతం ప్రధాన హైలెట్‌గా ఉంటుంది. ఇందులో సాంగ్స్ అన్నీ అత్యద్భుతంగా వచ్చాయి. 'ఈశ్వరా.. నా పరమేశ్వరా', 'అఖిల అఖిల' డ్యూయెట్ సాంగ్, 'నమస్తే చిదంబరం' అనే సాంగ్.. ఇలా సాంగ్స్ అన్నీ వండర్‌ఫుల్‌గా వచ్చాయి. ప్రస్తుతం ఈ పాటలు ట్రెండ్ అవుతున్నాయి. సినిమా కూడా సస్పెన్స్, హారర్ అంశాలతో అత్యద్భుతంగా వచ్చింది. ఈ జర్నీలో నాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు అని తెలిపారు.

## ఆ పాత్రల మధ్య సంభాషణ అద్భుతం

### శివ బాలాజీ



విష్ణు నటించిన కన్నప్ప సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న క్రమంలో బుధవారం శివ బాలాజీ మీడియాతో చిట్ చాట్ చేశారు.

కన్నప్ప' కోసం చర్చలు జరుగుతూ ఉన్నాయి. ఆ టైంలో నాకు పాత్ర ఎందుకు ఇవ్వలేదు అని విష్ణుని మోహన్ బాబు అడిగారు. శివ బాలాజీ చేసే పాత్ర ఇందులో కనిపించలేదు అని విష్ణు అన్నారు. శివ బాలాజీ కచ్చితంగా ఉండాలి అని మోహన్ బాబు అన్నారు. దీంతో ఆ తరువాత కొన్ని రోజులకు మహదేవశాస్త్రి కొడుకు పాత్రకు నేను అయితే బాగుంటుందని అనుకున్నారు. అలా కన్నప్ప చిత్రంలోకి వచ్చేశాను. కన్నప్ప' చిత్రంలో నా పాత్ర నిడివి, ప్రాముఖ్యత కాస్త తక్కువగానే ఉంటుంది. కానీ ఓ గొప్ప చిత్రం, ప్యాన్ ఇండియన్ చిత్రంలో భాగం అవ్వాలనే ఉద్దేశంతో ఇంకేమీ ఆలోచించలేదు. న్యూజిలాండ్‌లో మొత్తం రెండు నెలలు ఉన్నాను. మోహన్ బాబు షూటింగ్ చేసినన్ని రోజులు నేను కూడా షూట్ చేశాను. ప్రస్తుతం మంచి కథలు వస్తేనే చేస్తున్నాను. నచ్చకపోతే దర్శక, నిర్మాతల మొహం మీదే చెబుతున్నాను. డబ్బుల కోసం సినిమాలు చేయాలని అనుకోవడం లేదు. నేను చేసిన 'రెక్కీ' మూవీకి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. 'సింధూరం' అనే మరో మూవీని చేశాను. ఇప్పుడు 'రెక్కీ 2' ఫీచర్ ఫిల్మ్‌గా రాబోతోంది. కన్నప్ప' సినిమాను నేను చూశాను. అద్భుతంగా వచ్చింది. మరీ ముఖ్యంగా సెకండాఫ్‌లో ప్రభాస్ ఎంట్రీ తరువాత రేంజ్ మారుతుంది. ప్రభాస్, విష్ణు పాత్రల మధ్య వచ్చే సంభాషణలు అద్భుతంగా అనిపిస్తాయి. మోహన్‌లాల్ ఎంట్రీ అందరికీ గూస్ బంప్స్ తెప్పిస్తుంది. అక్షయ్ కుమార్ క్యారెక్టర్ సర్ ప్రైజింగ్‌గా అనిపిస్తుంది. మోహన్ బాబు ఆన్ స్క్రీన్ వేరుగా ఉంటారు.. ఆఫ్ స్క్రీన్ వేరుగా ఉంటారు. విష్ణుతో 'మా' నుంచి పరిచయం. 'మా'కు పని చేస్తున్నప్పుడే మా ఇద్దరి మధ్య మంచి బంధం ఏర్పడింది. అలా ఫ్యామిలీ ఫ్రెండ్స్ అయ్యాం. మోహన్ బాబు దగ్గరవ్వడం కష్టం.. దగ్గరైతే అలా ప్రేమతో కట్టి పడేస్తారు. కెరీర్ ప్రారంభంలో వరుసగా మూడు ఫ్లాపులు వచ్చాయి. నా మొదటి హిట్ ఆర్య. నేను ప్రారంభంలోనే ఎత్తుపల్లాలు చూశాను. ఇప్పుడు నేను ఏ విషయాన్ని కూడా అంతగా పట్టించుకోను. నేను ఎవ్వరి నుంచి ఏమీ ఆశించను. అసలు ఈ పాత్రను మోహన్ బాబు చేయమని అన్నప్పుడు చాలా ఆలోచించాను. మరీ సైడ్‌కి అలా నిలబడే పాత్రను ఎలా చేయాలి? అని విష్ణుని అడిగాను. అది నీ ఇష్టం అని విష్ణు అన్నారు. మా ఆవిడ మధు కూడా అలానే అన్నారు. సరే అని ఒప్పేసుకున్నాను. కానీ ఈ చిత్రంలో, ఆ పాత్రను పోషించకపోతే చాలా మిస్ అయ్యేవాడ్ని. ఇప్పుడు నాకు ఆ పాత్ర గొప్పదనం అర్థమైంది. 'కన్నప్ప' సినిమాలో శివుడిగా అక్షయ్ కుమార్ అద్భుతంగా నటించారు. ఫస్ట్ డే ఆయన్ను షూట్‌లో చూసినప్పుడు షాక్ అనిపించింది. మనకు తెరపై ఆయన కనిపించే ఫస్ట్ సీన్‌కు మనం శివుడు అని ఫిక్స్ అయిపోతాం. అంతలా ఆ పాత్రలో ఆయన ప్రేక్షకుల్ని మెప్పిస్తారు.

## రాష్ట్ర ప్రజలకు సిఎం బోనాలు శుభాకాంక్షలు



ప్రజాపక్షం/హైదరాబాద్: బోనాల ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆషాఢమాసం బోనాల ఉత్సవాలతో రాష్ట్రంలో పండుగ వాతావరణం మొదలవుతుందని, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రతి ఒక్కరు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాక్షించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల్లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు బోనాల ఉత్సవాల ఏర్పాట్లు, భక్తుల సదుపాయాల కోసం రూ.20 కోట్ల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. చారిత్రాత్మక గోల్కొండలో వెలసిన జగదాంబిక ఎల్లమ్మ తల్లికి ఆషాడ మాసం తొలి బోనం సమర్పించడంతో జంటనగరాల్లో బోనాల సందడి నెలకొంటుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరు సుఖశాంతులతో, ఆయురోగ్యాలతో జీవించాలని, రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించే దిశగా తల్లి దీవెనలు ఉండాలని సిఎం ఆకాంక్షించారు.



## పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం

### సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి




ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రజా పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని సిపిఐ హైదరాబాద్ జిల్లా ఎస్.ఛాయాదేవి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) గోషామహల్ నియోజకవర్గ మొదటి మహాసభ సమావేశం లక్ష్మీ అధ్యక్షతన హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ?? దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు గడిచినప్పటికీ ప్రజల జీవితాలలో మార్పులు తీసుకురావడంలో పాలకవర్గాలు వైఫల్యం చెందాయని విమర్శించారు. కనీస అవసరాలైన ఉండేందుకు ఇల్లు, ఉపాధి అవకాశాలు దొరకని పరిస్థితిలో కోట్లాదిమంది ప్రజలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అట్టడుగు వర్గాల ప్రజల కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసి హక్కులు సాధించామని వివరించారు. భూ పోరాటం నుంచి మొదలుకుని అనునిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సామాజిక, ఆర్థిక సమస్యలపైన రాజీలేని పోరాటం కొనసాగిందని తెలిపారు. పోరాటాలు లేకుండా ఏ రాజకీయ పార్టీ, ఏ పాలకవర్గాలు కూడా నిర్ణయాలు తీసుకోబోరని చెప్పారు. ప్రజా అనుకూల నిర్ణయాలు చేయలేరన్నారు. కమ్యూనిస్టు పార్టీ చేసిన త్యాగాల మూలంగానే అనేక చట్టాలు వచ్చాయన్నారు. ప్రజలు, కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తున్నదని మండిపడ్డారు. 8 గంటల పని విధానం నుండి ప్రస్తుతం 12 గంటలు పని చేయాలని కార్మికుల శారీరక దోపిడికి కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. ప్రజలు, కార్మికుల జరిగే పోరాటంలో ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ సభ్యులు కళ్యాణ్, అనిల్, మదన్ సింగ్, శేఖర్, అరుణ్, నిర్మల, చంద్రకళ, ఈశ్వరిబాయి, అనంతమ్మ దుర్గాప్రసాద్, వంశీ, శారద, తదితరులు పాల్గొన్నారు. కాగా మహాసభలో కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్ గ్యార నరేష్, కో కన్వీనర్లుగా లక్ష్మీ మదన్ సింగ్, శేఖర్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో జడ్జిల వాంగ్మూలం..

### ఫోన్ ట్యాపింగ్ కేసులో దూకుడు పెంచిన సిట్ అధికారులు



ప్రజాపక్షం/హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు దూకుడు పెంచారు. ఫోన్ ట్యాపింగ్‌కు గురైన బాధితులందర్నీ విచారించడంలో దర్యాప్తు అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటి వరకు పోలీసు అధికారులు, డిజిపి స్థాయి అధికారులతో పాటు ఆయా రాజకీయ పార్టీల నేతల వాంగ్మూలాలను రికార్డు చేసిన సిట్ అధికారులు త్వరలో జడ్జిల వాంగ్మూలాలను కూడా రికార్డు చేయనున్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో జడ్జిలు కూడా బాధితులైన విషయం తెలిసిందే. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎస్ఐబి చీఫ్ టి.ప్రభాకర్ రావు జడ్జిల ఫోన్‌లు ట్యాప్ చేసినట్లు సిట్ అధికారుల వద్ద పక్కా సమాచారం ఉంది. ఈ సమాచారం మేరకు జడ్జిల నుంచి కూడా వాంగ్మూలం స్వీకరించే అవకాశం ఉంది. దీంతో పాటు సినీ ప్రముఖులను కూడా సిట్ అధికారులు విచారించనున్నారు.

### ఫోన్ ట్యాపింగ్ దిగజారుడు రాజకీయం: ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్

బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడి దిగజారుడు రాజకీయం చేసిందని ఎంఎల్‌సి బల్మూరు వెంకట్ పేర్కొన్నారు. సిట్ అధికారులకు బుధవారం ఆయనతో పాటు మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్ సొసైటీ ఛైర్మన్ ఫహీం ఖురేషిలు వాంగ్మూలం ఇచ్చిన తరువాత మీడియాతో మాట్లాడుతూ.. బిఆర్‌ఎస్ మూడోసారి అధికారం కైవసం చేసుకునేందుకు ఫోన్ ట్యాపింగ్‌తో ప్రత్యర్థుల కుటుంబాలను టార్గెట్ చేయడం నీచమైన చర్య అని అన్నారు. మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్ సొసైటీ ఛైర్మన్ ఫహీం ఖురేషి..తో పాటు వారి కుటుంబ సభ్యుల ఫోన్లు, మా ఫోన్లు కూడా ట్యాప్ చేశారని అన్నారు. మా ఫోన్లు ట్యాప్ చేసి... మమ్మల్ని ఎక్కడిక్కడ నిర్బధించడం, అరెస్టులు చేయడం చేశారని తెలిపారు. రాజకీయ నాయకుల కుటుంబ సభ్యుల ఫోన్లను సైతం ట్యాప్ చేయడం దారుణమన్నారు. వారి పర్సనల్ సంభాషణలు విని బ్లాక్ మెయిల్ చేయడం తీవ్రమైన నేరం అన్నారు. ఫోన్లు ట్యాపింగ్‌కు పాల్పడిన అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరుతాం అని అన్నారు.

## కిడ్నీరాకెట్ ముఠా కలకలం..

(మొదటి పేజీ తరువాయి)

పరిచయం చేసుకొని కిడ్నీలు మార్పిడి చేయిస్తామంటూ మాయమాటలు చెప్పి పెద్ద మొత్తంలో దందా చేస్తున్నట్లు వెల్లడించారు. చికిత్సకు అవసరమైన అనుమతులు, ధృవీకరణ పత్రాలు, రక్త నమూనాలు పోర్జరీ సంతకాలతో సిద్ధం చేసి ఆపరేషన్‌కు బాధితులను నీ దాతను తయారు చేసి డబ్బులు తీసుకుని ఇంకొద్ది సమయంలో అపరేషన్ అనగా ముఠా అక్కడి నుండి పారిపోయి డబ్బులు పంచుకుంటున్నట్లు తెలిపారు. గత ఏడాది డిసెంబర్ నెలలో కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన నరేష్ అనే వ్యక్తికి విజయవాడలో కిడ్నీ మార్పిడి చేయిస్తామంటూ పోర్జరీ స్టాంపులు గుంటూరులో తయారు చేయించి క్లియరెన్స్ సర్టిఫికెట్లపై ముద్దార్లు వేసి అతనిని నమ్మించి 22 లక్షల రూపాయలు ఆపరేషన్ సమయంలో డాక్టర్‌కు ఇవ్వకుండా వెళ్లినట్లు బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేసి ఈ ముఠా గుట్టు విప్పారు. ఇప్పటి వరకు సుమారు పదిమంది వరకు ఈ ముఠా చట్ట విరుద్ధంగా కిడ్నీలు మార్పిడి చేయించినట్లు వెల్లడైంది. ముఠాలో ఆరుగురు నిందితులు చిక్కగా, మరో నలుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో కడుపూరి తాతారావు, కొండం రమాదేవి, బొందిలి పృద్వీరాజ్, కొడాలి బాబురావు, కందుకూరి విష్ణువర్ధన్‌బాబు, మహ్మద్ సర్దార్‌లు పోలీసులకు చిక్కగా మరో నలుగురు పరారీలో ఉన్నారు. నిందితులను చాక్యచక్యంగా పట్టుకున్న సిఐ శివశంకర్, ఎస్ఐ సుధీర్‌లను డిఎస్‌పి అభినందించారు.

## జోక్యం చేసుకోండి

(మొదటి పేజీ తరువాయి)

భూములపై నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రం జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. 1960లలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన కోసం హైదరాబాద్ చుట్టుపక్కల విలువైన భూములను భారీ ఎత్తున రాయితీ ధరలకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు కేటాయించింది. అయితే కాలక్రమంలో వాటిలో అనేక సంస్థలు మూతపడ్డాయి లేదా ఉత్పత్తి నిలిపేశాయి. వాటి పరిధిలోని విస్తీర్ణ భూములు ప్రస్తుతానికి నిరుపయోగంగా ఉండడమే కాకుండా, కొన్ని సంస్థలు భూములను వాణిజ్య పరంగా వినియోగానికి మార్పు చేసుకోవాలన్న యత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోందని కుమారస్వామి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం తెలంగాణలో వివిధ జిల్లాల్లో ఉన్న ముఖ్యమైన సీపీఎస్‌యూలు కింద భూకేటాయింపుల వివరాలను పరిశీలిస్తే... హిందుస్తాన్ కేబుల్స్ లిమిటెడ్‌కు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 324.87 ఎకరాలు,సంగారెడ్డిలో హిందుస్తాన్ ఫ్లోరోకార్బన్స్ లిమిటెడ్‌కు 126.33 ఎకరాలు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో ఐడిపిఎల్‌కు 551.03 ఎకరాలు, హెచ్ఎంటికి 888.05 ఎకరాలు, అదిలాబాద్‌లో సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) 2,272.85 ఎకరాలు, సంగారెడ్డి ఎద్దుమైలారంలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి 3,020 ఎకరాల భూములు ఉన్నాయని శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ భూములు ఉపయోగంలో లేకుండా ఉండటం, పెట్టుబడులు ఉపసంహరించుకుంటూ ఎటువంటి ప్రత్యామ్నాయ ప్రణాళికలు లేకపోవడం రాష్ట్ర అభివృద్ధికి ఆటంకంగా మారుతుందని మంత్రి స్పష్టం చేశారు. సరైన పరిహారం లేకుండానే భూములను ప్రైవేట్ కంపెనీలకు బదిలీ చేయడం వల్ల రాష్ట్రానికి నష్టమే తప్ప ప్రయోజనం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యల పరిష్కారానికి కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టాలని, భూముల ఉద్దేశ్యపూర్వక వినియోగానికి మార్గదర్శకాలు రూపొందించాలని, రాష్ట్రానికి సముచిత ప్రయోజనం లభించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి శ్రీ కుమారస్వామిని మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేయగా అందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే ఈ విషయమై సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

## 5 శాతానికి పెంపు

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 45 దేశాల నాయకులు పాల్గొంటున్నారు. మొదటిరోజు సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా పాల్గొన్నారు. 2035వ సంవత్సరంనాటికి నాటో కూటమి దేశాలు క్రమంగా తమ తమ స్థూల జాతీయోత్పత్తిలో రక్షణ వ్యయాన్ని ఐదూశాతం మేరకు పెంచుతాయి. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ తోటి కూటమి దేశాల రక్షణకు పూర్తి భరోసా ఇచ్చారు. నాటో ఛాప్టర్‌లోని నిబంధనలలో అనేక అంశాలున్నాయన్నారు. 'మనం ఇక ఇప్పుడు ఒక కొత్త నాటో ఆవిర్భావానికి సాక్షులుగా ఉండబోతున్నాం, అంటే మరింత సమతుల్యమైన నాటో, యూరప్ భద్రతపట్ల మరింత ఎక్కువ బాధ్యతతో మెలగే నాటో ఆవిర్భావాన్ని మనం చూడబోతున్నాం' అని ట్రంప్ చెప్పారు. సదస్సు ప్రారంభానికి ముందు ట్రంప్ ఎయిర్‌ఫోర్స్ వన్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ, కూటమి వ్యక్తం చేస్తున్న భయాలను పారద్రోలారు. నాటో ఛార్టర్ ఐదవ అధ్యాయంలోని నిబంధనల ప్రకారం కూటమి దేశాల రక్షణకు సంబంధించి పరస్పరం ఒకరికొకరు సహాయం చేసుకోవాలన్న విషయంపై ట్రంప్ ప్రధానంగా స్పందించారు. నాటో కూటమి దేశాలకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని ట్రంప్ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా హేగ్‌లో నాటో కూటమి ప్రధాన కార్యదర్శి జనరల్ మార్క్ రట్టే మాట్లాడుతూ, ఈ విధంగా జిడిపిలో ఐదూశాతం అదనపు ధనాన్ని రక్షణ వ్యయానికి సమకూర్చడం యూరప్ దేశాలకు, కెనడాకు అంత తేలికైన విషయం కాదనీ, ఐనాగానీ ఇది అత్యంత కీలకమైన విషయమని అన్నారు. ముఖ్యంగా రష్యా నుండి ఎదురవుతున్న సవాళ్ళ కారణంగా, అంతర్జాతీయ భద్రతా పరిస్థితుల నేపథ్యంలో తమ మిత్రులందరూ ఈ అంశాన్ని ప్రధానంగా తెరమీదకు తీసుకువచ్చారని మార్క్ రట్టో చెప్పారు. అంతకుముందు బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ మాట్లాడుతూ, ఆర్థిక పరిస్థితులు అనుకూలిస్తే బ్రిటన్ రక్షణ వ్యయాన్ని 2024 నాటికి మూడూశాతానికి పెంచుతామన్నారు. కానీ సోమవారంనాడు ఆయన ప్రభుత్వం ఒక ప్రకటన చేస్తూ, 2027 నాటికి బ్రిటన్ జిడిపిలో జాతీయ భద్రతపై వ్యయాన్ని 4.1 శాతానికి పెంచుతామని అంచనావేసినట్లు పేర్కొంది. ఐతే రక్షణ రంగానికి ఖర్చుపెట్టే కీలకమైన 3.5 శాతం ఖర్చులను సమకూర్చుకోవడానికి 2035 వరకు అవకాశం లేదు. ఎందుకంటే ఈ మధ్య గడువు సమయంలో బ్రిటన్ రెండు సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కోవలసి ఉంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com